ఆదివారం
నేటి తరానికి మార్గదర్శి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 186 పేజీలు: 10+4 వెల: 6.50

## గురుకులాల్లో మళ్లీ ఫుడ్ పాయిజన్
విషాహారం తిని 150 గొర్రెలు మృతి
6

'ఉత్తరా'న జలవిలయం!


ధరాలి వీధుల్లో ప్రవహిస్తున్న భాగీరథి వరద


మంగళవారం ఉత్తరాఖండ్‌లోని ధరాలి గ్రామంపై ఉప్పెనలా విరుచుపడిన భాగీరథి

# బురద వరదలో కరిగిన 'ధరాలి'

కొట్టుకుపోయిన ఇళ్లు, హోటళ్లు
60 మందికి పైగా మృతి
ఉత్తరాఖండ్‌లో మరో నాలుగు రోజులు భారీ వర్షాలు

**డెహ్రాడూన్, ఆగస్టు 5:** ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలోప్రశాంతంగా ఉండే ధరాలి గ్రామం ఆకస్మిక వరదలు, కుంభవృష్టికి కొట్టుకుని పోయింది. సముద్రం మీదపడిందా అలలు ఒక్కసారిగా చుట్టుముట్టి గ్రామాన్ని తీసుకుపోయాయా అన్న వరద ఉధృతికి ధరాలి కనుమరుగయిపోయింది. భారీ ఎత్తున ఎగిసిపడిన బురద వరద ధరాలి గ్రామాన్ని కప్పేసింది. ఇపుడు ఆగ్రామం మరుభూమిలా మారిపోయింది. చార్‌ధామ్ యాత్రీకులు ఎక్కువగా ఈగ్రామానికి వస్తుంటారు. >>2

24 గంటల్లో భారత్‌పై
# మరిన్ని సుంకాలు!

**వాషింగ్టన్, ఆగస్టు 5:** భారత్‌పై రానున్న 24 గంటల్లోను అదనపు సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీచేసారు. అమెరికాకు వచ్చేభారత్ దిగుమతులపైనే ఈసారి సుంకాలు రెట్టింపుచేస్తామంటూ హెచ్చరించారు. రష్యా నుంచి >>2




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక
రష్యా చమురు కొనుగోలుతో భారత్‌పై అమెరికా ఆగ్రహం

# దారులు విస్తరించండి

పెండింగ్ ప్రాజెక్టులను అనుమతించాలని కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి, ఎంపి జితేందర్ రెడ్డి
ఎన్‌హెచ్ -65 విస్తరణకు కేంద్రం సానుకూలం
అంచనాలు రూపొందించి టెండర్లు పిలుస్తామన్న గడ్కరీ


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల విస్తరణకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కారి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించిన మంజూరీపై గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ఎంపి జితేందర్ రెడ్డిలు సుదీర్ఘంగా సమావేశమై చర్చించారు. హైదరాబాద్-విజయవాడ విషయంలో మల్కాపూర్ నుంచి విజయవాడ (అమరావతి) వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు సర్వీస్ రోడ్లను నిర్మించాలని గడ్కరీని కోరారు. డెత్ రోడ్డుగా పిలిచే హైదరాబాద్-విజయవాడ రహదారిపై (ఎన్‌హెచ్-65) జూలై 27 న జరిగిన ప్రమాదంలో ఏపికి చెందిన ఇద్దరు డిఎస్‌పిల మృతి చెందిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకురావడంతో కేంద్రమంత్రి చలించిపోయారు. 5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపిగా ప్రతీరోజు ప్రమాదాల వార్తలను వినడం, కొన్నిసార్లు ప్రత్యక్షంగా చూడటం బాధ కలిగిస్తుందని తన ఆవేదనను గడ్కరీతో పంచుకున్నారు. మంత్రి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ ఆగస్టు 15వ తేదీన నిర్వహించే ఫైనాన్స్ మీటింగ్‌లో ఎన్.హెచ్-65 విస్తరణను ఆమోదిస్తామని తెలిపారు. త్వరితగతిన అంచనాలు రూపొందించి పంపాలని, వెంటనే టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చారు. సంగారెడ్డి నుంచి చౌటుప్పల్‌కు సంబంధించిన రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ పూర్తి చేసిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని గడ్కరీని కోరిన మంత్రి 4 వరుసలుగా నిర్మించాలనుకున్న రీజినల్ రింగ్ రోడ్డును భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 6 వరుసలుగా నిర్మించేందుకు ఎస్టిమేషన్లు మార్పు చేస్తున్నామని, టెండర్లను సైతం అందుకు అనుగుణంగా ఫైనలైజ్ చేస్తమని గడ్కరీకి వివరించారు. సవరించిన అంచనాలతో మూడు నెలల్లో ఉత్తర భాగం పనులు మొదలు పెట్టాలని, అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం కూడా యుద్ధప్రతిపాదికన ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని గడ్కరీని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఇండస్ట్రీయల్ కారిడార్‌గా రూపుదిద్దుకొనున్న నేపథ్యంలో వేగంగా పనులు చేపడితే అనుకున్న వ్యయంలోనే భూసేకరణ >>2

కాళేశ్వరంపై
## చర్చకు కెసిఆర్?
అసెంబ్లీలో జవాబు ఇచ్చేందుకు సిద్ధం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు5:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదిలో పేర్కొన్న అంశాల ఆధారంగా అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు స్వయంగా అసెంబ్లీలోనే బదులిచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. కొంతకాలంగా అనారోగ్యం, ఇతర కారణాలతో సభకు దూరంగా ఉన్న కేసీఆర్, ఈసారి తప్పకుండా అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వెనుక ఉన్న ఉద్దేశం, డిజైన్లు, నిర్మాణం వంటి అన్ని అంశాల >>2


మంగళవారం న్యూఢిల్లీలో సిఇసితో భేటీ అయిన కెటిఆర్, వినోద్‌కుమార్, సురేష్ రెడ్డి

# మళ్లీ బ్యాలట్ కావాలి

ఇవిఎంలు వద్దు.. ఢిల్లీలో సిఇసిని కోరిన కెటిఆర్ బృందం
కారును పోలిన 8 సింబల్స్‌ను తొలగించాలని వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు5:** ఎన్నికల నిర్వహణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) వాడకంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటి స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. మంగళవారం నాడు ఢిల్లీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారులతో సమావేశమై పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించింది. ఈవీఎంల విశ్వసనీయతపై గత కొన్నేళ్లుగా అనేక సందేహాలు తలెత్తుతున్నాయని, చాలా రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ తమ వినతిపత్రంలో పేర్కొంది. అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్ వంటి అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాలు కూడా జాతీయ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్లనే వాడుతున్నాయని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో, ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని అమలు చేయాలని కోరింది. అదేవిధంగా, బీహార్‌లో ప్రస్తుతం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి చర్యలు చేపట్టడం అనవసరమని, దీనివల్ల వలస కార్మికులు, బలహీన వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లు పెద్ద ఎత్తున తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సవరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. తమ పార్టీకి కేటాయించిన కారు గుర్తును పోలిన గుర్తులను ఫ్రీ సింబల్స్‌గా కేటాయించడంపై బీఆర్ఎస్ మరోసారి తన అభ్యంతరాన్ని వినిపించింది. ముఖ్యంగా కెమెరా, చపాతీ రోలర్, డోలీ, రోడ్ రోలర్, టీవీ వంటి 8 గుర్తులు బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలపై చిన్నగా కనిపించినప్పుడు ఓటర్లను, ముఖ్యంగా >>2

## వివేకా హత్యపై విచారణ పూర్తి
సుప్రీం కోర్టుకు వెల్లడించిన సిబిఐ
ఎంపి అవినాష్‌రెడ్డి సహా ఇతర నిందితుల బెయిలు రద్దుపై విచారణ వాయిదా
7



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఢిల్లీలో 'బిసి' గర్జన


ఢిల్లీకి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

# నేడు మహాధర్నా

సిఎం రేవంత్ ఆధ్వర్యంలో ఆందోళన
పాల్గొననున్న రాహుల్ గాంధీ, కూటమి మిత్రపక్షాలు
హస్తినకు చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, బిసి నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు5:** బీసీ రిజర్వేషన్ల పోరాటం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుంది. జితనీ ఆబాదీ.. ఇతనీ హిస్సేదారి (ఎంత జనాభాకు అంత వాటా) అనే రాహుల్ గాంధీ నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పట్టు వీడకుండా ప్రయత్నిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు విద్యా, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో జంతర్‌మంతర్‌లో బుధవారం ధర్నా చేపట్టనున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలో సాగుతున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చే బాధ్యతను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన భుజాలకు ఎత్తుకున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (ఎస్ఈఈఈపిసి) చేపట్టి.. ఆ లెక్కల ఆధారంగా రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. వాటికి ఆమోదముద్ర వేయించాల్సిన బాధ్యత ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై ఉంది. రాష్ట్ర శాసనసభలో >>2

వేల కోట్లు దోచుకునే వారికే
## మంత్రి పదవులు
నేనెవరికీ తలవంచను
ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారా.. లేదా అన్నది మీ ఇష్టం
హాట్ హాట్‌గా రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు



**ప్రభాతవార్త - భువనగిరి:** కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన నాయకుల మాటలను నమ్మి వచ్చా.. కాంగ్రెస్ పార్టీలో చేరా.. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నా.. మంత్రి పదవి ఇస్తారా.. ఇవ్వరా అది మీ ఇష్టం అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో మంగళవారం సబ్‌స్టేషన్‌ను ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీని గెలిపించమని అన్నారు. ఎంపీని గెలిపించుకున్నా.. నేను ఎవ్వరికి బయపడను, నేను మంత్రినే >>2


మంగళవారం తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తున్న మాజీ మంత్రి హరీష్

# కాటన్‌లా చరిత్రలో నిలిచే కెసిఆర్

తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ
రిపోర్టుపై అసెంబ్లీలో చీల్చి చెండాడుతాం
పిపిటిలో హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు5:** రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజీని కట్టి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్ తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హారీశ్‌రావు పోల్చారు. కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భండా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. బ్రిటీష్ పాలనా కాలంలో ధవళేశ్వరం బ్యారేజీని ఆర్థర్ కాటన్ నిర్మించారని.. రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు అందించారని హారీశ్ కొనియాడారు. ఆ రోజుల్లోనే కాటన్ మీద బ్రిటీష్ ప్రభుత్వం హెమింగ్టన్ >>2



ఘోష్ రిపోర్టు చూసి తేలు కుట్టిన దొంగల్లా భయపడుతున్నారు
ప్రజలకు క్షమాపణ చెప్పండి
హరీష్ మాటలపై మండిపడిన మంత్రి ఉత్తమ్

# కెసిఆర్, హరీష్‌ల బండారం బట్టబయలు

**హైదరాబాద్,అగస్టు 5, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్ఎస్‌కు చులకనభావం. చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం, నమ్మకం లేదని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీ డియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో నియమించిన జ్యుడిషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదని, ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదన్నారు.. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పుకోవాలనే సోయి కూడా లేకపోయిందని ఆయన విమర్శించారు.పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన ఎన్డీఎస్ఏ మీద నమ్మకం లేదు.మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసిఘోష్‌ను అవమానిస్తున్నారాని ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం >>2



ఉపాధ్యాయుల పదోన్నతులకు హైకోర్టు
## గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న పదోన్నతుల ప్రక్రియ సాఫీగా సాగనుంది. పదోన్నతుల కంటే ముందు బదలీలు నిర్వహించాలని.. బదలీలు నిర్వహించిన అనంతరమే పదోన్నతులు కల్పించాలని పేర్కొంటూ కొందరు ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారనకు స్వీకరించిన >>2



న్యూఢిల్లీలో మంగళవారం ఫిలిప్పీన్స్ రిపబ్లిక్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

# మరిన్ని సుంకాలు!

>> చమురుకొనుగోళ్లను నిలిపివేయలేదని, దీనివల్ల ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఇప్పటికీ కొనసాగిస్తున్నదంటూ మండిపడ్డారు. అమెరికాకు భారత్ ఎంతమాత్రం మంచి వాణిజ్య భాగస్వామి కాదని, భారత్ మాతోతో ఎంతో వ్యాపారంచేసి లాభపడిందని, అయితే అమెరికా భారత్‌తో బిజినెస్ మాత్రం తక్కువగానే ఉందని ఆయన గుర్తుచేశారు. అందువల్లనే తాము 25శాతం సుంకాల విధింపుకు సిద్ధం అయ్యామని అయితే రానున్న 24 గంటల్లో ఈసుంకాలను మరింతగా అంటే గణనీయంగాపెంచాలనినిర్ణయించినట్లు ప్రకటించారు. ఇప్పటికీ భారత్ రష్యా చమురును కొనుగోలుచేయడం మానుకోలేదని ఒక ఆంగ్ల టెలివిజన్ ఇంటర్వ్యూలో ప్రకటించారు. ముడిచమురు విక్రయించి భారత్ అధికలాభాలు గడిస్తోందన్నారు. ఇందుకు ప్రతిగా భారత్‌సైతం ధీటుగా స్పందించింది. అమెరికా,యూరోపియన్ దేశాలు భారత్ రష్యానేరలనుంచి ఎగుమతులపట్ల విముఖత వ్యక్తంచేయడం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా భారత్‌ముడిచమురు దిగుమతులుచేసుకుంటుందన్నారు. మమ్మల్ని విమర్శిస్తున్న దేశాలన్నీ కూడా ముడిచమురు కొనుగోళ్లలో రష్యాతో కలిసి కొనసాగుతున్నాయని, ఈపరిస్థితుల్లో అమెరికా మాపై ఆంక్షలు ప్రకటించడమేమిటని విదేశాంగశాఖప్రకటించింది. యూరోప్ రష్యా వాణిజ్యం అంటే కేవలం ఇంధనం ఒక్కటే కాదని, ఎరువులు, మైనింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఇనుము ఉక్కు, భారీ యంత్రపరికరాలు, రవాణా సామగ్రి వంటివికూడా ఉన్నాయని భారత్ గుర్తుచేసింది. దేశ శ్రేయస్సును పరిగణనలోనికి తీసుకుని అన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. యూరోపియన్‌యూనియన్ రష్యాతో గత ఏడాది 78.02బిలియన్ డాలర్ల వాణిజ్యంచేసిందని స్పష్టంచేసింది. అలాగే ఎల్ఎన్‌జి అంటే ద్రవరూప గ్యాస్ 16.5 మిలియన్ మెట్రిక్‌టన్నులు దిగుమతిచేసుకున్నదని అన్నారు. గతనెల 31వ తేదీనుంచేభారత్ అమెరికాకుమధ్య అగాధం పెరుగుతూ వచ్చింది. ట్రంప్ 25శాతం సుంకాలుప్రకటించినప్పటినుంచి ఈ వివాదంపెద్ద దవుతూ వస్తోంది. అంతేకాకుండా కొన్ని అస్పష్టమైన, ప్రత్యేక సుంకాలు కూడా అవసరమైతే విధిస్తామని అన్నారు. ఎన్ఎస్ఏ అజిత్‌దోవల్ రష్యాకు ఈ వారంలోనే పర్యటించనున్నారు. అలాగే విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్‌కూడా రష్యాలో పర్యటించేవీలుంది.

# దోచుకునే వారికే మంత్రి పదవులు

>> కావాలనుకుంటే ఎల్‌బి.నగర్ నుంచి పోటీ చేసే వాడిని. పదవీ కోసం ఎవ్వరి ఇంటికి వెళ్లి కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడను. అదృష్టం వస్తే ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా. నాకంటే జూనియర్లు, ఈ పార్టీ.. ఆ పార్టీల నుంచి వచ్చిన వారికే మంత్రి పదవులు ఇచ్చారు. మిమ్ములను నమ్ముకుని పార్టీలోకి వచ్చాను. మీరు ఇస్తానని హామీ నెరవేరవేరుస్తారని ఆశిస్తున్నా. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కేసిఆర్ ప్రభుత్వాన్నే మునుగోడు ప్రజల కాళ్ల వద్దకు తీసుకువచ్చాననని, తనకు పదవులు ముఖ్యం కాదని, మునుగోడు ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు. అవసరమైతే ఎంతటి త్యాగానికైనా మరోసారి సిద్ధమే నని, మంత్రి పదవి కావాలా.. మునుగోడు ప్రజలు కావాలా అంటే నాకుమునుగోడు ప్రజలేకావాలని చెబుతాననికోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి.

# వచ్చే ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు

**ఢాకా, ఆగస్టు 5:** బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది అంటే 2026 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయని కేర్‌టేకర్ ప్రధానమంత్రి మహ్మద్‌యూనస్ ప్రకటించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బంగ్లాలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిసానతమని ప్రకటించారు. ప్రభుత్వం తరపున తాను ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖరాయనున్నట్లు తెలిపారు. 2026 ఫిబ్రవరిలో రంజాన్‌మాసానికి ముందే ఎన్నికలకు నిర్వహణ ఏర్పాట్లుచేయాలని కోరనున్నట్లు తెలిపారు. యూనస్ మంగళవారం దేశప్రజలనుద్దేశించిమాట్లాడారు. ప్రధానిగా షేక్ హాసీనాను పదవీచ్యుతురాలినిచేసి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన తమ తాత్కాలిక పాలనపై దేశప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం 85 ఏళ్ల మహ్మద్‌యూనస్ ప్రస్తుతం బంగ్లాకు తాత్కాలిక ప్రభుత్వ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకూ ప్రభుత్వానికి ఆయన ప్రధాన సలహాదారుగానే ఉంటారని ఎన్నికలనంతరం తాను దిగిపోతానని చెప్పారు.

# కాళేశ్వరంపై చర్చకు కెసిఆర్?

>> గురించి ఆయన సభలో స్వయంగా వివరించనున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న నేపథ్యంలో, కేసీఆర్ సభకు హాజరైతేనే ప్రజల్లో ప్రభుత్వ వాదన నిజం కాదని చెప్పే అవకాశం ఉంటుందని కెసిఆర్ సన్నిహిత వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్ ఈ సమావేశాలకు గైర్హాజరైతే, ప్రభుత్వ ఆరోపణలు నిజమే ననే అభిప్రాయం ప్రజల్లో కలిగే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. కాళేశ్వరంతో రాష్ట్రానికి ఆర్థిక నష్టం జరిగిందని కెసిఆర్ వల్లేనని ఘోష్ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో ఆయన స్వయంగా అసెంబ్లీకి వివరించడమే సమంజసమని పలువురు పేర్కొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడటం రాజకీయంగా ఒక వ్యూహాత్మక అడుగుగా పరిగణించవచ్చు. ఆయన సభలో స్వయంగా మాట్లాడటం ద్వారా ఈ అంశంపై జరుగుతున్న చర్చకు ముగింపు పలకాలని, ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలని భావిస్తున్నారు. ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలు కేసీఆర్, ప్రస్తుత ప్రభుత్వం మధ్య వాడివేడిగా జరిగే వాదోపవాదాలకు వేదిక కానున్నాయి. కాళేశ్వరంపై వచ్చిన పీసీ ఘోష్ నివేదికపై అన్ని పక్షాలు మాట్లాడాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారు. సభా నిర్ణయం మేరకే చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు.

# కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మె

## వేతనాలు పెంచే ప్రసక్తే లేదు: గిల్డ్ నిర్మాతలు

**హైదరాబాద్, అగస్టు 5, ప్రభాతవార్త:** వేతనాలు పెంపు విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభన కొనసాగుతోంది. తమ డిమాండ్ల సాధనకై తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చెందిన ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోపక్క తెలుగు సినిమా పరిశ్రమలో నెలకొన్న వేతనాల పెంపు వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సోమవారం ప్రొడ్యూసర్ల చర్చలు అసంపూర్తిగా ముగియడంతో మంగళవారం మరోసారి రెండు గంటల పాటు గిల్డ్ నిర్మాతల సమావేశం కొనసాగింది. ఈ చర్చల అనంతరం ఫిల్మ్ ఎంప్లాయిస్ డిమాండ్ల మేరకు వేతనాలు పెంచే ప్రసక్తే లేదని గిల్డ్ నిర్మాతలు తేల్చి చెప్పారు. అలాగే తమ సినిమాల షూటింగ్ లు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. షూటింగ్లకు ఎవరూ అడ్డురావద్దని, ఎవరైన మా షూటింగ్ కు వచ్చే కార్మికులను అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గిల్డ్ నిర్మాతలు హెచ్చరించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిల్మ్ ఛాంబర్‌తోనే తమ అసోషియేషన్ ఉంటుంద తెలిపారు. ఛాంబర్ ప్రతినిధులతో మంచు విష్ణు చర్చలు జరిపారన్నారు. అలాగే సినీ కార్మికులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని, ఫెడరేషన్ ఏకపక్ష నిర్ణయాలతో చిన్న నిర్మాతలు నలిగి పోతున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఐటీ ఉద్యోగులకంటే ఎక్కువగా కార్మికుల జీతాలిస్తున్నామని, కార్మికులు ఫిల్మ్ ఛాంబర్తో కలిసివస్తారని ఆశిస్తున్నామని ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 06-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి మ.2.04
మూల మ.12.56
వర్జ్యం : రా.10.56-12.37
దు.ఉ.11.49-12.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**వృషభం :** సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తీరతాయి.

**మిథునం:** అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. సన్నిహితుల నుండి ధనలాభం పొందుతారు.

**కర్కాటకం :** స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**సింహం:** ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. వైద్య, పారిశ్రామిక రంగాలవారికి అనుకూలమైన కాలం.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.

**తుల :** ముఖ్యమైన పనులు సోదరులతో సకాలంలో పూర్తిచేస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**ధనుస్సు:** సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు

**మకరం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన ప్రయత్నాలలో విజయంసాధిస్తారు.

**కుంభం:** వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి.

**మీనం :** జీవితభాగస్వామితో విభేదాలు రాకుండా తగుజాగ్రత్తలు పాటించండం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మళ్లీ బ్యాలట్ కావాలి

>> నిరక్షరాస్యులు, వృద్ధులను గందరగోళానికి గురిచేస్తున్నాయని తెలిపింది. ఈ గుర్తుల వల్ల గతంలో తమకు రావాల్సిన ఓట్లు పక్కదారి పట్టాయని, 2019 భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని ఉదహరించింది. ఈ 8 గుర్తులను తక్షణమే తొలగించాలని కోరింది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో తాము చేసిన ఫిర్యాదులపై ఈసీ సకాలంలో స్పందించలేదని బీఆర్ఎస్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

ప్రత్యర్థి పార్టీల నేతల వివాదాస్పద వ్యాఖ్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగిందని ఆరోపించింది. కేటీఆర్ నేతృత్వంలోని ఈ బృందంలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్, సీనియర్ నేతలు బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బండారం బట్టబయలు

>> ఎన్ని అవకతవకలకు పాల్పడిందని, ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడిషియల్ కమిషన్ విచారణలో బయటపడిందన్నారు..అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు భండారం బట్టబయలైందని, అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీష్ రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని విమర్శించారు.వాస్తవాలు దాచిపెట్టి ప్రజలను మభ్యపెట్టిన బీఆర్ఎస్ నేతల నిజస్వరూపాన్ని జ్యుడిషియల్ కమిషన్ బయటపెట్టిందని,. జస్టిస్ పీసీఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించిందని,. అది రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీష్ రావు మరిచిపోయినట్లున్నారంటూ ఎద్దేవాచేశారు.ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు బదులు కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటి నుంచి డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వరకు జరిగిన అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపిందని,ఎవరెవరు తప్పులు చేశారో.. ఎవరెవరు అందుకు బాధ్యులనే వివరాలను కూడా ఈ నివేదికలో వెల్లడించిందన్నారు.మేమేం తప్పు చేయలేదని మీ పార్టీ ఆఫీసులో తప్పులు మాట్లాడి తెలంగాణ ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారని ప్రశ్నించిన ఉత్తమ్‌అప్పటి సీఎం కేసీఆర్, ఆనాడు మంత్రిగా ఉన్న హరీష్ రావును కూడా పీసీ ఘోష్ కమిషన్ విచారించిందని, వారిద్దరు స్వయంగా జ్యుడిషియల్ కమిషన్ ఎదుట హాజరయ్యారని గుర్తు చేశారు. పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీష్ రావు.. ఆరోజు కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదన్నారు. హరీష్ అబద్ధపు సాక్ష్యాలు బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయని, ఆయన చేసిన తప్పులన్ని బయటపడ్డాయన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణలో కేసీఆర్ పాత్ర ఏమిటో.. హరీష్ రావు చేసిన ఘనకార్యాలేమిటో తేలిపోయిందన్నారు.ఇప్పుడు ప్రభుత్వం ఈ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోందని, అందుకే. పార్టీ ఆఫీసుకు వచ్చి ఏకంగా జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని,న్యాయబద్ధ కమిషన్‌కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లిందన్నారు.ఇంకా ఎన్నిరోజులు ఇలా తెలంగాణ ప్రజల కళ్లుగప్పి,మభ్యపెడతారు.విచారణ కమిషన్ తేల్చిన విషయాలపైనా, ఇచ్చిన నివేదికపైన అసెంబ్లీలో చర్చిస్తామని ప్రజా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు,న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై మా ప్రభుత్వానికి గౌరవముందని, అందుకే అసెంబ్లీలో ఈ నివేదికను చర్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కాళేశ్వరంలో దోషులుగా తేలినా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా ప్రభుత్వం ఆహ్వానించిందన్నారు.అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలి. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు, మేం విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్ష సాధింపాని ప్రశ్నించారా. కమీషన్ల కక్కుర్తితో ప్రజలను, రైతులను పదేళ్లపాటు మోసం చేశారు, ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచిపెట్టారు.. నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీల నిర్మాణం వద్దని చెపితే తొక్కిపెట్టారు.. బ్యారేజీలు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారన్నారు.కుంగి పోయే ప్రాజెక్ట్ కట్టినందుకు సిగ్గుపడాల్సింది పోయి ఈరోజు హరీష్ రావు కొత్త రికార్డు సృష్టించారని,అది తమ గొప్పతనం అని జనం చెవిలో పువ్వులు పెట్టె ప్రయత్నం చేశారన్నారు.ఒక్క మాట కూడా నిజం చెప్పకుండా దూప్ ప్రెసెంటేషన్ మరో సారి ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రయోజనాలను పాతరపెట్టి, ఆర్థికంగా లక్ష కోట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన బీఆర్ఎస్ లీడర్లకు నైతికంగా మాట్లాడే హక్కు కూడా లేదన్నారు.

# చరిత్రలో నిలిచే కెసిఆర్

>> కమిషన్ వేసిందని... ఆ కమిషన్ కాటన్ ను 900 ప్రశ్నలు అడిగి ఎంతో కాలం వేధించిందని తెలిపారు. అయినా, చివరకు ఏం జరిగింది? ఇప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ నిలిచిపోయారని అన్నారు. అదే విధంగా చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు. తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని హరీశ్ అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ కు కూడా తెలుసని వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీలోకి నీళ్ల పోయడానికి రూ. 6 వేల కోట్లకు టెండర్లను ఫైనల్ చేశారని... మల్లన్నసాగర్ కాళేశ్వరంలో భాగమేనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు. 60 పేజీలతో కూడిన రిపోర్టు కాకుండా అసెంబ్లీలో 655 పేజీల రిపోర్టు పెట్టండి.. చీల్చి చెండాడుతామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. కాళేశ్వరం కమిటీ ఇచ్చిన రిపోర్టు మొత్తం ట్రాష్‌లాగా ఉందని, చరిత్రలో ఇలాంటి కమిషన్ల రాజకీయ వేధింపుల కోసం రిపోర్టులు ఇచ్చారు.. కానీ అలాంటివి ఏవీ న్యాయస్థానాల్లో నిలబడలేదు అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రాజెక్టును రివ్యూ చేయడం ఒక సీఎం బాధ్యత. ప్రజలకు త్వరితగతిన నీళ్లు ఇవ్వడం అనేది బాధ్యతాయుతమైన ప్రభుత్వం చేసే పని అని పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టును చూస్తుంటే ట్రాష్, బేస్‌లెస్‌గా ఉంది. రాజకీయ వేధింపుల కోసం ఇలాంటి రిపోర్టులు ఎన్నో వచ్చాయన్నారు. ఇందిరా గాంధీ మీద అప్పటి జనతా ప్రభుత్వం షా కమిషన్, చంద్రబాబు మీద కూడా అనేక కమీషన్లు వచ్చాయి. కానీ కోర్టుల్లో నిలబడలేకపోయాయన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ రిపోర్టులు. ప్రజాక్షేత్రంలో నిలబడలేవు, ఎప్పటికైనా ధర్మమే గెలుస్తది. సత్యమే నిలబడుతది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కమీషన్లు, కేసుల పేరిట వరుసగా ఎలక్ట్రిసీటి స్కాం, కాళేశ్వరం కమీషన్, గొర్రెల స్కాం, ఈ కార్ రేసింగ్ అంటూ ఏదో ఒకటి పెట్టి తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నం రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని ఆరోపించారు. ఆయన ఫెయిల్యూర్స్ మీద చర్చ జరగకుండా ప్రజలు తిగబడకుండా ఒక సీరియల్ మాదిరి ప్రభుత్వాన్ని నడుపుతున్నాడని వ్యాఖ్యానించారు. కార్తీక దీపం సీరియల్.. ఇది అయిపోగానే గుడి గంటలు, బ్రహ్మముడి సీరియల్ వస్తది. ఈ సీరియల్స్ మాదిరి నడిపిస్తున్నడు ప్రభుత్వాన్ని అని పేర్కొన్నారు. ప్రజలకు నిజాలు చెప్పు. రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి, కేవలం కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని, హింసించాలనే ధోరణితో రేవంత్ ఉన్నాడని అన్నారు. కానీ రైతులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి మాత్రం లేదు. కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. కానీ మోటార్లు ఆన్ చేయడం లేదు, నీళ్లు ఇవ్వడం లేదు.. రైతులను ఇబ్బంది పెడుతున్నాడు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 2007 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నది. తమ్మిడిహట్టి దగ్గర దమ్మిడి పని కూడా ఎందుకు చేయలేదు. ఇప్పుడు కూడా రెండేండ్లు అవుతుంది. తమ్మిడిహట్టి దగ్గర తట్టెడు మంట్టి ఎందుకు ఎత్తలేదన్నారు. ఏ బేసిన్‌లో తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని నిర్ణయించారు. నీటి లభ్యత లేదు. మహారాష్ట్ర ఒప్పుకోవడం లేదన్నారు. మేడిగడ్డ మీద మేం ప్రాజెక్టు కట్టేందుకు ఒక బేసిస్ ఉంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో మహారష్ట్రతో మూడు అగ్రిమెంట్లు చేసుకున్నామన్నారు.

# నేడు మహాధర్నా

>> బీసీ రిజర్వేషన్ల బిల్లులకు మద్దతు పలికిన బీజేపీ నాయకులు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా ముస్లింలను సాకుగా చూపి భావోద్వేగ రాజకీయాలకు తెరలేపుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు జంతర్‌మంతర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు. ధర్నాలో పాల్గొనేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, వివిధ జిల్లాల నాయకులు ప్రత్యేక రైలులో ఢిల్లీ చేరుకున్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు సంబంధించి జంతర్‌మంతర్‌తో పాటు ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

**ధర్నాకు రాహుల్ గాంధీ**

బీసీ రిజర్వేషన్ల సాధనకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగే పోరుకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, వామపక్షాలు, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీల నాయకులు హాజరై తమ సంఘీభావం తెలపనున్నారు



భాగీరథి వరదకు ధ్వంసమైన ఇళ్లు



బురదమయమైన ధరాలి గ్రామంలోని పలు వీధులు

# బురద వరదలో కరిగిన 'ధరాలి'

>> యాపిల్స్ ఎక్కువ ఉండే రాష్ట్రంలోని హర్సిల్‌లోయ ఈ గ్రామానికికేవలం ఆరు కిలోమీటర్లదూరంలోఉంది. ధరాలి సమీపంనుంచే భాగీరథి నది కొనసాగుతుంది. రిషికేశ్‌నుంచి బయలుదేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్‌మీదుగా ధరాలికి వస్తారు. సముద్ర మట్టానికి సుమారు 2780 మీటర్ల ఎత్తున ఉన ఈ గ్రామంనుంచి గంగోత్రిధామ్‌కేవలం 20 కిలోమీటర్లే. ఈగ్రామంలో భారీ సంఖ్యలో గెస్టుహౌస్‌లు, లాడ్జిలు కూడా ఉన్నాయి. సమీపంలోనే నీలాంగ్ లోయకూడా ఉంది. భారత్ టిబెట్ మధ్య వాణిజ్యం కొనసాగే పాతమార్గం ఇక్కడినుంచేపోతుంది. ధరాలిసమీపంలోని హర్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్‌తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రీకులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడే ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్‌తాల్‌ప్రదేశానికి ట్రెక్కింగ్‌కువెళ్లేవారికి ఈప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీకి సమీపంలోని ఖీర్‌గడ్ నదీపరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలకు నీరునిలిచి పోయింది. ఒక్కసారిగా ఈనీరంతా ధరాలిమార్కెట్‌పై విరుచుకుపడింది. దీనితో ఈగ్రామం కనుమరుగయిపోయింది. ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి పుష్కరసింగ్ ధామి మొత్తం అందరూ ఈభారీ ఆకస్మిక దుర్ఘటనకు విస్తుపోయారు. ప్రజలను అప్పటికే సురక్షితప్రాంతాలకు తరలించడంతో పెనుముప్పు తప్పింది. అయినా కూడా 60మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ మెరుపువరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టుకునిపోయాయి. 12మందికిపైగా శిథిలాలకింద చిక్కుకుని చనిపోయి ఉంటారని గ్రామస్తులు చెపుతున్నారు. భయంతో కేకలు వేస్తూ ఎత్తయిన ప్రాంతాలకు పరుగులుతీసారు. ఈనెల 10వ తేదీవరకూ ఉత్తరాఖండ్‌లోనికొండప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనావేసింది. పర్యాటకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వెల్లడించింది.

**సిఎంతో ఫోన్‌లో మాట్లాడిన అమిత్‌షా**

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫోన్‌లో మాట్లాడారు. వరదల ధాటికి ధరాలి గ్రామంలో జరిగిన భారీ విధ్వంసం గురించి మాట్లాడారు. కేంద్రం నుంచి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల కోసం ధరాలికి వెళ్లాలని ఎన్‌డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలను ఆయన ఆదేశించారు. ధరాలి ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ధరాలీ వార్త చాలా బాధాకరమన్నారు. ప్రస్తుతం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం సహా సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 10 వరకు ఉత్తరాఖండ్‌లో, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీనితో స్థానికులు, పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు.

# ఆకస్మిక వర్షానికి ఆర్మీబేస్‌క్యాంప్ అదృశ్యం

## 11 మంది సైనికుల గల్లంతు!

**డెహ్రాడూన్, ఆగస్టు 5:** ఉత్తరాఖండ్‌లో సంభవించిన మెరుపువరదల్లో పది మంది సైనికులు అదృశ్యం అయ్యారు. ఆర్మీస్థావరం పూర్తిగా వరదలధాటికి కొట్టుకునిపోయింది. మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటలకు ధారాలి గ్రామం ప్రాంతంలో కుంభవృష్టికారణంగా నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఆర్మీస్థావరం మొత్తం తుడిచిపెట్టుకునిపోయింది. ఆర్మీక్యాంప్ హర్షిల్ ప్రాంతంలోఉన్నట్లు అధికారులు తెలిపారు. యూనిట్‌బేస్ పూర్తిగా ఇతర ప్రాంతంతో తెగిపోయింది. అధికారుల అంచనాలప్రకారం మొత్తం 11 మందిసిబ్బంది ఆచూకి గల్లంతయిందని ప్రత్యేకబృందాలు గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిగా బురదపేరుకునిపోవడంతో గాలింపు కూడా కష్టంగా ఉంది. గంగోత్రిమార్గంలో ధారాలి గ్రామంలో యాత్రీకులు ఆగి వెళుతుంటారు. ఇక్కడే అనేక హోటళ్లు, హోంస్టేలు వంటివి అనేకం ఉన్నాయి. మంగళవారం ఖీర్‌గంగానదీపరీవాహక ప్రాంతంలో నెలకొన్న ఆకస్మిక కుంభవృష్టికారణంగా సూనిక స్థావరం పూర్తిగా కొట్టుకునిపోయిందని అంచనా. పదినిమిషాలముందే ఆర్మీ సుమారు 150 మంది సిబ్బందిని సహాయక చర్యలకోసమని ఈప్రాంతంలో సమీకరించి వరదభీభత్స ప్రాంతానికి తీసుకువచ్చింది.

# విస్తరించండి

>> పూర్తవుతుందని, ఆలస్యం జరిగితే భూసేకరణకు ధరలు పెరిగి ప్రాజెక్టుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని సవివరంగా గడ్కరీకి వివరించారు. మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తిపై కేంద్రమంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. అలైన్ మెంట్ ప్రపోజల్స్ పంపితే, అనుకున్నదానికన్న ముందే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని గడ్కరీ హామీ ఇచ్చారు. ఎల్‌బి నగర్ మల్కాపూర్ చింతల్ కుంట చెక్ పోస్ట్ నుంచి హయత్ నగర్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు దాదాపు 5 కిలోమీటర్ల ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మించడంతో పాటు నాగ్‌పూర్‌లో మాదిరిగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌గా నిర్మాణం చేపట్టాలని గడ్కరీని కోరారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే మంజూరీలు ఇస్తానని తెలిపారు. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం వియూపీలు నిర్మించడం వలన తీవ్రంగా ఇబ్బందులు పడుతామని ప్రభుత్వానికి స్థానిక ప్రజలు కోరుతున్నందున.. దాన్ని ఎలివేటెడ్‌గా మంజూరీ చేయాలన్న మంత్రి కోరగా సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్-శ్రీశైలం రోడ్డ్ జాతీయ రహదారి(ఎన్ హెచ్ 765) రహదారిలో టైగర్ రిజర్వ్ నుంచి వెళ్తున్న ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్‌గా గుర్తించాలన్న మంత్రి కోమటిరెడ్డి విజ్ఞాపనకు.. అలైన్ మెంట్ అప్రూవల్ ఇస్తూ మంజూరీ చేస్తానని హామి ఇచ్చారు. ఈ రహదారి ప్రాంతం ప్రస్తుతం 62 కిలోమీటర్లు ఉందని, ఎలివేటెడ్ కారిడార్‌గా మార్చితే నాలుగు కిలోమీటర్లు తగ్గి 58 కిలోమీటర్ల అవుతుందన్నారు. హైదరాబాద్ - మన్నెగూడ రహదారికి సంబంధించి.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న అంశాన్ని త్వరగా పూర్తి చేసి కాంట్రాక్టర్‌ను ఒప్పించి త్వరితగతిన పనులు పూర్తిచేయడానికి సహకరించాలని కేంద్రమంత్రి కోరారు. వేగంగా అన్ని అంశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామి ఇచ్చారు. ఇవే కాకుండా, సేతు బంధన్ మరియు సిఆర్ఐఎఫ్ (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నుంచి ప్రతిపాదనల విషయంలో వచ్చే వారం మీ సెక్రటరీతో ప్రతిపాదనలు పంపించి మంజూరీ చేసుకోవాలన్నారు.

కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశంపై మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో జాతీయ రహదారులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నానని, అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులపై నిరంతరం పర్యవేక్షి స్తున్నానని, వీటితో రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల అందించేందుకు హ్యామ్ విధానంలో ఇప్పటికే రోడ్లను ఎంపిక చేశామని తెలిపారు. అడిగిన ప్రతీ రహదారి విజ్ఞప్తిని ఎంతో సహృదయంగా స్వీకరించి అన్ని రోడ్లకు మంజూరీలు ఇస్తానని తెలిపిన కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

>> హైకోర్టు మంగళవారం విచారించింది. పేటిషర్‌ల వాదనలతో కోర్టు కన్విన్స్ కాలేదు. బదలీల నిబంధనలు, పదోన్నతుల నిబంధనలు వేరుగా ఉన్నందున పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు హైకోర్టు తీర్పునిచ్చింది. డబ్ల్యూపి 22746, డబ్ల్యూపి 19427లను కొట్టివేస్తూ.. ఉపాధ్యాయుల ప్రమోషన్లను కొనసాగించొచ్చని కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా పదోన్నతులు లభించనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ జులై 31న జారీ చేశారు. ఈ నెల 2 నుంచి పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమై ఈ నెల 11 వరకు కొనసాగుతుందని షెడ్యూల్‌లో తెలిపారు. 10 రోజులపాటు పదోన్నతుల ప్రక్రియను కొనసాగించడం కోసం షెడ్యూల్‌ను ప్రకటించారు.

పదోన్నతుల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందనున్నారు. రాష్ట్రంలో సుమారు 900 గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. 650 వరకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటితోపాటు ఖాళీగా ఉన్న 2వేల స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)లకి ఎస్‌జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. 900 గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్న ఎస్ఏల ఖాళీల్లో కూడా 70 శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. పదోన్నతుల మూలంగా 4వేల మంది పదోన్నతులు పొందనున్నారు.



ఎస్‌పిసిఎ ఛైర్మన్‌ను కలిసిన హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా, డిజిపి జితేందర్, శాంతిభద్రతల అదనపు డిజి మహేష్ భగవత్.

## ఎస్‌పిసిఎ ఛైర్మన్‌తో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిపి భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు కంప్లెంట్ అథారిటీ (ఎస్‌పిసిఎ) ఛైర్మన్ జస్టిస్ శివశంకర్ రావును హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా, డిజిపి జితేందర్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌లు మంగళవారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఎస్‌పిసిఎ ఛైర్మన్‌గా బాధ్యతలు చేబట్టిన శివశంకర్ రావును వారు అభినందించారు. దీంతో పాటు ఎస్‌పిసిఎ చేబట్టవలసిన చర్యల గురించి వారు చర్చించారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా వారు చర్చించారు. ఈ భేటీలో ఎస్‌పిసిఎ స భ్యులు విశ్రాంత ఐజి ప్రమోద్ కుమార్‌తో పాటు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో ముగిసిన విచారణ

### తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యార్థుల స్థానికత అంశంపై మంగళ వారం సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. 10వ తరగతి తర్వాత రెండేళ్లు బయటి రాష్ట్రంలో చదివి ఉంటే స్థానికత వర్తించదన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు.. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పును వెలువరించింది. స్థానికత అంటే ఏమిటి? దీని పరిధిలోకి ఎవరు వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై ఉన్న నిబంధనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో స్పష్టంగా పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ (బిఆర్) గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా.. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని సీజేఐ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి రెండేళ్లు బయటకు వెళితే స్థానికత కోల్పోవడానికి అవకాశం ఎలా ఉంటుం దని ప్రశ్నించారు. ఈ నిబంధనల వల్ల విద్యార్థులకు అన్యాయం జరగకూడదని సీజేఐ అభిప్రాయపడ్డారు. 4 ఏళ్ల చదువు లేదా నివాసంతో స్థానికత వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. చదువు కోసం కోటా, దుబాయ్ వెళ్తే స్థానికత వర్తించదంటే ఎలాగన్న కోర్టు .. ప్రతి విద్యార్థి 371డి ఆర్టికల్ తెలుసుకోవాలన్నట్లుగా వాదనలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. పేద, మధ్యతరగతి వారికి జరుగుతున్న ఉపయోగాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రకటించారు.

## బెట్టింగ్ యాప్ కేసు..

## నేడు ఇడి విచారణకు రానున్న విజయ్ దేవరకొండ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై విచారిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) ఎదుట టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ బుధవారం నాడు విచారణకు హాజరవుతున్నారు. ఇదే కేసులో గత నెల 30వ తేదీన మరో నటుడు ప్రకాష్‌రాజ్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండ తరువాత రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి కూడా విచారణకు హాజరు కావాల్సి వుంది.

## మెప్మా ఉద్యోగులకు అదనంగా రూ.10 వేలు అలవెన్స్

### త్వరలోనే అధికారిక ఉత్తర్వులు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణలోని మెప్మా ఉద్యోగులకు శుభవార్త. త్వరలోనే అలెవెన్సులతో కూడిన పూర్తి జీతం అందనుంది. రూ.10 వేల అలవెన్సు అదనంగా ఇవ్వనున్నారు. గత యేడాది ఆగస్టులో సెర్ప్ సిబ్బందితో సమానంగా పూర్తి పేస్కేల్ పొందుతున్న 378 మంది ఉద్యోగులకు.. మే నెల నుంచి తగ్గిపోయిన జీతాలు త్వరలో మళ్లీ పూర్తి స్థాయిలో రానున్నాయి. అలవెన్సుల విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా..వారికి తిరిగి రూ.32 వేల వరకు జీతం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.పురపాలక సంస్థల్లో పేదరిక నిర్మూలన పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరలో ప్రభుత్వం నుంచి ఒక శుభవార్త అందనుంది. వారికి అన్నిరకాల అలవెన్స్‌లతో కూడిన పూర్తి వేతనం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ప్రస్తుత వేతనంతో పాటు అదనంగా రూ.10 వేలు ఇచ్చేందుకు సర్కార్ రెడీగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు త్వరలోనే జారీ కానున్నాయని ఉన్నత స్థాయి వర్గాల ద్వారా తెలిసింది. కాగా, మెప్మాలో పనిచేస్తున్న 378 మంది ఉద్యోగులకు గత యేడాది ఆగస్టులో సెర్ప్ సిబ్బంది మాదిరిగానే పూర్తి పేస్కేల్ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు ఈ ఏడాది ఏప్రిల్ వరకు ప్రతి నెలా సుమారు రూ.32,000 వేతనం పొందేవారు.అయితే మే నెల నుంచి వారి వేతనంలో దాదాపు రూ.10 వేల వరకు తగ్గించి ఇవ్వడం ప్రారంభించారు. భవిష్యత్తులో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండటానికి అలవెన్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ, అలవెన్స్‌లతో కూడిన పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఈ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకోబోతోంది. ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని అధికారులు వివరించారు.

# హర్ ఘర్ తిరంగా - తిరంగా యాత్ర

### స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా బిజెపి రాష్ట్రవ్యాప్తంగా దేశభక్తి కార్యక్రమాలు

### పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరంగా యాత్ర ప్రముఖ్ డా. జి.మనోహర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్ర, దేశభక్తి కార్యక్ర మాల నేపథ్యంలో మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాల యంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర పార్టీ తరఫున ముఖ్యఅతిథిగా మాజీ మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపి వి.డి. శర్మ పాల్గొని దిశానిర్దేశం చేశారు. విభజన గాయాల స్మృతిదినం, హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్రలపై కార్యాచరణపై చర్చించారు. తిరంగాయాత్ర ప్రముఖ్ డాక్టర్ జి. మనో హర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు, ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి, అధికార ప్రతినిధి రాణిరుద్రమ తదితరులు పాల్గొని పలుఅంశాలపై చర్చించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు దేశ ప్రజలతో కలిసి తిరంగా యాత్రలు, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశసమైక్యత, సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయా లని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృఢనాయకత్వం, సాయుధ దళాల ధైర్యసాహసం, ప్రజల ఉమ్మడి ఆకాంక్షల ఫలితంగా ఆపరేషన్ సిందూర్‌ను విజయ వంతంగా నిర్వహించడం ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది నిదర్శనం, ప్రతి పౌరుడికీ గర్వకారణం అని అన్నారు. పార్లమెంటులో ప్రధాని మోడీ పేర్కొన్నట్లుగా - ఇది భారత విజయోత్సవానికి, ఆత్మగౌరవానికి సంబంధించిన సెషన్. ఉగ్రవాదుల కేంద్రాన్ని నేలమట్టం చేసినందుకు.. సిందూర్ శపథం నెరవేరినందుకు జరిగే వేడుకలన్నారు. ఆగస్టు 6- 8న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్య శాలల్లో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మహిళా మోర్చా, యువ మోర్చా ప్రతినిధులు పాల్గొం టారు. ఆగస్టు 7 - 8న మండల స్థాయి కార్యశాలల్లో భాగంగా శక్తికేంద్ర ఇన్‌చార్జ్, బూత్ అధ్యక్షులు పాల్గొం టారు. ఆగస్టు 9 - 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం నుంచి నగర స్థాయిలో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్రలు దేశభక్తి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ప్రజ భాగస్వామ్యం తోడుగా త్రివర్ణ పతాకాలతో ఊరేగింపులు జరుగనున్నాయి. 12 - 14 తేదీల్లో స్వాతంత్ర్య పోరాట స్మారక చిహ్నాల వద్ద, స్వాతంత్ర్యోద్యమంలో ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలు, యుద్ధ స్మారక చిహ్నాల చుట్టూ స్వచ్ఛత కార్యక్రమాలు జరుగనున్నాయి. అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించడంతో పాటు మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబాలను సన్మానించడం, మాజీ సైనికుల ఇళ్లను సందర్శించి సన్మానించడం వంటి కార్యక్రమాలు చేపడతారు. 13 - 15 తేదీల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఆగస్టు 14, 2025 వ తేదీన విభజన గాయాల స్మృతిదినం సందర్భంగా అన్ని జిల్లాల్లో బ్యానర్లు, ప్లకార్డులతో మౌన ప్రదర్శనలు, హాల్ మీటింగ్‌లు, ఎగ్జిబిషన్లు, విభజనతో ప్రభావితులైన వారిని సన్మానించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ ఉపాధ్యక్షురాలు లతా ఉసేండి, జాతీయ కార్యదర్శులు డా. నరేందర్ రైనా, రితురాజ్ సిన్హా, కామాఖ్య ప్రసాద్ తాసా, మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.సురేంద్రన్, వి.డి.శర్మ, సదానంద్ షెట్ తానావడే జాతీయ స్థాయిలో కార్యక్రమాలను సమన్వయం చేస్తారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. గంగిడి మనోహర్ రెడ్డి కన్వీనర్‌గా, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ సభ్యులుగా నియమితులైన రాష్ట్ర కమిటీ రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాలను సమన్వయం చేస్తారు.



మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి

# పాత్రికేయులు తెలుగుభాషకు ప్రాధాన్యతనివ్వాలి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఆగస్టు 5, ప్రభాతవార్త:** నేటితరం తప్పకుండా చదవాల్సిన పుస్తకం ఇనగంటి వెంకట్రావు రచించిన విలీనం-విభజన అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌నందు విలీనం-విభజన (గతం-స్వగతం, మన ముఖ్య మంత్రులు) అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు.

సమకాలీన రాజకీయ చరిత్ర తెలుసుకోవాలంటే తప్పకుండా విలీనం-విభజన పుస్తకం చదవాలని సూచించారు. పత్రిక సమాజానికి దర్పణం లాంటిదని, ఈ సమాజంలో ఏం జరుగుతోందో ప్రజలకు తెలియచేయాల్సిన బాధ్యత పత్రికలపై ఉందని పేర్కొన్నారు. కలానికి కులం లేదని,



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కేవలం కలానికి పదును మాత్రమే ఉండాలని, ప్రజాస్వామ్యంలో పత్రికలు నిష్పక్షపాతంగా, నిర్భ యంగా, నిజాయితీగా పనిచేయాలని సూచిం చారు. తెలుగు భాషను బతికించేందుకు పత్రికలు కృషి చేయాలని, తెలుగు పత్రికలలో పనిచేసే పాత్రికేయులు తెలుగుభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారు రాసే వాటిలో సాధ్యమైనంత వరకు ఇంగ్లీషు పదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యూస్ కోసం న్యూస్ చేయకూ డదని, దానికోసమే కాలమ్స్ ఉన్నాయని గుర్తు చేశారు. రాజకీయాలలో క్యారెక్టర్, క్యాలిబర్, కెపాసిటీ, కాండక్ట్ అనే నాలుగు సీలు ఉండాలని, కానీ నేడు క్యాస్ట్, క్యాష్, కమ్యూనిటీ, క్రిమినాలిటీ అనే నాలుగు సీలు రాజ్యమేలు తున్నాయని విమర్శలు వస్తున్నా యన్నారు. రాజకీయ నాయకులు కూడా భాష విషయంలో హుందా తనం ప్రదర్శించాలని సూచించారు. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందరి భావాలు ప్రతిబింబించే పుస్తకం విలీనం-విభజన అని, తప్పకుండా ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్‌రెడ్డి, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

## 8న కేంద్రమంత్రి బండి సంజయ్ వాంగ్మూలం

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాత వార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబం ధించి కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ నెల 8న ఈ కేసు ను విచారిసున్న సిట్ అధికారుల ఎదుట హాజరు కానున్నారు. ఈ మేరకు ఆయన సిట్ అధికారులకు మంగళవారం నాడు లేఖ ద్వారా సమాచారం అందించారు. ఇంతకు ముందు రెండుసార్లు ఆయన విచారణ పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో వాయిదా పడింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ గతంలోనే తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. అప్పట్లో ఎస్ఐబి బాస్‌గా వున్న ప్రభాకర్ రావుపై ఆయ న తీవ్రంగా విమర్శలకు దిగడం విదితమే. ప్రభాకర్ రావు నేతృత్వంలోని పోలీసు బృందం అడ్డగోలుగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందని బండి సంజయ్ ఇంతకు ముందు పలుమార్లు ఆరోపించారు. ఈ విషయంలో తాను కచ్చితంగా సిట్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇవ్వడంతో పాటు తన వద్ద వున్న సమాచారం ఇస్తానని ఆయన చెప్పారు.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
**OA No. 259 OF 2025**
BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
Vs
M/s.Spectrum Biocides India Private Limited ....Defendants
**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**
To,
Mr. Narendar Reddy Yedla,
7-4-301/1, Navajeevan Nagar, Ferozguda,
Bowenpally, Hyderabad-500011.
....DEFENDANT No. 5
Please take the summons in the above **O.A.No. 259 OF 2025** filed by the Applicant for Recovery of **Rs.1,51,35,097.80/- (Rupees One Crore Fifty One Lakh Thirty Five Thousand Ninety Seven And Eighty Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** Telugu Newspaper and posted the matter on **01/09/2025.**
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on **01/09/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001**, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this **05th day of August, 2025.**
(By order of the Tribunal)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad

# కౌలుదారులకు పిఎంకిసాన్ వర్తింపు ప్రతిపాదన ఏదీ రాలేదు

### పార్లమెంటులో వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తోన్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 20వ విడత నిధులను ఆగస్టు 2వ తేదీన పీఎం మోదీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పీఎం కిసాన్ స్కీమ్ సాయాన్ని పెంచుతున్నారని, పరిధిని విస్తరించి కౌలు రైతులకూ అందిస్తారన్న అంశంపై కేంద్రం స్పందించింది. పీఎం కిసాన్ సాయం పెంపు, కౌలు రైతులకు వర్తింపు వంటి ఏ ప్రతిపాదనా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని వెల్లడించింది. ఈ మేరకు పార్లమెంటులో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటన చేశారు. లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశంలోని రైతులకు మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.6 వేలు పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభిం చింది. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.3.90 లక్షల కోట్లకు పైగా జమ చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రస్తుతం పీఎం కిసాన్ సాయం పెంపు , పరిధిని విస్తరించడం, కౌలు రైతులకు వర్తింప జేయడం వంటి అంశాలపై ఎలాంటి ప్రతిపాదనా పరిశీలనకు రాలేదని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భాగస్వామ్యంతో సాగు చేసే రైతులనూ పీఎం కిసాన్ పథకంలో చేర్చే అంశంపై వచ్చిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు కేంద్ర మంత్రి. ఈ స్కీమ్ ప్రయోజనాలు అందుకోవాలంటే సాగు భూమి కలిగి ఉండడమే రైతులకు ప్రధాన అర్హత అని స్పష్టం చేశారు. మరోవైపు తమిళనాడు తరహాలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ సమాచారం, సలహాలు అందించేలా యాప్ ఏదైనా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోందా? అని అడగగా అలాంటి ప్రతిపాదన లేదని తెలిపారు. అయితే, వ్యవసాయానికి సంబంధించిన సమాచారం, సందేహాలు, సలహాలకు కిసాన్ కాల్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ సేవలు పొందేందుకు రైతులు 1800 180 1551 టోల్ ఫ్రీ నంబర్ కాల్ చేయాలని చెప్పారు. ప్రాంతీయ భాషల్లోనూ సమాధానాలు లభిస్తాయని సూచించారు.

**సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి**
(భారత ప్రభుత్వ, ఆయుష్ మంత్రిత్వశాఖ యొక్క స్వతంత్ర సంస్థ)
జవహర్‌లాల్ నెహ్రూ భారతీయ చికిత్స మరియు హోమియోపతి అనుసంధాన్ భవన్
61-65, ఇనిస్టిట్యూషనల్ ఏరియా, డీ-బ్లాక్ ఎదుట, జనక్‌పురి, న్యూఢిల్లీ-110058
Advt. No.: 168/2025-26 తేది: 29.07.2025
రీసెర్చ్ ఫెలోలు మరియు ల్యాబ్ టెక్నీషియన్‌లను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకం
ది సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి, న్యూఢిల్లీ ఈ క్రింది రీసెర్చ్ ఫెలోలను JSPS G.H.M.C. కాలేజ్, హైదరాబాద్ వద్ద, పూర్తి కాంట్రాక్ట్ ప్రాతిపదికన క్రింద పేర్కొనబడిన తేదీలలో టెస్ట్/వాక్-ఇన్-ఇంటర్వ్యూ ద్వారా నియామకానికి ఉద్దేశిస్తోంది.

| క్ర.సం. | ఉద్యోగం యొక్క పేరు | ఉద్యోగం(ల) సంఖ్య | ఇంటర్వ్యూ యొక్క తేదీ |
|---|---|---|---|
| 1. | రీసెర్చ్ అసోసియేట్ (హోమియో) | 01 | 21.08.2025 |
| 2. | సీనియర్ రీసెర్చ్ ఫెలో (లైఫ్ సైన్సెస్) | 01 | 21.08.2025 |
| 3. | సీనియర్ రీసెర్చ్ ఫెలో (హోమియో) | 01 | 22.08.2025 |
| 4. | జూనియర్ రీసెర్చ్ ఫెలో (లైఫ్ సైన్సెస్) | 01 | 22.08.2025 |
| 5. | ల్యాబొరేటరీ టెక్నీషియన్‌లు | 02 | 23.08.2025 |

పోస్టింగ్ యొక్క ప్రదేశం, ఆవశ్యక అర్హత, అనుభవం, జీతం వగైరాల వివరాలు కౌన్సిల్ యొక్క వెబ్‌సైట్ www.ccrhindia.nic.in మరియు www.ccrhindia.ayush.gov.in పై అందుబాటులో ఉన్నాయి.
అసిస్టెంట్ డైరెక్టర్ (H)/S-4/Admn. I/c

# చనిపోయిన వారికి 'చేయూత' పెన్షన్లు!

### రికవరీకి ఆదేశించిన సర్కార్


### 28 వేల మంది ఫించన్ల రికవరీ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పెన్షన్లు పక్కదారి పడుతున్నాయి. ఈ పెన్షన్లు పొందుతున్న వారు మరణించినప్పటికీ వారికి పెన్షన్లు వెళుతున్నాయి. వాస్తవానికి వారు మరణించడంతో ఆరా తీసిన ప్రభుత్వం ఆ పెన్షన్లపై కీలక నిర్ణయం తీసుకుంది. చనిపోయిన వారికి మంజూరు చేసిన పింఛన్లను రికవరీ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సంవత్సర క్రితం చనిపోయిన పింఛను దారులకు కూడా చేయూత పెన్షన్లు అందజేశారు. ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఇలా 28 వేల మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు జరిగినట్టు గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ (సెర్ప్) తాజాగా గుర్తించింది. చేయూత పింఛన్లు అందుకుంటూ మరణించిన పలు విభాగాల లబ్ధిదారుల వివరాలను వారి కుటుంబ సభ్యులు అధికారులకు తెలియజేయలేదు. అందువల్లే ఈ సమస్య ఎదురైందని, అధికారులు తెలిపారు. ఈ లబ్ధిదారుల్లో కొందరికి నెలకు రూ.2,016, దివ్యాంగులకు నెలకు 4,016 రూపాయల చొప్పున సంవత్సర కాలం పాటు ప్రతి నెల వారి ఖాతాలో జమ చేస్తూ వస్తున్నారు. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో.. సదరు పింఛన్‌దారుల కుటుంబీకుల నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.దీనికి సంబంధించి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మరణించిన లబ్ధిదారులు పేరు మీద జమ అయిన మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులు.. చనిపోయిన వారి బ్యాంక్ డెబిట్ కార్డులను ఉపయోగించి.. ఏటీఎంల నుంచి డబ్బు డ్రా చేసినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతోపాటుగా మరణించిన 28 వేల మంది పింఛనుదారుల పేర్లను జాబితా నుంచి తొలగించిన్లుగా అధికారులు ప్రకటించారు. అలానే వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి.. మరణించిన వారి భార్య లేదా భర్తకు పెన్షన్ అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.పింఛన్ల జారీలో మోసాలను అరికట్టడానికి.. సమస్యలను తొలగించడానికి రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గత నెల అనగా జులై 29 నుంచి జూలై పింఛన్ పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారుల్లో కొందరికి వేలిముద్రలు సరిగా లేకపోవడంతో పాటుగా మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొదటి విడతలో భాగంగా పోస్టాఫీసుల ద్వారా పెన్షన్ పొందే 23 లక్షల మందికి ఈ విధానాన్ని వర్తింపచేయనున్నారు. దీనికోసం ప్రత్యేక యాప్, కొత్త స్మార్ట్‌ఫోన్లు, సిబ్బందికి శిక్షణ వంటి పనులు పూర్తి చేశారు. ఈ కొత్త విధానంలో పెన్షన్ల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008 యొక్క 15(4) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన
(G.O.Ms.No. 165 MA & UD విభాగం., తేది : 30.07.2025)
G.O.Ms.No.288 MA&UD, తేది: 03.04.2008, సదరు సెక్షన్ యొక్క సబ్-సెక్షన్ (1)చే అవసరమైనట్లుగా ప్రకారం ప్రభుత్వంచే అనుమతింపబడిన మాస్టర్ ప్లాన్ సెగ్మెంట్ జోన్ రామచంద్రాపురం పూర్వపు HUDA ఏరియా, ప్రకటింపబడిన ప్రకారం సూచింపబడిన భూమి వినియోగానికి ప్రభుత్వం ఇందుమూలముగా ఈ క్రింది మార్పుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నం.8) యొక్క సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్(1) చే సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తోంది. సంగారెడ్డి (జిల్లా) పటాన్ చెరువు (గ్రా & మం) యొక్క సర్వే నం. 486 నుండి 489, 491 నుండి 497, 503లోని స్థలం 97,529చ.మీ. యొక్క విస్తీర్ణానికి, నాలా యొక్క బఫర్ ఏరియా 2125చ.మీ మరియు నికర స్థలం ఏరియా 95,404చ.మీ లేదా ఎక 23.5 ఏదైతే ప్రస్తుతం G.O.Ms.No.288 MA తేది: 03.04.2008 ప్రకారం అనుమతింపబడిన మాస్టర్ ప్లాన్ సెగ్మెంట్ జోన్ రామచంద్రాపురం పూర్వపు HUDA ఏరియా ప్రకటింపబడిన ప్రకారం దాని బఫర్ వినియోగం మరియు పారిశ్రామిక సంబంధితం యొక్క మైనర్ పార్ట్ మరియు కన్సర్వేషన్ వినియోగంగా నిర్దేశింపబడిందో అది ఇప్పుడు నివాసిత వినియోగానికి అధికారయుతంగా నిర్దేశింపబడింది. పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్‌లు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.
సం/-. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (MR), HMDA.
DIPR.NO. 6099-PP/CL/ADVT/1/2025-26 తేది: 05.08.2025

# ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు



ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లు

### ఒడిశా నుంచి యుపికి స్మగ్లింగ్..

### రూ.4.2 కోట్ల గంజాయి పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టేందుకు ఏర్పాటైన ఈగల్ (పూర్వపు తెలంగాణ నార్కోటిక్ బ్యూరో) మరోసారి భారీగా గంజాయిని పట్టుకుంది. ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన ఇద్దరు స్మగ్లర్లు పట్టుబడగా నాలుగు కోట్ల 20 లక్షల విలువచేసే 847 కిలోల గంజాయిని జప్తు చేశారు. ఈగల్ ఎస్‌పి చెన్నూరి రూపేష్ మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ గంజాయి రవాణాకు కారిడార్‌గా మారిన అంశంపై పక్కా సమాచారం సేకరిం చిన ఈగల్ బృందం అంతర్రాష్ట్ర నేరగాళ్లపై నిఘా వుంచింది. ఈ క్రమం లో సోమవారం రాత్రి శంషాబాద్ జమా మసీదు వద్ద యుపికి చెందిన రిజిస్ట్రేషన్ నంబర్‌తో ముంబయి వెళుతున్న బొలేరో వాహనంలో గంజాయి స్మగ్లింగ్ అవుతుందన్న సమాచారం మేరకు ఈగల్ పోలీసులు దాడిచేయగా బ్యాగుల్లో ప్యాకింగ్ చేయబడిన 847 కిలోల గంజాయి లభించింది. ఈ వాహనంలో ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన కిల్లా ధన (29) రాజేందర్ బాజింగ్ (26)లు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయారు. వీరిద్దరిపై ఎపితో పాటు ఒడిశాలో పలు కేసులున్నాయి. ఈ కేసులో కీలక సూత్రధారి మల్కన్‌గిరికి చెందిన రమేష్ సుక్రీగా తేలింది.

ఇతనికి జగదీష్ కుల్‌దీప్, శిబు ఊరఫ్ శిబాబాసు, షఫీక్ అలియాస్ షఫీ అనే ముగ్గురు సహాయకులు వున్నారు. వీరంతా కలిసి మల్కన్‌గిరిలోని మారుమూల ప్రాంతంలో రైతులతో గంజాయి సాగు చేయిస్తుంటారు. అనంతరం గంజాయిని 20 కిలోల నుంచి 40 కిలోల వరకు చిన్న మొత్తంగా సేకరించి ఒకచోట డంపింగ్ చేస్తారు. దీని తరువాత ఈ గంజాయిని ఎండబెట్టి, గ్రేడింగ్ చేసి యుపికి స్మగ్లింగ్ చేస్తుంటారు. ఈ గంజాయికి యుపిలో మంచి డిమాండ్ వుంది. కాగా మల్కన్‌గిరి నుంచి యుపికి గంజాయి స్మగ్లింగ్ కోసం రమేష్ సుక్రి రోడ్డు మార్గాన్ని ఎంచుకుని, జాతీయ రహదారులు, బైపాస్ రోడ్ల ద్వారా పంపుతుంటాడు. గంజాయి స్మగ్లింగ్ చేసే వాహనాలలో డ్రైవర్లను, అనుచరులను కూడా ఇతను మారుస్తుంటాడు. వాహ నంలో కచ్చితంగా పొడవాటి కత్తిని వుంచుకుంటాడు. ఇదే తరహాలో రమేష్ సుక్రి అన్ని జాగ్రత్తలు తీసుకుని ఇద్దరు అనుచరులతో బొలేరో వా హనంలో నాలుగు కోట్ల 20 లక్షల రూపాయల విలువచేసే 847 కిలోల గంజాయిని యుపికి రవాణా చేయిస్తుండగా శంషాబాద్ వద్ద ఈ వాహనం పట్టుబడింది. ఈ సందర్భంగా గంజాయితో పాటు బొలేరో వాహనం, పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు సెల్‌ఫోన్లు, ఒక పొడవాటి కత్తిని ఈగల్ పోలీసులు జప్తు చేశారు. పట్టుబడ్డ స్మగ్లర్లపై ఎన్‌డిపిఎస్ చట్టంతో పాటు ఆయుధాల చట్టం కింద సైబరాబాద్ కమిషనరేట్‌లో కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండుకు తరలించారు. కాగా ఈ కేసులో పరారీలో వున్న రమేష్ సుక్రి, జగదీష్ కుల్‌దీప్, శిబు ఊరఫ్ శిబా బాసు, షఫీక్ అలియాస్ షఫీలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఈగల్ పోలీసులను ఎస్‌పి రూపేష్ అభినందించారు.

**DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT II)**
**1st Floor, Triveni Complex Abids, Hyderabad-500001**
**O.A. No. 373 OF 2025**
Bank of Maharashtra ...Applicant
And
M/s SVG Infra and Others ...Defendant(s)
**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**
To
1) **M/s SVG Infra Prop. Mr. Sista Subramanyam O/o.** 1-8-55 North Kamala Nagar, Behind Sivalayam Temple, Hyderabad- 500062 TG **(Borrower)**
2) **Mr. Sista Subramanyam S/o. SV Gopala Krishna** Age Major Occ: Business H.no. 1-8-55 North Kamala Nagar, ECIL Post, Behind Andhra Bank, Beside HDFC Bank Hyderabad- 500062 TG **(Guarantor)**
3) **Mrs. Sista Annapurna W/o. Sista Subramanyam Age** Major Occ: Business H.no. 1-8-55 North Kamala Nagar, Ecil post, Behind Andhra Bank, Beside HDFC Bank Hyderabad- 500062 TG **(Guarantor/Mortgagor)**
4) **Mrs. Sista Nagamani W/o. SV Gopala Krishna** H.no. 1-8-55 North Kamala Nagar, Ecil Post, Behind Andhra Bank, Beside HDFC Bank Hyderabad- 500062 TG .**(Guarantor/ Mortgagor)**
Please take the summons in the above **O.A.No. 373 OF 2025** filed by the Applicant for Recovery of money of **Rs.3,17,10,302.93Ps/-** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu Daily, newspaper and posted the matter to **29.08.2025.**
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application.;.
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;.
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on **29.08.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st floor,** Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
**Take notice that in case of default, the Application will be heard and determined in your absence 24th Day of July-2025**
(By order of the Court)
Sd/- Asst Registrar
Debts Recovery Tribunal Hyderabad (DRT II)

వార్త

చెవిటివాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు,
మంచి మాట విననివాడు.

-మార్టిన్ లూథర్ కింగ్

# 'జన' ఔషధి చౌక బేరం!

దేశంలో రోగాల విస్తృతి ఎంత మేరకు ఉందో అంతే స్థాయిలో నకిలీ ఔషధాల విక్రయమూ వ్యాప్తి చెందుతోంది. ఔషధ నియంత్రణ మీద ప్రభుత్వాల పట్టు గురించి చెప్పాల్సి వస్తే సరిపోదనే చెప్పాలి. నిషేధిత మందులే కాదు, నకిలీమందులు కాలం చెల్లిన ఔషధాలు కూడా ఇప్పటికే మందుల షాపుల్లో దొరకుతాయి. మందుల షాపు అనగానే అదేదో ఒక వ్యాపార విక్రయశాల కనుక తెలిసో తెలియకో విక్రయాలు జరుగుతున్నాయని సరిపెట్టుకోలేం. అక్కడ ఔషధ వినియోగం, దుష్ప్రభావాల గురించి బాగా తెలిసి వివరించ గలిగిన 'ఫార్మాసిస్ట్' ఉండడం తప్పనిసరి కావున. పైగా ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాల కారణంగా మార్కెట్‌లో ఒక ఔషధాల కాంబినేషన్ ఫార్ములాలో ప్రఖ్యాతఫార్మసీ కంపెనీలు సాధారణ మందుల జనరిక్ మందులు బజార్లో విరివిగా దొరుకుతున్నాయి. ఈ రెండింటికీ మించి మరి కొన్ని ఫార్మా సంస్థలు సాధారణ ధరలు, జనరిక్ ఔషధ ధరలకు మధ్య ధరలకు మరికొన్ని కాంబినేషన్‌లను సరఫరా చేస్తున్నాయి. ఇలా ధరల తేడాల మధ్య ఒకే రకపు ఔషధాల కొనుగోలుకు వినియోగదారుడు వెంపర్లాడుతున్నాడు. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే గతంలో నేరుగా మందుల షాపుల్లో కొనుగోలు చేసే రోగులు ఇప్పుడు తాజాగా పెయిన్ కిల్లర్‌లు, బి.పి, మధుమేహం షుగర్‌ల వంటి వ్యాధులకు సంబంధించి కాంబినేషన్ డ్రగ్స్‌ను 'జనరిక్' పేర్లతో అతి తక్కువ ధరకు లభించే షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. దానివల్ల అవసరమైన ఔషధాలను తక్కువ ధరకు తెచ్చుకోగలుగుతున్నారు. డాక్టర్లు నేరుగా 'జనరిక్' పేర్లతో రాయడంలోనూ చొరవ చూపడం లేదు. జనరిక్ పేర్లతోనే ప్రిస్క్రిప్షన్‌లు రాసి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తగు ఉత్తర్వుల్చినా డాక్టర్లెవరూ వాటిని పాటించి తమ ప్రిస్క్రిప్షన్ తయారీలో వాడటానికి అలవాటు పడలేదు. ఇష్టపడడం లేదనే అనుకో వాలి. లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు చౌకధరలకే అత్యవసర ఔషధాలను అందిస్తున్నామని పదేపదే చెప్పదలచుకున్నా అందులో వాస్తవాలు అతి తక్కువగా ఉంటున్నాయి. మందులు రాసిన డాక్టర్ వివేకాన్ని బట్టి రోగులపైభారం పడుతుంది. నేరుగా ఏ డాక్టరూ 'జనరిక్' మందును ప్రిస్క్రిప్షన్ చేసిన దాఖలాలు కనబడవు. దానాదీనా ధరల భారం తగ్గించడంలో ప్రభుత్వ నిర్ణయాలు ఏ మాత్రం వినియోగదారునికి ఉపయోగపడేలా లేవు. ప్రభుత్వాలు తాము కాలం చెల్లిన మందుల్ని తొలగించినట్లు చెబుతూనే వాటి వాడకాలపై నిషేధం విధిస్తోంది. అలాగే కొన్ని కాంబినేషన్లను వాడొద్దని చెబుతోంది. కానీ అంతే ధైర్యంగా 'జనరిక్' మందుల విక్రయాలు అత్యంత అవకాశాలున్నాయని చెప్పడంలో ధైర్యం చేయలేకపోతోంది తాజాగా 35 అత్యవసర ఔషధాల ధరలు తగ్గించినట్లు ప్రకటించింది. అవన్నీ ప్రాణాంతక రోగాలకు వాడే మందులే. నిత్యావసర ఔషధాలే. మధు మేహం, గుండె సంబంధిత వ్యాధులు, యాంటీ బయో టిక్ సహా వివిధ రకాల కీలక ఔషధాలే ఉన్నాయి. కొత్త గా నిర్ణయించిన ఔషధాలు వాటి ధరలు తగ్గిన వైనాన్ని డీలర్లు తమ దుకాణాల్లో వినియోగదారులకు కనిపించేలా బోర్డులుపెట్టాలని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థకోరింది. ప్రధానంగా పారాసిటమాల్, ఎసిలోఫెనాక్, ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ మెట్‌పార్మిన్, అటోర్వాస్టోటిన్ కాంబినేషన్ టాబ్లెట్‌లు మధుమేహ నియంత్రణ మాత్రల ధరలు కూడా తగ్గాయి. ఔషధాల ధరల నియంత్రణలో సత్ఫలితాలు లేవని గతంలో తెచ్చుకున్న స్టాక్‌ధర తగ్గించి అమ్మితే నష్టంవస్తుందని ఒకసారి, తీరా కొత్తగా సరకు రానందున పాతమాత్రలు పాతధరలు తప్పవంటూ కొన్నాళ్లు... ఆపైన వినియోగదారు తమ ఔషధ వినియోగాన్నే తప్ప ఇతరాలు పట్టించుకోరు. అదే వినియోగదారు కొంప ముంచుతోంది. మధ్యలో నకిలీ ఔషధాలు కూడా మార్కె ట్‌లోకి వచ్చేస్తున్నాయి. అసలైన ఔషధాల పేరిట మరికొన్ని ఔషధాలు మార్కెట్‌లో దొరకుతున్నాయి. వాటి గురించే ఇప్పుడు ఎల్లెడలా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఔషధాల్లో హానికారక పదార్థాలుకానీ, ముడి పదార్థాలో ఒకవేళ కలిసి ఉంటే అవి ప్రాణాంతకం కావొచ్చు. శరీరంలో విషప్రభావాలు కల్పించవచ్చు. నకిలీ మందుల విక్రయంనేరమని తెలిసినా వాటినివ్యాప్తి చేయడం కొందరుపనిగా పెట్టుకుంటారు. అందుకు చాలామంది రోగగ్రస్తులు నమ్మకమైన మందుల షాపులలోనే మందులు కొనుక్కొంటారు. ఎలాంటి మందులు వాడినా డాక్టరు సునిశిత పరిశీలన, రోగవిశ్లేషణ ద్వారానే ఆరోగ్య వంతులు కాగలరు. అందుకే డాక్టరు సలహా సంప్రదింపులు అవసరం అని గుర్తించాలి. ఉత్తరప్రదేశ్‌లో గత యేడాది రూ. 30.77 కోట్ల మేరకు విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నారు. అదే కాలంలో 1166 డ్రగ్ లైసెన్సులు రద్దు చేసి, 68 మందిని అరెస్టు చేశారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో 1.4 కోట్ల రూపాయల విలువైన 1.4 కోట్ల టాబ్లెట్స్, 2లక్షల క్యాప్సిల్స్ పట్టుకున్నారు. వీటిలో నకిలీ కొలెస్ట్రరాల్ మందులు ఎక్కువగా ఉన్నాయి. సింథటిక్ డ్రగ్స్, మైఫిడ్రోన్, కొకైన్ రోజువాస్ వంటి నకిలీ ఉత్పత్తులను పట్టుకొన్నారు. ఇటీవలనే హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో ఇద్దరు హోల్‌సేల్ ఔషధ విక్రేతల నుంచి కొలెస్ట్రరాల్ నియంత్రణ మందులను పట్టుకుని డ్రగ్స్ సీజ్ చేశారు. ఈరకం మందులు సీజ్ చేయడం ఇదే తొలిసారని ఔషధ నియంత్రణ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా వాడే మందులకు ప్రత్యామ్నాయంగా చౌకధరకు లభించే జనరిక్ మందులు ఉన్నా ఇతరత్రా ప్రత్యేక ప్రత్యామ్నాయ మందుల కోసం ధరభారం తగ్గుతుందనే ఉద్దేశంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో నేరుగా తక్కువ ధరకే దొరికే జనరిక్ ఉత్పత్తుల ప్రోత్సాహమూ అవసరమే!

గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం.



లోవెల్

కీర్తి అత్తరులాంటిది. పైపైన చల్లుకోవాలే గాని తాగుతూ కూర్చోకూడదు.



హరివంశరాయ్ బచన్

## ప్రజావాక్కు



### అవయవదానంలో ముందంజ

**తెలంగాణ** రాష్ట్రం మరోసారి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయం. అవయవదానంలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఇది రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకారం, తెలంగాణ రాష్ట్రం 2024లో అత్యధిక అవయవదానాలు చేసింది. జాతీయ అవయవ మార్పిడి సంస్థ ఈ గణాంకాలను విడుదల చేసింది. జీవితం అనంతరం దానం చేసిన అవయవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ ఈ విభాగంలో దేశంలోనే ముందంజలో ఉంది. ఇది సామాజిక చైతన్యానికి నిదర్శనం. రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న 'జీవన్ దాన్' కార్యక్రమం కీలకం. ఈపథకం ద్వారా అవయవ దాతల సంఖ్య వేగంగా పెరిగింది. ఇది రాష్ట్ర విజయానికి వెన్నెముకగా నిలిచింది. అవయవదానంలో దేశానికే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక ఉదాహరణగా నిలుసోంది.

- కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

### పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి

దేశం స్వచ్ఛ భారత్‌వైపు ముందుకు సాగుతూ ఉంది కాబట్టిప్రజలు పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా గ్రామస్థాయి నుండి నగరస్థాయి వరకు ప్రజలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతను ఇవ్వాలి. పారిశుధ్య కార్మికులతో పాటు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే బహిరంగ ప్రదేశలైనబస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కులు, సినిమా హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే నగర పాలకసంస్థ వారు నగరాన్నిఅందంగా తీర్చిదిద్దాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### వాహనాల లైటింగ్ తగ్గించాలి

**ఒకప్పుడు**స్వదేశీఅంబాసిడర్, మారుతి వంటి కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో పయనించటమే గాక వాటి హెడ్‌లైట్లపై సగం నల్లరంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించటమో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి.

- టి. సాంబశివరావు, గుంటూరు

### పెరిగిన ఫీజులు

**ఇటీవలి** కాలంలో ఇంజినీరింగ్ కళాశాలలు తమ ఫీజులను భారీగా పెంచబోతున్నారన్న వార్తలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్న మధ్య తరగతి, పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోంది. కోచింగ్, హాస్టల్, ప్రయాణ ఖర్చులతో విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు అదనపు ఫీజుభారం వల్ల వారి విద్యను మధ్యలోనే నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంజినీరింగ్ విద్య యువత భవిష్యత్తుకు పునాది. దీన్ని వ్యాపార ఉద్దేశాలతో నడపడం సమాజానికి హానికరం. విద్యను కేవలం ధనవంతులకు పరిమితం చేయడం వల్ల సామాజిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఫీజు సమీక్షించాల్సి ఉంటుంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అక్రమ కట్టడాలను నిర్మూలించాలి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పేద ప్రజలకు పంచిన ఇళ్ల స్థలాలలో కబ్జాదారులు కన్ను వేసి చాలా గజాలు ఆక్రమించుకోవడం జరుగుతుంది. అక్రమకట్టడాలు నిర్మించడం జరుగుతుంది. కాలనీలలో కొన్ని ఇండ్లస్థలాలు కొనుగోలు అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఎవరికి ఎంత భూమి ఎంత ఇంటి స్థలం ఉందో రికార్డులు చూపుతున్నాయి. కానీ కబ్జాదారులు ఇళ్ల స్థలాల అక్రమణకు పాల్పడుతున్నారు. దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. రెవిన్యూ అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇలాంటి ఫలితం లేకుండా ఉంటుంది. కనుక రాష్ట్ర రెవిన్యూ శాఖ మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో ఉన్న కాలనీలలోఇంటి స్థలాల కొలతలు, సరిహద్దులు, వంటి విషయాలను పరిశీలించి వివాదాలు లేకుండా చూడాలి.

- డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కనీస సదుపాయాలు కల్పించాలి

**ప్రభుత్వం** ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ద్వారా ఆర్థికాభివృద్ధి సైకిల్ ముందుకు వెళుతుంది. ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి సామాగ్రికి డిమాండ్ పెరిగి ఉత్పత్తి పెరుగుతుంది. అంతమాత్రమేకాదు గ్రామాలలో కూలీలకు డిమాండ్ పెరుగుతుంది. ఉత్పత్తి వస్తువుల డిమాండ్ పెరిగేలా చూడడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యం.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# జల సమస్యను రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోలేవా?

**కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం.**



మన్నారం నాగరాజు

పంతొమ్మిది వందల యాభై ఆరులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక వ్యవసాయ అభివృద్ధిలో సాగునీటికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్ర భౌగోళిక నిర్మాణం, సముద్ర తీర ప్రాంతం, నదుల సమృద్ధి, జనాభాలో 72.7 గ్రామీణులు వ్యవసాయంపై ఆధారపడటంతో సాగునీటి అవసరం స్పష్టమైంది. రాష్ట్రంలో సుమారు 40 శాతం పంట భూమి సాగునీటి ఆధారితంగా ఉండగా, అందులో 95శాతం వరి పంటకే ఉపయోగపడుతోంది. స్వాతంత్ర్యం తరువాత ఇంజినీర్లు, ఆర్థికవేత్తలు, వాతావరణ నిపుణులు కలిసి సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. బ్రిటిష్ కాలంలో నిజాం సాగర్, ప్రకాశం బ్యారేజ్, సర్ ఆర్థర్ కాటన్, గోదావరి డెల్టా వంటి కొన్ని ప్రాజెక్టులే ఉండగా, 1956 తర్వాత నాగార్జునసాగర్, శ్రీరాం సాగర్, సోమశిల వంటి మేజర్ ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్న నదులపై అనేక ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. 2000-01 నాటికి 45.27లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. ఉపరితల జలాలు, భూగర్భ జలాలపై ఆధారపడే ఈ వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పాత్ర ఉంది. అయితే సాగునీటి వనరుల వినియోగంలో సమర్థత, సమాన పంపిణీ, పర్యావరణ పరిరక్షణపై చర్చ అవసరం. రాష్ట్రాల మధ్య గోదావరి జలాలపై ఉన్న వివాదాలపై 1980లో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆధారంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ద్వారా 6.5 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. మిగతా ప్రాజెక్టుల వ్యయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఉదాహరణకు, శ్రీరాంసాగర్ వ్యయం రూ. 4,010 లక్షల నుండి రూ.31,800 లక్షలకు పెరిగింది. 2008 నాటికి 20ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. పోలవరం, తెలుగు గంగ, నెట్టెంపాడు, కల్వకుర్తి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాయి. తెలుగు గంగప్రాజెక్టు ద్వారా చెన్నై నగరానికి తాగునీరు, 2.3లక్షల హె.కి సాగునీరు అందించబడుతోంది. చిన్నతరహా వనరుల అభివృద్ధి కూడా గణనీయంగా జరిగింది. 2000-01 నాటికి 20.3 లక్షల చిన్న వనరులు అందుబాటులో ఉన్నాయి. అయితే భూగర్భజలాల అధిక వినియోగం, చెరువుల పూడిక సమస్య, నిర్వహణ లోపాలు సాగు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. చివరిగా, సాగునీటి రంగంలో మౌలిక మార్పులకు దోహదపడే విధంగా సమగ్ర ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ, మధ్యతరహా ప్రాజెక్టులకు, చిన్నవనరుల అభివృద్ధికి దృష్టి సారించాలి. నిక్షిప్త వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు శాస్త్రీయ ధోరణిలో ముందుకెళ్లాలి.




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం దశాబ్దకాలంగా కొనసాగుతోంది. 2014 రాష్ట్ర విభజన జరిగినప్పటికీ, కృష్ణా, గోదావరి నదుల్లో నీటి పంపకంలో స్పష్టత లేకపోవడం, ప్రాజెక్టులపై అనుమతులు కలిగించకపోవడం, కేంద్ర ప్రభుత్వ జోక్యం స్పష్టంగా లేకపోవడం వల్ల సమస్య మరింత సంక్లిష్టమవుతోంది. తెలంగాణ ఏర్పాటైనప్పుడు రాష్ట్రానికి కృష్ణానదిలో తగిన వాటా లభించకపోవడం అన్యాయం అని భావించింది. ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్, నల్గొండ వంటి జిల్లాలు త్రాగునీటి కష్టాలు ఎదుర్కొనడం, సాగు నీటి అవసరాలు తీరకపోవడం విశేషంగా ప్రస్తావించబడింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ద్వారా జరిగిన నీటి కేటాయింపులు తెలంగాణ రాష్ట్రం ఆమోదించలేదు. ఆ తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలై ఉంది. కేంద్రం మాత్రం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం వ్యవహరించాలని అభిప్రాయపడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరించడంతో, కృష్ణా బేసిన్ వెలుపల నీటిని తరలించే ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. 2020లో రాయలసీమ ఎత్తిపోతల పథకంకి జీవో 203 ద్వారా రూ.24000 కోట్లు మంజూరు చేయడం తెలంగాణ తీవ్ర వ్యతిరేకతను కలిగించింది. ఇది కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అభిప్రాయానికి విరుద్ధంగా ఉన్నా, కేంద్రం చర్యలు తీసుకోలేకపోయింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, సీతారామ, దేవాదుల వంటి గోదావరి ప్రాజెక్టులను కేంద్రం కొత్త ప్రాజెక్టులుగా గుర్తించి, డిపిఆర్‌లు సమర్పించమని కోరడం రాష్ట్రాన్ని నిరాశకు గురిచేస్తోంది. అవి 2014కు ముందే ప్రారంభమైన ప్రాజెక్టులని తెలంగాణవాదిస్తోంది. మరోవైపు, కేంద్రం ఈ ప్రాజెక్టులకు సాంకేతిక సలహాకమిటీ ఆమోదం లేకుండా ముందుకెళ్లవద్దని సూచిస్తోంది. గోదావరి నదిపై ఇప్పటికే బచావత్ అవార్డు, జిడబ్ల్యుడిటి, కెడబ్ల్యుడిటి1 వంటి జలపంపక అవార్డులు ఉన్నాయి. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం. ●

# మానవతా విలువలు పెంచే విద్య కావాలి

సోరుపాక అనిల్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల స్థాయిలో, చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఎంతోమంది యువత జీవితం మీద ఆశ కోల్పోతున్నారు. ప్రతి సంవత్సరం పది, ఇరవైకాదు, వందల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఈ దారుణ వాస్తవం మన సమాజం, విద్యా వ్యవస్థ, తల్లిదండ్రుల బాధ్యతా భావాన్ని ప్రశ్నించే స్థితికివచ్చింది. చదువు అనే పవిత్రమైన పదం ఇప్పుడు విద్యార్థులకు భయపడకంగా మారింది. జీవితాన్ని వెలిగించాల్సిన విద్య, ఎందుకు చీకట్లో ముంచుతోంది? ఒక విద్యార్థి ఉదయం నాలుగు గంటలకే లేచి, రాత్రి పది గంటల వరకు ఒక మెషీన్లా చదివే విధంగా షెడ్యూల్ చేస్తే అతని వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, భావోద్వేగాల స్థానమే ఎక్కడ ఉంది? అతని ఆనందం, కలలు, విశ్రాంతి అన్నీ పాఠ్యపుస్తకాల మధ్య రేకుల్లా తుడిచిపెట్టినట్లు పోతున్నాయి. చదువు అనేది నేర్చుకోవడం కోసం, జీవన నైపుణ్యాల కోసం ఉండాలి. కానీ అది ఇప్పుడు గడియారాన్ని లెక్కపెట్టి బాధగా మారింది. ప్రత్యేకించి ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు వారి 100 రిజల్ట్ స్టేట్ టాపర్ మా కళాశాల నుంచే అనే ప్రకటనల కోసం విద్యార్థుల జీవితాన్ని సర్వస్వంగా వాడుకుంటున్నాయి. పబ్లిక్ ప్రాపర్టీ కంటే తక్కువ స్థాయిలో కూడా విద్యార్థులను గౌరవించకపోవడం, వారిని టార్గెట్ ర్యాంక్ల కోసం ఒత్తిడికి గురిచేయడం, మానవ సంబంధాలే లేకుండా ఒక పరీక్షల యంత్రంగా మలచడం ఇవన్నీ విద్య అనే మహత్తరమైన భావనను మట్టికరిపిస్తున్నాయి. నువ్వు ఈ టెస్టులో పాస్ కాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం, తక్కువ మార్కులు వస్తే వర్క్ సెక్షన్లో పెట్టేస్తాం, మరెక్కడైనా అడ్మిషన్ తీసుకోరు వంటి బెదిరింపులు ఇవే వారి భవిష్యత్తు నిర్మించాల్సిన గురువుల మాటలైతే, విద్యార్థులు దిక్కుతోచని స్థితిలోకి ఎందుకు వెళ్లరు? అంతేకాదు, తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశాలు పరిమితమయ్యాయి. విద్యార్థుల అనుభవాలు, భావోద్వేగాలు, అభిరుచులు అన్నీ అణగిపోతున్నాయి. సమస్య చెప్పుకునే వేదిక లేదు. నాలో ఏదో తేడా



ఉంది, నేను ఎందుకు ఇతరుల్లా చదవలేకపోతున్నాను?అనే స్వీయ సందేహాలు విద్యార్థులను మానసికంగా నశింపజేస్తున్నాయి. ఇవన్నీ కలిసినప్పుడు ఒక విద్యార్థికి అసలు బతకాల్సిన ఉత్సాహం మిగలదు. అది జీవితానికి శాపంగా మారుతుంది. మనం ఒక యుగాన్ని నిర్మించాలనుకుంటున్నాం కానీ చదువు పేరుతో మనం ఆ యువతని నాశనం చేస్తున్నాం. ఇది వ్యక్తిగతంగా ఒక్కరి బాధ కాదు, సమాజం మొత్తానికి ఒత్తిడిగల హెచ్చరిక. ఒక విద్యార్థి ఆత్మహత్య వెనక ఒక్క పరీక్ష ఫెయిలు కాదు, కళాశాల ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, గురువుల విమర్శలు, మానసిక ఒంటరితనం అన్నీ కలిసివుంటాయి. నీవు సరిగా చదవడం లేదనిపిస్తోంది. మా గౌరవాన్ని నాశనం చేస్తున్నావు, నీ వల్ల నేను మిగిలిన తల్లిదండ్రుల ముందు తలవంచుకోవాలి. ఇవన్నీ ప్రేమగా చెప్పిన మాటలు కావచ్చు, కానీ ఒక్క పిల్లోడి మనసులో అవి ఏ పిరికితనాన్ని పెంచుతున్నాయో మనం ఊహించలేము. చదువు అనేది ఎప్పటికీ ఒత్తిడిగా ఉండకూడదు. విద్యార్థులు బలంగా, ఆనందంగా, స్వేచ్ఛగా ఎదగాలంటే చదువును మానవతా విలువలతో కలిపి పోషించాల్సిన అవసరం ఉంది. ప్రతి కళాశాలలో మానసిక కౌన్సిలింగ్ ఉండాలి. విద్యార్థి పరీక్షల్లో విఫలమయ్యాడంటే ఇంకోసారి ప్రయత్నించు అనే శబ్దం వినిపించాలి. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను లక్ష్యాల కోసం ఉపయోగించే టూల్స్‌లా కాకుండా, మనుషులుగా చూడాలి. మార్కుల కన్నా ముందు మనిషిత్వం, విజ్ఞానం కన్నా ముందు విశ్వాసం అవసరం. ఒక్క పరీక్షలో ఫెయిలైతే జీవితమంతా ఫెయిలైపోయినట్టు భావించే దశకు విద్యార్థిని తీసుకెళ్లొద్దు. మనమందరం కలిసి ఈ విద్యా వ్యవస్థను పునరాలోచించాలి. విద్యార్థి మానవ హక్కులను కాపాడాలి. మనోబలాన్ని, వ్యక్తిత్వాన్ని పెంచేలా విద్యను రూపుదిద్దాలి. చదువు అనేది ఒక వేదం అది చైతన్యానికి, అభివృద్ధికి మార్గం చూపాలి. కానీ అదే వేదం ఒక మృత్యు సమచారంగా మారడం అత్యంత భయంకరమైనదిగా మారకూడదు. మనం విద్యార్థిని పుస్తకాల్లో కూర్చోపెట్టి పరీక్షల బలిగొంపులో నెట్టకూడదు. మనం ఒక జీవితాన్ని ప్రతి కించాలి. ఒక్క పరీక్ష ఓటమి కాదు ఒక జీవితానికే తలవంచే సందర్భం కూడా కాదు. అందుకే, ఇప్పుడు ఓ మార్పు అవసరం. మరింత ఆలస్యం చేస్తే మరో విద్యార్థి కలలు చిత్తుగా మారతాయి. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది. ●

# అమెరికాను సంపన్న దేశంగా మారుస్తున్న భారతీయులు

మేకిరి దామోదర్


ఆధునిక టెక్నాలజీ ఫలితంగా ప్రపంచమే ఓ 'కుగ్రామంగా' మారింది. దీనితో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో విశ్వవ్యాప్తంగా తెలుస్తోంది. మన భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడి రాజకీయ, సాంకేతిక, వ్యాపార రంగాల్లో ఆర్థికంగా కుబేరులుగా ఎదిగి ఆయా దేశాల్లో పాలకులై, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి ప్రగతి చూస్తూ మా వాళ్లని పొంగిపోతున్నారు. మనవారెక్కడున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడం, మూలాలను విస్మరించకుండా మనవాళ్లను తరతరాలుగా పట్టిపీడిస్తున్న పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తోడ్పడాల్సిన బాధ్యతల గురించి తెలుసుకుందాం. అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య2025లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జూలైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం..ఎలాన్ మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడుగా కొనసాగుతున్నారు. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడుగా నిలిచి మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రపంచ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1 నాటికి 100 బిలియన్ డాలర్లకు అధికమై 2లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది ఇలా ఉంటే ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానంలో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఇప్పుడు టాప్ 10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా ప్రపంచ సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఐదో స్థానంలో ఉన్న ఆయన ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ముఖేష్ అంబానీ ఉన్నారు. వంద బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే. అమెరికాలోని సంపన్న భారతీయులు 43 దేశాలకు చెందిన 125 మంది బిలినీయర్లలో మన వాళ్లే 12 మంది. అగ్రస్థానంలో జయ చౌద్రీ, తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు దక్కింది. అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్టు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే ఉన్నారు. ఈ సంఖ్య పరంగా ఇజ్రాయిల్‌ను మన దేశం అధిగమించింది. ఈ జాబితాలోని 10దేశాల ప్రవాస బిలియనీర్లలో మూడవ వంతు మంది భారత్‌కు చెందిన వారున్నారు. ఇజ్రాయిల్, తైవాన్, కెనడా, చైనా మరో 5 దేశాలకు చెందినవారు ఉన్నారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా



నాదెళ్ల, నికేశ్ అరోరా తొలిసారిగా ఈ జాబితాలో చేరారు. అగ్రస్థానంలో 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌద్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్ డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, పదవ తరగతి వరకు సురక్షిత నీటిసరఫరాలేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్ ఐటి అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బిలియనీర్ గా మారగలిగారు. ఈ జులై నాటికి 1బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే భారత దేశంలో గత ఏడాది 2024 పై యూబీఎస్ నివేదిక మేరకు 39 వేల మంది కొత్త మిలియనీర్లు అవతరించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 4.4శాతం వృద్ధి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియనీర్ల సంఖ్య వృద్ధి విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని, యుబీఎస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. తొలి మూడు స్థానాల్లో తుర్కియే, యూఏఈ, రష్యా ఉన్నాయి. మొత్తం 9,17,000మంది మిలియనీర్ల (కనీసం 10లక్షల డాలర్లు రూ. 8.5 కోట్ల సంపద ఉన్నవారు)లో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కంటే మెరుగ్గా భారత్ ఉంది. అయితే చైనా 63లక్షల మంది మిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 56 దేశాల నుంచి సమీకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం అమెరికా, మెయిన్ ల్యాండ్, చైనా చేతిలోనే సగానికి పైగా వ్యక్తిగత సంపద ఉంది. ప్రపంచ సంపదలో భారత్ వాటా 3.4శాతమే. ఆదాయ వృద్ధి తక్కువ, గత ఐదేళ్లుగా సగటు ఆదాయం వృద్ధి విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఒకటి. వచ్చే 25 ఏళ్లలో సంపద గరిష్టంగా బదలీ అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటిగా మారుతుంది. ఈ దేశంలో ఉన్న యువ జనాభా కారణంగా ఒక తరం నుంచి మరో తరానికి సంపద బదలీ అవుతుంది. మన దేశ వ్యక్తిగత సంపదలో అగ్రగాములు అంబానీ వారసులే. దేశంలో వ్యక్తిగత సంపద విలువ రూ.1,000కోట్లకు మించిన వాణిజ్యవేత్తలతో 360 వెల్త్ వన్ సంస్థ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో ముఖేష్ అంబానీ వారసులు నిలిచారు. తొలితరం పారిశ్రామికవేత్తలతో పాటు వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాలను మరింతగా విస్తృతం చేసిన వారు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులుగా మన భారతీయులు(తెలుగు)వారు కొనసాగుతున్నారు. వీరి మూలాలైన తాత, ముత్తాతలు, వీరికి ఆ స్థాయిని కల్పించిన జన్మభూమి భారత దేశానికి తమ వంతు బాధ్యతతో సేవలు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈదేశంలో పేదరికం, అసమానతలు ఉపాధి లేమి, నిరుద్యోగం లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం ఉంది. వారి సేవలను స్వాగతించుకుంటూ భారత ప్రభుత్వం తోడ్పాటుతో పరిశ్రమలు పెట్టడానికి సౌకర్యం కల్పించి సద్వినియోగపరుచుకోవాల్సిన బాధ్యత కూడా మెండుగా ఉంది. దాతృత్వంతో మన దేశంలోనిపేదరికాన్ని రూపుమాపి సోదర భారతీయుల కళ్ళల్లో ఆనందం తోపాటు దేశప్రతిష్టను పెంచడంలో ఉన్న సంతృప్తి వెలకట్టలేనిది. ప్రవాస భారతీయకుబేరులు జన్మభూమి రుణం తీర్చుకోవడంలో ఇదే శ్రేష్ఠమైన కార్యంగా భావించాలి. ●

# ఆధిపత్యం కోసమే అమెరికా సుంకాలు

## బ్రిక్స్‌దేశాలు మాకు అండగా ఉన్నాయి: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్



**మాస్కో, ఆగస్టు 5:** గ్లోబల్ సౌత్ దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేందుకు అమెరికా ఆధునిక వలసవాద విధానాన్ని అనుసరిస్తోందని రష్యా మండిపడింది. సుంకాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని మార్చలేవని పేర్కొంది. అంతర్జాతీయ వేదికపై స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై అమెరికా రాజకీయ ప్రేరేపితమైన ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శించింది. అభివృద్ధి చెందుతున్న, ఆర్థికంగా వెనుకబడిన (గ్లోబల్ సౌత్) దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి, నిజమైన బహుళపక్ష వాదం, సమానత్వంతో కూడిన ప్రపంచ వ్యవస్థ సాకారానికి కృషి చేసేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలను విధించిన కొన్ని రోజుల తర్వాత మాస్కో నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఆయా దేశాలపై ఆంక్షలు విధించడం దురదృష్టకరం. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా అంగీకరించలేకపోతోంది. ఈ నేపథ్యంలో తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని అనుసరిస్తోంది. తనను అనుసరించేందుకు నిరాకరిస్తున్న, స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు చేస్తోంది. గ్లోబల్ సౌత్ దేశాల సార్వభౌమాధికారంపై ప్రత్యక్ష ఆక్రమణ, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తోందని రష్యా రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా తెలిపారు. ఏ సుంకాల యుద్ధాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని ఆపలేవని తాము దృఢంగా విశ్వసిస్తున్నామని మరియా తెలిపారు. తమకు పెద్ద సంఖ్యలో భాగస్వాములు, సారూప్యత కలిగిన మిత్ర దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలు, అన్నింటికంటే ముఖ్యంగా బ్రిక్స్ దేశాలు మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలను ప్రతిఘటించడానికి మాస్కో సిద్ధంగా ఉందని అన్నారు. పాశ్చాత్య దేశాలు ఒకప్పుడు ప్రోత్సహించిన స్వేచ్ఛా వాణిజ్య రంగంలో ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రేరేపిత రక్షణావాదం, సుంకాల అవరోధాలు ఏర్పడుతున్నా యని స్పష్టం చేశారు. కాగా, భారత్‌పై సోమవారం మరోసారి అక్కసు వెళ్లగక్కారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకాల వడ్డింపుతో తాను ఆగబోవడం లేదని, ముున్ముందు వీటిని ఇంకా పెంచబోతున్నట్లు హెచ్చరించారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తూ విపణిలో భారీ లాభాలకు విక్రయిస్తున్న భారత్‌పై గణనీయ స్థాయిలోనే సుంకాలు పెంచబోతున్నట్లు బెదిరించారు. రష్యాతో యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోయినా భారత్ పట్టించుకోవడం లేదని, అందుకే ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతానని స్పష్టం చేశారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా, ఈయూ దేశాల అభ్యంతరాలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. యూఎస్, ఈయూ తమను లక్ష్యంగా చేసుకోవడంపై విరుచుకుపడింది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతులను యూఎస్ ప్రోత్సహించిందని ఎద్దేవా చేసింది. ఉక్రెయిన్ ఘర్షణ అనంతరం అంతర్జాతీయ విపణిలో తలెత్తిన పరిస్థితుల వల్లే దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తమను విమర్శించే దేశాలు రష్యాతో వాణిజ్యంలో అవసరం లేకపోయినప్పటికీ, మాస్కోతో వాణిజ్యంలో మునిగిపోతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ విమర్శించింది.



# ఎవరు నిజమైన భారతీయులో నిర్ణయించేది జడ్జిలు కాదు..!

## పార్లమెంటు ఆవరణలో ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు కాదో న్యాయమూర్తులు నిర్ణయించరని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన కొన్నివ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మంగళవారం ఈ విధంగా స్పందించారు. పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే పౌరుల దేశభక్తిని నిర్ధారించడం వారి పని కాదని ఆమె అన్నారు. భారత సాయుధ బలగాల గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి ప్రాథమిక బాధ్యత. మా సోదరుడు రాహుల్ గాంధీ సైన్యానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడరు. ఆయనకు మన సైన్యం పట్ల అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయని వివరించారు. ప్రతిపక్ష నాయకుల దేశభక్తిని, పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు.

గతంలో 2019లో రాహుల్ గాంధీ పౌరసత్వంపై ప్రశ్నలు తలెత్తినప్పుడు కూడా ఆమె ఇదేవిధంగా గట్టిగా బదులిచ్చారు. రాహుల్ గాంధీ భారతీయుడని దేశం మొత్తానికీ తెలుసు. ఆయన ఇక్కడే పుట్టారు, అందరి కళ్ల ముందే పెరిగారు. ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు, ఇటువంటి అర్థంలేని ఆరోపణలు ఎందుకని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.



## జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగానే విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు.

## లాస్‌ఏంజెల్స్‌లో మళ్లీ కాల్పులు: ఇద్దరు మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు




**లాస్ ఏంజెల్స్, ఆగస్టు 5:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. లాస్ ఏంజెలెస్ నగరంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఓ పార్టీలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎల్‌ఏపీడీ) తెలిపిన వివరాల ప్రకారం, డౌన్‌టౌన్ లాస్ ఏంజెలెస్‌లోని 14వ ప్లేస్, పలోమా స్ట్రీట్ సమీపంలోని ఓ గిడ్డంగిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వారాంతంలో జరిగిన హార్డ్ సమ్మర్ మ్యూజిక్ ఫెస్టివల్ అనంతరం ఈ ఆఫ్టర్ పార్టీని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో పార్టీలో కాల్పులు జరిగినట్టు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆసక్తికరంగా, కాల్పులు జరగడానికి కొన్ని గంటల ముందే, అంటే ఆదివారంరాత్రి 11 గంటల సమయంలోనే పోలీసులు ఈ పార్టీ జరుగుతున్న ప్రదేశానికి వచ్చారు. అనుమతి లేకుండా 50 మందికి పైగా పార్టీ చేసుకుంటున్నారని గమనించి, ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో తుపాకీ కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, పార్టీని ఖాళీ చేయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే, వారు వెళ్లిన కొద్ది గంటలకే అదే ప్రదేశంలో ఈ దారుణం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, తుపాకీ గాయాలతో పడి ఉన్న ఎనిమిది మందిని గుర్తించారు. వారిలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, 52 ఏళ్ల మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బాధితుల వయసు 26 నుంచి 62 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు. ఈ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, నిందితుల గురించి ఎటువంటి సమాచారం లేదని లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

## దశాబ్దాలపాటు పాకిస్థాన్‌కు ఆయుధ సరఫరాచేసిన అమెరికా

### పాతకాలం నాటి క్లిప్పింగ్‌తో ఎండగట్టిన ఈస్టర్న్ కమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** అమెరికాతో భారత్ వాణిజ్య సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, భారత సైన్యం పరోక్షంగా చురకలంటించింది. ఉగ్రవాదులకు స్వర్గధామమైన పాకిస్థాన్‌కు అమెరికా దశాబ్దాల పాటు ఎలా ఆయుధాలు సరఫరా చేసిందో గుర్తుచేస్తూ ఒక పాత వార్తాపత్రిక కథనాన్ని సోషల్ మీడియాలో పంచుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోస్ట్ ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సైన్యంలోని ఈస్టర్న్ కమాండ్, మంగళవారం "ఆ రోజు... ఈ రోజు 1971 ఆగస్టు 5" అనే శీర్షికతో 1971 నాటి ఒక ఆంగ్ల పత్రిక క్లిప్పింగ్‌ను షేర్ చేసింది. 1954 నుంచి పాకిస్థాన్‌కు 2 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఆయుధాలు అనే శీర్షికతో ఉన్న ఆ కథనం, బంగ్లాదేశ్ విమోచన యుద్ధం జరిగిన 1971 వరకు పాకిస్థాన్‌కు అమెరికా ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఎలా కొనసాగిందో వివరిస్తోంది. భారత్ రష్యా నుంచి రాయితీ ధరకు చమురు కొనుగోలు చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కారణంగా భారత్‌పై భారీగా సుంకాలు విధిస్తామని, జరిమానా వేస్తామని హెచ్చరించారు. రష్యా యుద్ధ యంత్రం వల్ల ఉక్రెయిన్‌లో ఎంతమంది చనిపోతున్నా భారత్ పట్టించుకోవడం లేదు. అందుకే భారత్ అమెరికాకు చెల్లించే సుంకాలను నేను గణనీయంగా పెంచుతానని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. గట్టిగా బదులిచ్చిన భారత్ ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా ఆరోపణలు అన్యాయమైనవి, అహేతుకమైనవని తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైనప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునేలా అమెరికాయే చురుకుగా ప్రోత్సహించిందని గుర్తు చేసింది. అంతేకాకుండా, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల రెండు నాల్కల ధోరణిని భారత్ ఎండగట్టింది. అమెరికా ఇప్పటికీ తన అణువిద్యుత్ కేంద్రాల కోసం రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను దిగుమతి చేసుకుంటోందని, కానీ భారత్‌ను విమర్శించడం సరికాదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, భారత సైన్యం అమెరికా పాకిస్థాన్ పాత బంధాన్ని గుర్తుచేయడం దౌత్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా నిర్ణయం.. ఐరోపాకు ప్రాణసంకటం


### అణుఒప్పందం నుంచి వైదొలగిన రష్యా



**మాస్కో, ఆగస్టు 5:** రష్యాను బెదరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న ఓ తొందరపాటు నిర్ణయం ఐరోపా దేశాలకు ప్రాణ సంకటంగా మారనుంది. మధ్యశ్రేణి క్షిపణులను మోహరించకుండా మాస్కో-వాషింగ్టన్‌ల మధ్య ఉన్న ఐఎన్‌ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ట్రీటీ) ఒప్పందాన్ని ఇక ఏమాత్రం అనుసరించబోమని రష్యా ప్రకటించింది. పశ్చిమదేశాలు తమ జాతీయ భద్రతకు నేరుగా ముప్పును సృష్టించాయని ఆరోపించింది. ఈ క్రమంలో ఒప్పందాన్ని అనుసరించే పరిస్థితులు లేవని తేల్చిచెప్పింది. ఈ మేరకు రష్యా విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము కొన్ని రకాల క్షిపణులను మోహరించకుండా విధించుకున్న ఆంక్షలను ఇక పాటించబోమంది. అమెరికా దళాలు ఫిలిప్పీన్స్‌లో టైఫూన్ క్షిపణి లాంచర్లను మోహరించడం, ఆస్ట్రేలియా సమీపంలోని టలిస్మాన్ సాబ్రె డ్రిల్స్‌లో క్షిపణులను పరీక్షించడం దీనికి ప్రధాన కారణంగా వెల్లడించింది. మరోవైపు ట్రంప్ చర్యలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. ఇటీవలే రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ప్రకటనకు స్పందనగా రెండు ఒహైయో శ్రేణి అణుజలాంతర్గాములను మోహరించేలా ఆదేశాలు జారీ చేశారు.

**అసలేమిటి ఈ ఐఎన్ఎఫ్ ఒప్పందం..?**

1987లో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీగా దీనిని వ్యవహరిస్తారు. దీనిప్రకారం భూ ఉపరితలంపై నుంచి ప్రయోగించే మధ్యశ్రేణి రేంజి క్షిపణుల మోహరింపును నిషేధించారు. 500 కిలోమీటర్ల నుంచి 5,500 కిలోమీటర్ల మధ్యలోవి ఈ ఒప్పంద పరిధిలోకి వస్తాయి. అప్పట్లో ఐఎన్ఎఫ్ ట్రీటీ కారణంగా సోవియట్ అమెరికాలకు చెందిన దాదాపు 2,692 క్షిపణులను ధ్వంసం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ప్రచ్ఛన్న యుద్ధాన్ని మలుపుతిప్పిన సంధిగా భావిస్తారు. వాస్తవానికి ఈ ఇంటర్మీడియట్ రేంజి క్షిపణుల మోహరింపుతో అమెరికా మిత్రులైన ఐరోపా దేశాలకే ప్రధాన ముప్పు. 2019లో ట్రంప్ ఈ ఒప్పందం నుంచి అమెరికాను బయటకు లాగేశారు. రష్యా సుదీర్ఘకాలంగా దీనిని ఉల్లంఘిస్తోందని ఆయన నాడు ఆరోపించారు. 9ఎం729 లేదా ఎస్ఎస్‌సి-8 క్షిపణులను మోహరించిందని పేర్కొన్నారు. దీనిని నాడు మాస్కో తిరస్కరిం చింది. ఇప్పుడు ట్రంప్ అణు జలాంతర్గాముల మోహరింపు ఆదేశాలు వెలువడిన మూడు రోజులకు రష్యా కూడా ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చేస్తామని ప్రకటించింది.



## రష్యా తరపు యుద్ధంలో పాక్, చైనా కిరాయి సైనికులు!

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 5:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ కీలక ఆరోపణలు చేసింది. తమ దళాలు మాస్కో సైనికులతోపాటు పాకిస్థాన్, చైనాకు చెందిన కిరాయి సైనికులతో కూడా పోరాడాల్సి వస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను పాక్ ఖండించింది. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలోని సైనిక దళాలతో భేటీ అయినట్లు జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఫ్రంట్‌లైన్‌లోని కమాండర్ల గురించి, ఆ ప్రాంతంలోని రక్షణ వ్యవస్థల గురించి వారితో మాట్లాడినట్లు తెలిపారు. డ్రోన్ సరఫరాలు పెంచడం, దళాల నియామకం, బ్రిగేడ్‌లకు ప్రత్యక్ష నిధులపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చైనా, తజకిస్థాన్, పాకిస్థాన్‌తో సహా ఆఫ్రికన్ దేశాల నుంచి వస్తున్న కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు తమ దళాలు గుర్తించాయన్నారు. దీనికి తమ ప్రతిస్పందన గట్టిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో పాల్గొని దేశానికి సేవ చేస్తున్న దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## హోంమంత్రిగా అమిత్‌షా రికార్డు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనత తను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీ కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపి గాలింపును తీవ్రస్థాయిలో కొనసాగించే చర్యలుచేపట్టారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు, ఎగువసభలో తీర్మానానికి ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2025 ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356కింద అమలులోకివచ్చే ఈ నిర్ణయం ప్రకారంరాష్ట్రపతి ఇప్పుడు గవర్నర్ ద్వారా మణిపూర్ రాష్ట్ర పరిపాలనా విధులను నేరుగా నియంత్రిస్తారని అర్థం.

కేంద్ర హోంమంత్రిత్వ శాఖజారీ చేసిన భారతగెజిట్‌లో ప్రచురించబడిన ఈప్రకటన,మణిపూర్ శాసనసభఅధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపివేస్తుందని పేర్కొంది.

## పంద్రాగస్టు వేడుకలకు భద్రత డొల్ల


### డమ్మీబాంబు గుర్తింపులో వైఫల్యం, ఏడుగురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశ రాజధాని సిద్ధమవుతున్న వేళ, ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటలో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది అప్రమత్తతను పరీక్షించేందుకు నిర్వహించిన ఒక మాక్ డ్రిల్‌లో భాగంగా పెట్టిన డమ్మీ బాంబును గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆగస్టు 15 వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం స్పెషల్ సెల్ బృందం ఎర్రకోట వద్ద భద్రతను పరీక్షించేందుకు ఒక మాక్ డ్రిల్ నిర్వహించింది. సాధారణ పౌరుల వలె దుస్తులు ధరించిన స్పెషల్ సెల్ సిబ్బంది, ఎవరి కంటా పడకుండా ఒక డమ్మీ పేలుడు పదార్థాన్ని కోట ప్రాంగణంలోకి తీసుకెళ్లి రహస్యంగా ఉంచారు. అయితే, ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది దీనిని పసిగట్టలేకపోయారు. ఈ విషయం బయటపడటంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సిబ్బంది నిర్లక్ష్యంగా భావించి, బాధ్యులైన ఏడుగురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లపై తక్షణమే చర్యలు తీసుకున్నారు. కొందరిని సస్పెండ్ చేయగా, మరికొందరిని మందలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డమ్మీ బాంబును తీసుకెళ్లిన బృందం ప్రధాన ద్వారం వద్ద భద్రతా తనిఖీలను దాటుకుని లోపలికి వెళ్లింది. సిబ్బంది దీనిని గుర్తించకపోవడం వారి అప్రమత్తతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఓ సీనియర్ పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు ఎర్రకోట వద్ద భద్రతను పూర్తిస్థాయిలో సమీక్షించి, కట్టుదిట్టం చేస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో పనిచేసే 700 ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాను పటిష్ఠం చేయనున్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్‌పై రహస్యకుమార్తె తిరుగుబాటు



**ప్యారిస్,ఆగస్టు 5:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు వ్యతిరేకంగా ఆయన రహస్య కుమార్తెగా భావిస్తున్న యువతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దూమారం రేపాయి. లక్షలాది మంది ప్రాణాలను బలిగొని, తన జీవితాన్ని కూడా నాశనం చేసిన వ్యక్తి ఆయనేనంటూ ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నో ఏళ్లుగా మౌనంగా ఉన్న ఆమె తొలిసారిగా తన తండ్రిగా భావిస్తున్న వ్యక్తిపై తిరుగుబాటు స్వరం వినిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు, స్వెత్లానా క్రివోనోగిఖ్‌కు జన్మించిన కుమార్తెగా ఎలిజవేతా క్రివోనోగి(22)ను అంతర్జాతీయ మీడియా వర్గాలు ఎప్పటినుంచో పేర్కొంటున్నాయి. స్వెత్లానా ఒకప్పుడు సాధారణ క్లీనింగ్ వర్కర్‌గా పనిచేసి, పుతిన్ అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా అపార సంపదకు యజమానురాలయ్యారు. పండోరా పత్రాల వంటి లీకులు ఆమె ఆస్తుల వివరాలను బయటపెట్టాయి.

## తృణమూల్ ఎంపి పార్టీ చీఫ్‌విప్ పదవికి రాజీనామా



**కోల్‌కత్తా, ఆగస్టు 5:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ఎంపీల మధ్య పెరుగుతున్న కలహాలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీరియస్ అయ్యారు. పార్టీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ మహువా మొయిత్రా మధ్య 'పంది','మహిళా వ్యతిరేకి', 'కొంపలు కూల్చే మహిళ'వంటి తీవ్రమైన పదాలతో సాగిన పరస్పర వాగ్వివాదంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ పాటించాలని ఆమె ఎంపీలకు సూచించారు. ఈ ఘటన తర్వాత జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ ఎంపీల మధ్య సమన్వయం లోపించిందని మమత చెప్పడంతో, దానికి బాధ్యత వహిస్తూ లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ పదవికి తాను రాజీనామా చేసినట్టు కల్యాణ్ బెనర్జీ తెలిపారు. ఎంపీలు పరస్పర విమర్శలకు దిగకుండా నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) వంటి జాతీయ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాలని మమతా బెనర్జీ సూచించారు.

## భారత సంతతి ఆటోడ్రైవర్‌పై జాతి వివక్ష దాడి




**డబ్లిన్, ఆగస్టు 5:** ఐర్లాండ్‌లో భారత సంతతికి చెందిన క్యాబ్ డ్రైవర్‌పై దారుణమైన జాతి వివక్ష దాడి జరిగింది. మీ దేశానికి మీరు తిరిగి వెళ్లిపోండి అంటూ ఇద్దరు యువకులు ఆయనపై సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన డబ్లిన్ శివారు ప్రాంతమైన బాలిమన్‌లోని పాపిన్‌ట్రీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గత 23 ఏళ్లుగా ఐర్లాండ్‌లో నివసిస్తూ, పదేళ్లుగా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న లఖ్‌వీర్‌సింగ్ తన క్యాబ్‌లో ఇద్దరు యువకులను ఎక్కించుకున్నారు. వారు కోరిన ప్రాంతానికి చేర్చిన తర్వాత, అకస్మాత్తుగా ఆ యువకులు కారు డోర్ తెరిచి, తమ వెంట తెచ్చుకున్న సీసాతో లఖ్‌వీర్ సింగ్ తలపై రెండుసార్లు బలంగా కొట్టారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపోండి అంటూ జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తూ అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఊహించని దాడితో లఖ్‌వీర్ సింగ్ తీవ్ర రక్తస్రావంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సహాయం కోసం సమీపంలోని ఇళ్ల తలుపులు తట్టినా ఎవరూ స్పందించలేదు. చివరకు, ఆయనే అత్యవసర సేవలకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, పారామెడికల్ సిబ్బంది ఆయన్ను బ్యూమాంట్ ఆసుపత్రికి తరలించారు.

## కాలిఫోర్నియాలో కార్చిచ్చు.. 65వేల ఎకరాల్లో చెలరేగిన మంటలు



**వాషింగ్టన్, ఆగస్టు 5:** అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు సంభవించింది. గత శుక్రవారం మొదలైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో గాలినాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 'గిఫోర్డ్'గా పేర్కొనే ఈ కార్చి చ్చు ప్రస్తుతం 65వేల ఎకరాలకుపైగా విస్తరించింది. లాస్ ఏంజెలెస్, వెంచురా, కార్న్‌వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసతులతో పాటు పొరుగునున్న లాస్‌వెగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం నాటికి 3శాతం మాత్రమే మంటలను అదుపు లోకి తీసుకురాగలిగామని అధికారులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రూ.700 కోట్లు చెల్లింపు

## నిధుల కొరత లేకుండా చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు రూ.700 కోట్లు విడుదల చేయగా.. ఆగస్టు 4న ఒక్కరోజే రూ.130 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సోమవారం డబ్బులు బదిలీ చేస్తున్నారు. ఈ పథకం కోసం హడ్కో నుంచి రూ.500 కోట్ల లోన్ కూడా తీసుకున్నారు. ప్రస్తుతం లక్షన్నరకుపైగా ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. 6గ్యారంటీలలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా.. లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణాలు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నరకు పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ మేరకు లబ్ధిదారులకు తీపికబురు చెబుతూ అకౌంట్లలో డబ్బులు జమ చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.700 కోట్లు విడుదల చేసింది.

ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి, నిధులు ఆలస్యం కాకుండా ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డబ్బు బదలీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,08,702 ఇళ్లను మంజూరు చేయగా వాటిలో 1,77,932 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్ధిదారులకు రూ.5 లక్షల సాయాన్ని మొత్తం నాలుగు దశల్లో అందజేస్తున్నారు. ఈ నెల 4నఒక్కరోజే రూ.130 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదలీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ప్రారంభించిన సమయంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత రాకుండా చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీకి అనుగుణంగా.. నిధుల విడుదలలో ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ విధానాన్ని అనుసరిస్తోంది. లబ్ధిదారులకు సకాలంలో నిధులు విడుదల చేసేందుకు గృహ నిర్మాణ పథకం కోసం హడ్కో నుంచి రూ.500 కోట్ల లోన్ కూడా సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్లు, రాజీవ్ స్వగృహ ఫ్లాట్లకు వేలం నిర్వహించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కూడా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగవంతంగా ముందుకు సాగుతుందని.. నిధుల కొరత లేకుండా లబ్ధిదారులకు సకాలంలో సాయం అందుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అన్ని జిల్లాల అధికారులతో ఇళ్ల నిర్మాణం పురోగతి, సమస్యల గురించి చర్చించిన సంగతి తెలిసిందే.



మంగళవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం తదితరులు

# ఉపాధి హామీ నిధులు పెంచాలి

## కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రి సీతక్క భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంగళవారం సమావేశమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల ఆశోక్‌తో కలసి కేంద్ర మంత్రితో భేటీ అయి శాఖపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను పెంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్రం 12 కోట్ల పని దినాలు మంజూరు చేసినప్పటికీ, ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పని దినాలకే పరిమితం చేయడం గ్రామీణాభివృద్ధికి అడ్డంకిగా మారిందని ఆమె పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధితో పాటు మౌలిక సదుపాయాలు కూడా అందిస్తున్నామని తెలిపారు. ఉపాధిపై ఆంక్షలు లేకుండా నిధులను పెంచాలని కోరుతూ వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందచేశారు. సీతక్క విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

# రాష్ట్రానికి 2 క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లు

## దేశవ్యాప్తంగా 7 కేంద్రాలకు ప్రణాళిక

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఇండియాలోనే అత్యవసరంగా కావాల్సిన కీలక ఖనిజాలపై జరగనున్న 7 రీసెర్చ్ సెంటర్లను కేంద్ర ఏర్పాటు చేస్తోంది. వాటిల్లో రెండు రీసెర్చ్ సెంటర్లు రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కీలకమైన నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఈ రెంటిలో ఒకటి ఐఐటి హైదరాబాద్ కాగా, మరొకటి రాష్ట్రంలోని హాకీంపేట్‌లో గల నాన్స్ ఫామ్స్ టెక్నాలజీ డెవెలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టిడిసి)లో క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడున్న టెక్నాలజీతో పాటు, ఫ్యూచర్‌కి కావాల్సిన ఎనర్జీ, బ్యాటరీలు, స్పేస్ లాంచ్‌లు, డిఫెన్స్ టెక్నాలజీ ఇవన్నీ ఓ ప్రత్యేకమైన మినరల్స్ మీదే ఆధారపడి ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటు చేసింది. ఈ మిషన్ కింద రూ16,300 కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపింది. ఇవే కాకుండా మరో రూ.18 వేల కోట్లు పీఎస్‌యూల నుంచి తీసుకోనుంది. మొత్తం దేశాన్ని కవర్ చేసేందుకు ఏడేళ్ల ప్లానింగ్ రెడీగా ఉంది. ఈ ప్లాన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా 7 సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తోంది.

# ముగిసిన ఎడ్‌సెట్ వెబ్‌ఆప్షన్లు

## నేడు ఎడిట్‌కు అవకాశం.. 9న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారంతో వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 9న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జులై 14న జారీ చేయగా.. జులై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జులై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జులై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కౌన్సెలింగ్‌కి అర్హత సాధించిన వారు సోమ, మంగళవారాల్లో రెండు రోజులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నేడు(బుధవారం- నెల 6న) ఆప్షన్లను ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది.

# విషాహారం తిని 150 గొర్రెలు మృతి



**మునగాల, ఆగస్టు 5, ప్రభాతవార్త:** విష ఆహారం తిని 150 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొద్దుల చెరువులో చోటు చేసుకుంది. రేపాల పశు వైద్య అధికారి డాక్టర్ మమత తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ధన్వాడ మండలం, హనుమాన్ పల్లి గ్రామానికి చెందిన కొర్ల శివకుమార్ అనే గొర్రెల పెంపకదారుడు రెండు రోజులుగా తనకున్న గొర్రెల మందను మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ కట్టపై మేపుతుండగా గత శనివారం గొర్రెల మంద లేటోనా కెమెరా అనే విషతుల్య మొక్క తినడం ద్వారా 150 గొర్రెలు అస్తవ్యస్తతకు గురై అడ్డం పడగా గొర్రెల పెంపకదారుడు శివకుమార్ అప్రమత్తమై కాపాడుకునే ప్రయత్నంలో నీడ నిమిత్తమై గదిలోఉంచగా, సోమవారం సాయంత్రం చూసేసరికి 150 గొర్రెలు ఎక్కడికక్కడ చనిపోగా, ఇంకా 100 గొర్రెలు అస్తవ్యస్తతకు గురై ఉన్నాయి. అని ఆమె తెలిపారు, విషతుల్య మొక్క తినడం వల్ల ఎండకు గొర్రెలు అస్తవ్యస్తతకు గురై గత రెండు రోజులుగా సరైన వైద్యం లేక మరణించాయని తెలిపారు.

సదరు గొర్రెల పెంపకదారులు మన ప్రాంతానికి చెందిన వారు కాకపోవడంతో వారు తమ పశువైద్య శాఖ వారికి సమాచారం ఇవ్వలేదని ఆమె తెలిపారు, గొర్రెలు చనిపోవడంతో సుమారు రైతుకు 15 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని ఆమె తెలిపారు, చనిపోయిన గొర్రెల, సంఘటన స్థలాన్ని సిఐ రామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రామారావు, సందర్శించి చనిపోయిన గొర్రెల మందను పరిశీలించారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేసి తీరుతామని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపేలా చేయాల్సిన బాధ్యత బిజెపి రాష్ట్ర నేతలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అంటేనే త్యాగాల పార్టీ అన్నారు. సోనియా, రాహుల్‌లు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా త్యాగం చేశారని పేర్కొన్నారు.



నూతి శ్రీకాంత్‌గౌడ్

గతంలో పరిపాలించిన ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్‌కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతినెలా 7వేల కోట్ల వడ్డీ కట్టవలసి వస్తుందని అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో పార్టీ ఉందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే అవసరం కార్యకర్తలపై ఉందని నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు.

## పెద్దపల్లి సమావేశం రసాభాస

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా సాక్షి గా జిల్లా నాయకత్వంలో విభేదాలు భగ్గుమన్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన రామచందర్ రావు మొట్టమొదటిసారిగా పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనకు బిజెపి పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. భారీ ఎత్తున ఒగ్గు డోలు కళాకారులతో



ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా గజమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈక్రమంలో బిజెపి వివిధ వర్గాలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పెద్దపల్లి పోలీస్ యంత్రాంగం ఇరువర్గాలను వారిని చెదరగొట్టారు. అనంతరం ఎంబి గార్డెన్‌కు చేరుకున్న అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రారావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి బలంగా ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి ఎదుటే పార్టీలో భగ్గుమన్న విభేదాలు

కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, ఆ ఫలితం కాంగ్రెస్ పార్టీ అనుభవిస్తుందని అన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో పార్టీ బలమైన శక్తిగా అవతరించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిరక్ష్యం చేసిందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి లక్ష కోట్లు దోచి, తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎరువులు సరఫరా చేస్తున్నప్పటికీ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ చేసిన ఘనత బిజెపికే దక్కుతుందని అన్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం విస్తరణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పార్టీలో అంతర్గత విభేదాలు పక్కన పెట్టి గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. గత ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పార్టీలో కష్టపడి పని చేస్తే తగిన ప్రతిఫలం లభిస్తుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 95 శాతం మంది ఉపాధ్యాయులు తనకు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహార్ రెడ్డి తన అనుచరులతో బిజెపిలో తీర్థం పుచ్చుకున్నారు. బిజెపి రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రా రావు నల్ల మనోహార్ రెడ్డికి, ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, గోమాస శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణా రెడ్డి, కాసిపేట లింగయ్య, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, కందుల సంధ్యారాణి, చంద్రుపట్ల సునీల్ రెడ్డి, కన్నం అంజయ్య, నారాయణ రెడ్డి, మీసా అర్జున్ రావు, సీనియర్ నాయకులు చిలారపు పర్వతాలు, జంగ చక్రధర్ రెడ్డి, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, రాజగోపాల్ తదితరులున్నారు.

# గురుకులాల్లో మళ్లీ ఫుడ్‌పాయిజన్

## మూడు జిల్లాల్లో 65 మంది విద్యార్థులకు అస్వస్థత

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆహారం విషతుల్యమై విద్యార్థులు తరచూ అస్వస్థతలకు గురవుతున్నారనే విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట సంక్షేమ గురుకులాల్లో ఆహారం విషతుల్యమై ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రంలోని ఖమ్మం, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలోని మొగుళ్లపల్లి, కల్లూరు , రెబ్బెన గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ అయి, 65 మంది అస్వస్థతకు గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉదయం కిచిడీ తిన్న 31 మంది విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడ్డారు. మొగుళ్లపల్లి పీహెచ్‌సీలో 18 మంది చికిత్స పొందుతుండగా, 13 మందిని అంబులెన్స్‌లో చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అలాగే ఖమ్మం జిల్లాలోని కల్లూరులో 30 మందికి వాంతులు ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆశ్రమ వసతిగృహంలో ఉదయం కిచిడీ తిని పాఠశాలకు వెళ్లిపోయారు. గంట వ్యవధిలోనే వారిలో 30 మంది విద్యార్థినులు సొమ్మసిల్లి పడిపోయారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే సీహెచ్‌సీకి తరలించారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు రాత్రి భోజనంచేసి పడుకున్నారు. కొద్దిసేపటికే స్పందన, సంజన, సంకీర్తన తీవ్రఅస్వస్థతకు గురికాగా సిబ్బంది బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. సంకీర్తన కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు.

# 2.24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత

## కేంద్రమంత్రి నడ్డాకు ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయాలని కేంద్రమంత్రి నడ్డాను చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రికి లేఖ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరా తగ్గిందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన మొత్తం యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటి), అయితే, జూలై 31, 2025 నాటికి, ఏప్రిల్ నుండి జూలై వరకు మొత్తం 6.60 ఎల్ఎంటి కేటాయింపులకు బదులుగా 4.36 ఎల్ఎంటి యూరియా మాత్రమే సరఫరా చేశారని, దీని ఫలితంగా 2.24 ఎల్ఎంటి కొరత ఏర్పడిందన్నారు. అంతేకాకుండా, ఆగస్టు నెలలో వాస్తవ అవసరం దాదాపు 3.50 ఎల్ఎంటి కానీ






కేవలం 1.70 ఎల్ఎంటిలు మాత్రమే కేటాయించబడిందని, ఈ పరిస్థితి కారణంగా, రైతులు తమ వాస్తవ డిమాండ్లను తీర్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపు, సరఫరాలో విస్తృత అంతరం ఉందని, పత్తి, మొక్కజొన్న, వరి వంటి పంటలు ఎక్కువగా ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవలే మిమ్మల్ని కలిసి ఈ కొరత సమస్యపై మీ దృష్టిని తీసుకొచ్చారు, పీక్ సీజన్‌లో యూరియా కొరత కారణంగా రాష్ట్రం లోని రైతులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను వివరించారు. ఇది రైతులకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో అవసరమైన యూరియా సరఫరా కోసం వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేటాయించిన యూ రియా సరఫరా చేయకపోవడం వల్ల తెలంగాణ మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల రైతులు కూడా ఒత్తిడికి గురవుతున్నారని తెలిసింది. ఫిబ్రవరి 17, 2025 నాటి ఎరువుల కేటాయింపు లేఖ ప్రకారం రైతుల వాస్తవ డిమాండ్లను తీర్చడానికి రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరాను ఏర్పాటు చేయాలన్నారు.

# త్యాగమైనా.. పోరాటమైనా మునుగోడు అభివృద్ధే ధ్యేయం

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మునుగోడు ప్రాంత ప్రజల అభివృద్దే తన ధ్యేయమని, అవసరమైతే ఎలాంటి త్యాగానికైనా సిద్దమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాట్ కామెంట్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో నూతనంగా నిర్మించిన 33/11 సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోసం నాడు పదవీ త్యాగం చేసి ప్రభుత్వాన్నే మునుగోడు ప్రాంత ప్రజల కాళ్ల ముందు నిలబెట్టానని, పదవులు తనకు ముఖ్యం కాదని, ఈ ప్రాంత అభివృద్దే ధ్యేయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పడంతోనే తాను తిరిగి పార్టీలోకి వచ్చానని, పదవుల కోసం ఎవ్వరి కాళ్ల వద్దకు వెళ్లలేనన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో నియోజవకర్గం మొత్తం సమస్యలకు నిలయంగా మారిందని, తాను ఎమ్మెల్యే అయిన తర్వాత సమస్యలపై దృష్టి సారించి ప్రధాన సమస్యలైన విద్యా, వైద్యం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుం దన్నారు. నియోజకవర్గంలో మరో 19 సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ప్రతిపాధనలను సిద్దం చేశామన్నారు. దీంతో లోఓల్టేజి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మరో రెండు 132 కెవి సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతో నియోజవకర్గం లో పూర్తిగా విద్యుత్ సమస్య పరిష్కారమౌ తుందన్నారు.



తాను ఎమ్మెల్యేగా గెలవడానికి కమ్యూనిస్టులు కీలకమని, అదే విధంగా కమ్యూనిస్టులకు ఎమ్మెల్సీ రావడం కాంగ్రెస్ పార్టీ పాత్ర అంతేనన్నారు. అనకు తడుగా ఎమ్మెల్సీ సత్యం తోడుగా ఉన్నాడని, ఇద్దరం కలిసి మునుగోడు అభివృద్దిని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. ఎల్‌బి.నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి వచ్చేదని, కానీ మునుగోడు ప్రజల అభివృద్ధి కోసమే ఇక్కడికి వచ్చానన్నారు. మునుగోడు ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయని, మొదటి విడతలో ప్రభుత్వ నిబంధనలతో అందరికి ఇండ్లు రాలేదని, అర్హులందరికీ ఇళ్లు ఇప్పిస్తామన్నారు. బిఆర్ఎస్‌లో ఒక్క ఇళ్లు కూడా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజవకర్గంలో 3500 ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం చిమిర్యాల గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డిఓ శేఖర్‌రెడ్డి, తహాశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

# నేడు దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు

## సీట్లు పొందిన వారు 8 వరకు కాలేజీల్లో చేరాలి

## 11, 12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఫేజ్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నేడు(బుధవారం) సీట్ల కేటాయింపు చేయనున్నారు. స్పెషల్ ఫేజ్ దరఖాస్తు గడువును మొదట జులై 25 నుంచి 31 వరకు అవకాశం కల్పించగా.. దానిని కాస్త ఈ నెల 2 వరకు పొడిగించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు రాని వారు.. కొత్త వారితోపాటు ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించలేదు. ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారికి నేడు సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 8 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించగా.. 6 నుంచి 8 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలతోపాటు ఎయిడెడ్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 11, 12 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. స్పాట్ అడ్మిషన్లు పొందడానికి నోకల్, నాన్‌లోకల్ విద్యార్థులు అర్హులని.. అయితే స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందిన వారు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులు కాదని వెల్లడించారు.



సంఘీభావం తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలి

## సిపిఎం నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 5, ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుకై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర బీజేపీ పార్లమెంట్ సభ్యులు పార్లమెంటులో ఒత్తిడి చేయాలని, లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకై రాష్ట్రంలో కులగణన చేసి, వచ్చిన రిపోర్ట్ ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, తీర్మానాన్ని కేంద్రానికి పంపినప్పటికీ, రాష్ట్రపతి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ఆడుతున్న నాటకాలను ఎండగట్టాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య, హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి వెంకటేష్, సెక్రటేరియట్ సభ్యులు బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ల కోసం ఉద్యమానికి సిద్ధం

## నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో ఉద్యమానికి సిద్ధమైనట్లు నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తోపాటు కేబినెట్ మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం ఏఐసిసి నేతలతో కలిసిన ఆందోళన చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇదే అంశంపై రాష్ట్రపతిని కలిసేందుకు ఆపాయింట్‌మెంట్ కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రపతి దగ్గర రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఆమోదించాలని కోరామన్నారు. రాష్ట్రపతిని కలిసి ఆ బిల్లుల ప్రాధాన్యత వివరించాలని ప్రయత్నిస్తున్నామని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారని తెలిపారు.

రాష్ట్రపతిని కలవడానికి అపాయింట్‌మెంట్ కోరాం, కానీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. బుధవారం, గురువారం గానీ రాష్ట్రపతిని కలిసే అవకాశం ఇవ్వోచ్చని ఆశిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున ప్రతినిధుల బృందం వెళ్లి రాష్ట్రపతిని కలుస్తామని ఎంపి మల్లు రవి వివరించారు. వారం పది రోజుల కిందట లేఖ రాసినట్లు, ఇక్కడ రాజ్యసభలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌తో వెళ్లి కలుస్తామని వివరించారు. రాష్ట్రపతి కూడా బడుగు బలహీన వర్గాల నుంచి వచ్చారు. కాబట్టి బిసి రిజర్వేషన్ బిల్లుల ప్రాధాన్యతను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆగస్టు 6న జరగబోయే ధర్నాలో పాల్గొనాలని దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంపిలే కాకుండా.. ఇండియా కూటమికి చెందిన ఎంపిలను కూడా ఆహ్వానించామన్నారు. ఎంపిలు వారి సమయానికి అనుకూలంగా వస్తారని ఆశిస్తున్నట్లు, ఉదయం 11 గంటలకు ధర్నా ప్రారంభం అవుతుందని, ధర్నా ముగింపు సమయంలో రాహుల్ గాంధీ పాల్గొంటారని అని మల్లు రవి వెల్లడించారు.



## ముగిసిన డాక్టర్ నమ్రత పోలీసు కస్టడీ
### రంగంలోకి సిబిఐ దిగే అవకాశం!

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ఏ1గా ఉన్న డాక్టర్ నమ్రత 5 రోజుల కస్టడీ మంగళవారంతో ముగిసింది. గాంధీ ఆసుపత్రిలో నమ్రతకు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. కస్టడీలో భాగంగా అక్రమ సరోగసీ, శిశు విక్రయాలు, లింగ నిర్ధారణ పరీక్షలు తదితర వాటిపై లోతైన విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో ఉన్న సంబంధాలపై ఆరా తీయడంతో పాటు సహకరించిన పలువురిని ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన కళ్యాణి, ధనశ్రీ సంతోషి విచారణ సైతం నేటితో ముగియనుంది.

**సృష్టి ఓ అక్రమాల పుట్ట:** వైద్యవృత్తికే కలంకం తెచ్చిన డాక్టర్ నమ్రత స్థాపించిన యూనివర్సల్ సృష్టిఫెర్టిలిటీ సెంటర్ ఓ అక్రమాల పుట్టగా అభివర్ణించవచ్చు. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా మాతృత్వం కోసం వచ్చిన మహిళలను తన మాయమాటలతో నిండా ముంచి రూ.కోట్లకు పడగలెత్తింది. అక్రమ సరోగసీ, చైల్డ్ ట్రాఫికింగ్, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, అమాయక ప్రజలకు డబ్బులఆశచూపి నవజాత శిశువులను కొనుగోలు చేయడం జరిగేవి పొందే డాక్టర్ నమ్రత సృష్టించిన అకృత్యాలు కోకొల్లలు. రాజస్థాన్ దంపతుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన డా.నమ్రత మోసాలు తెలుగు రాష్ట్రాల్లోనే సంచలనంగా మారింది. నమ్రత సృష్టించిన మోసాలు దర్యాప్తు చేసిన పోలీసులకే చెమటలు తెప్పించినట్లు సమాచారం. డబ్బు కోసం వైద్య వృత్తిని అభాసుపాలు చేసిందని విచారణ వ్యక్తం చేశారు. డాక్టర్ నమ్రత సృష్టించిన మోసాలపై సీబీఐ రంగంలోకి దిగనున్నట్లు సమాచారం.

## ఐటిఆర్అప్‌లోడ్ అయ్యాక 30రోజుల్లోపు వెరిఫై
### కాకుంటే ఇక చెల్లనివే: ఐటిరంగ నిపుణుల హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** మీరు ఆదాయపు పన్ను ఆన్‌లైన్‌లో రిటర్న్లు అప్‌లోడ్ చేసిన తర్వాత 30 రోజుల్లోగా వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సి ఉంటుందని, లేదంటే ఆదాయపు పన్నుశాఖ మీరు దాఖలు చేసిన ఆ రిటర్న్ ను చెల్లనివిగా పరిగణిస్తుందని నిపుణులు




హెచ్చరిస్తున్నారు. కేవలం ఈఫైలింగ్ వెబ్‌సైట్‌లో వివరాలు సమర్పించినంత మాత్రాన ప్రక్రియ ముగిసినట్లు కాదని నిపుణులు చెబుతున్నారు. 2025-26అసెస్‌మెంట్ ఇయర్‌కుసంబంధించి ఐటీఆర్‌ఫైల్ చేసేందుకు పొడిగించిన గడువు సెప్టెంబర్15తో ముగియనుంది.ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తిచేశారు.అయితే ఫైలింగ్‌తర్వాత అత్యంతకీలకమైన వెరిఫికేషన్ దశను నిర్లక్ష్యంచేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు.



## అది ప్రజల మద్దతులేని పాదయాత్ర
### 20 నెలల్లో కాంగ్రెస్ సాధించినదేముందో
### చెప్పాలి: బిజెపి ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా

**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ చేస్తున్న పాదయాత్ర ప్రజల మద్దతుతో ఏమీ సంబంధంలేని యాత్రగా మారిందని బిజెపి ఎమ్మెల్యే, విప్ ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ప్రజల సమస్యలపై పాదయాత్రలు చేస్తుంటారు. కానీ కాంగ్రెస్ ఇప్పుడు 20 నెలల పాలనలో సాధించిందేంటో ప్రజలకు చెప్పే ప్రయత్నంలో పాదయాత్ర చేస్తున్నట్టు నటిస్తున్నారు. కాంగ్రెస్ పాలించిన 20 నెలల్లో ప్రజలకు ఏం చేయలేదు.అందుకే మీ పాదయాత్రను ప్రజలు నమ్మడం లేదన్నారు. టిపిసిసి అధ్యక్షుడే రథంపై నిలబడి ఫలానా నియోజకవర్గాల్లో పైసలు ఇచ్చాం అని చెప్పిన విషయం ప్రజలకు వినపడింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, ఐదు డిక్లరేషన్లు, మోసపూరిత హామీలకు ప్రజలు బలైపోయారన్నారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో మరోసారి ప్రజలను మోసగించాలని చూస్తున్నారన్నారు.

## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా
## నిలిచిన వ్యక్తి గద్దర్: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** తెలంగాణ ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని(ఆగస్టు 6) పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తిగద్దర్ అని, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని ముఖ్యమంత్రి అన్నారు. పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారని, పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని చెప్పారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవలకు గుర్తింపుగా జూన్ 14వ తేదీన గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించడం జరిగిందన్నారు. గద్దర్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, వారి ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.


## తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా, లక్ష్యంగా
## బతికిన జయశంకర్ సార్: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** ప్రత్యేకరాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా జీవిత పర్యంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి (ఆగష్టు6) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన నిర్విరామ కృషిని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా, లక్ష్యంగా బతికారని, కోట్లాది సకల జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏవిధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సార్ దేనని ముఖ్యమంత్రి కొనియాడారు.

## తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, నిర్దిష పరిస్థితులకు నిర్దిష్ట కార్యాచరణ అనే సైద్ధాంతిక నిబ ద్ధతతో రాష్ట్ర సాధనోద్యమ భావజాల వ్యాప్తి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి (ఆగస్టు6) సందర్భంగా బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కేసీఆర్ స్మరించుకున్నారు. రాష్ట్రసాధనకోసం అనుసరించాల్సి న వ్యూహాలను ఎత్తుగడలను అమలు చేసే దిశగా, తాను ప్రారంభించిన మలి దశ ఉద్యమ పోరాటంలో ప్రొఫెసర్ జయశంకర్ గారుఅందించిన స్ఫూర్తి మరువలేనిది అన్నారు.

### బిసి రిజర్వేషన్ల చట్టం అమలు కోసమే
# ఢిల్లీలో కాంగ్రెస్ అఖిలపక్ష ఉద్యమం
### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** సామాజిక న్యాయం అనేది చర్చలతోనే పరిపూర్ణమవుతుంది. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తరచూ వెనుకబడిన వర్గాల ప్రస్తావన వినిపించినా, వారు ఎదుర్కొంటున్న అసమానతలు పరిష్కార దశలోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకోవడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేసే దిశగా ముందడుగు వేయడం గొప్ప నిర్ణయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీలకు 42 రిజర్వేషన్ల అమలు ఉద్యమం కేంద్రంపై చేస్తున్నది. వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో అగ్రస్థానాల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్న నిబద్ధతకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు స్థానిక సంస్థలు,విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మా నాయకుడు రాహుల్ గాంధీ సారథ్యంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి,పిసిసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితోపనిచేస్తున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ మొదలు,కులగణనసర్వే, కేబినెట్ ఆమోదం,42 శాతం రిజర్వేషన్ల పెంపుతూ శాసనసభలో చేసినచట్టం..రాష్ట్ర గవర్నర్ నుండి రాష్ట్రపతికి బిల్లు పంపే వరకు ఎక్కడా న్యాయపరమైన చిక్కులు లేకుండా అటు కాంగ్రెస్ పార్టీగా,ఇటు బాధ్యత గల ప్రభుత్వంగా మేము సమన్వయంతో పనిచేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు రాజకీయ , విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టం రాష్ట్రపతి వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండడంతో తాము ప్రత్యేక కార్యాచరణతో ముందుకు కదులుతున్నామన్నారు. మూడు రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం పార్లమెంట్‌లో తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసే అంశంపై వాయిదా తీర్మానం అందించామన్నారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని భారీ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,పిసిసీ చీఫ్, మంత్రులు, తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆల్ఇండియాలో పార్టీనేతలు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఇండియా కూటమి పార్టీల ఎంపీలు ధర్నా కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని చెప్పారు. 7న రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న,తెలంగాణ రాష్ట్ర శాసనసభలో చట్టంగా చేసిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపును ఆమోదించాలని రాష్ట్రపతికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు.

## బిజినెస్,టూరిస్టు వీసాదార్లకు ఇకపై 15వేల డాలర్ల పూచీకత్తు
### కొత్త ఆంక్షలు అమలు చేస్తున్న అమెరికా విదేశాంగశాఖ




**వాషింగ్టన్, ఆగస్టు 5:** వలసదారులపై కఠిన ఆంక్షలు అమలుచేస్తోన్న అమెరికా తాజాగా వీసా అభ్యర్థుల నెత్తిన పిడుగు వేస్తోంది. బిజినెస్, టూరిస్ట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు పూచీకత్తు కింద 15వేల డాలర్ల వరకు బాండ్ చెల్లించాలని అమెరికా విదేశాంగశాఖ ప్రతిపాదించింది. ఈమేరకు ఫెడరల్ రిజిస్ట్రీలో మంగళవారం నోటీసులు జారీ చేయనుంది. 12 నెలల పైలట్ ప్రోగ్రామ్ కింద ఈ కొత్త నిబంధన తీసుకురానున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. బీ1 బిజినెస్, బీ2 టూరిస్ట్ వీసాలపై ఈ నిబంధన తీసుకురానున్నట్లు తెలిపింది. ఫెడరల్ రిజిస్ట్రీలో అధికారి నోటీసు పెట్టిన 15 రోజుల్లోపు ఈ పైలట్ ప్రోగ్రామ్ అమల్లోకి వస్తుందని పేర్కొంది. దీని ప్రకారం బిజినెస్, టూరిస్ట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు అమెరికా ప్రవేశం పొందాలంటే కనీసం 5వేలు, 10వేలు, లేదా 15వేల సెక్యూరిటీ బాండ్లను సమర్పించాల్సి ఉంటుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఒకవేళ సదరు వీసాదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుని, గడువు పూర్తయిన తర్వాత దేశం వీడితే ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అలాకాకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించినా, వీసా గడువు ముగిశాక కూడా అగ్రరాజ్యంలోనే ఉన్నా ఎలాంటి రీఫండ్ చేయరు. అయితే, ఈ బాండ్ నిబంధన అన్ని దేశాల ప్రజలకు ఉండదని వివరించింది. షూరిటీ వర్తించే దేశాల జాబితాను అమెరికా విదేశాంగ శాఖ త్వరలోనే ప్రకటించనుంది. 90 రోజుల బిజినెస్, పర్యాటక ప్రయాణాల కోసం తీసుకొచ్చిన వీసా వేవర్ ప్రోగ్రామ్‌లో ఉన్న దేశాలకు ఈ బాండ్ వర్తించబోదని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 42 దేశాలు ఉండగా, అందులో మెజార్టీ ఐరోపా దేశాలు కాగా ఆసియా, మధ్యప్రాచ్యం నుంచి కొన్ని దేశాలున్నాయి. అంతేకాకుండా వీసా దరఖాస్తుదారు ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కూడా ఒక్కోసారి బాండ్ల నుంచి మినహాయింపు కల్పించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా, వీసా గడువు తీరినా కొంతమంది దేశం విడిచి వెళ్లట్లేదని, వారి వల్ల దేశ భద్రతకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ మార్పులు తీసుకొస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం అంటుంది. గతంలో ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఈ తరహా పైలట్ ప్రాజెక్టును తీసుకొచ్చారు. 2020 నవంబరులో వీసాలకు బాండ్ల నిబంధనను ప్రవేశపెట్టారు. అయితే, కొవిడ్ మహమ్మారి కారణంగా అప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు నిలిచిపోవడంతో ఈ నిబంధన పూర్తిస్థాయిలో అమలు కాలేదు.

# బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి
### 7న గోవాలో జరిగే ఓబిసి జాతీయ మహాసభకు బస్సుల్లో బయలుదేరిన బిసి నాయకులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** దేశంలోని బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బిసి రిజర్వేషన్లపై రెండు రోజులు ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలని నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 7న గోవా రాష్ట్రంలో జరిగే జాతీయ ఓబిసి మహాసభ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి మంగళవారం బయలుదేరిన బిసి సంఘాల నాయకులున్న బస్సులను కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు బి మనిమంజరి జండా ఊపి ప్రారంభించారు. దేశంలో మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలని, విద్యాఉద్యోగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఎన్నో సంవత్సరాలుగా బిసి సంఘాలు పోరాటం చేస్తున్నాయని గుర్తు చేశారు. కానీ దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు గుత్తాధిపత్యం చేపట్టి బిసి సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ వారిని ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారు తప్ప.వారికి రాజ్యాధికారంలో వాటా కల్పించాలని ఏ కోశాను ఏరాజకీయ పార్టీ భావించడంలేదన్నారు. ఈ నెల 7న గోవాలో జరిగే జాతీయ ఓబిసి మహా సభలో దేశవ్యాప్తంగా బిసిల సమస్యలపై విస్తృ తంగా చర్చించి దేశవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని విస్తరించే విధంగా పోరాటం చేయడానికి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి 28రాష్ట్రాలకు సంబంధించిన ఓబిసినేతలు పాల్గొంటారని తెలిపారు. స్వాతం త్రం వచ్చి 75సంవత్స రాలు గడిచిన బడుగు వర్గాల హక్కుల కోసం అడుక్కోవడం ఇక చాలని ఇకనుంచి బిసిలు ప్రత్యక్షంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

# ప్రధాని మోడీకి ఎన్డీయే ఎంపిల సన్మానం
### ఆపరేషన్ సిందూర్, మహదేవ్‌ల విజయవంతంపై హర్షం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఆపరేషన్‌సిందూర్, ఆపరేషన్ మహదేవ్‌లను విజయవంతంచేసిందుకుగానున ఎన్డీయే పార్లమెంటు సభ్యులు మంగళవారం ప్రధానిమోడీని సత్కరించారు. ఈకార్యక్రమంలో బిజెపి అగ్రనాయకులు జెపినడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా తదితరులు పాల్గొన్నారు. హర్‌హర్ మహదేవ్ అంటూ నినాదాలుచేస్తూ ఎంపిలు ప్రధానిని ఆహ్వానించారు. పాక్‌లోని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత్‌చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైనందుకుగాను మోడీని ఎన్డీయే నేతలు సత్కరించారు. అలాగే ఆయన నాయకత్వాన్ని కూడా కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక తీర్మానంచేసారు. ప్రధానిమోడీ అచంచలమైన సంకల్పం, దార్శనికత, రాజనీతిజ్ఞత, దృఢసంకల్పం దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయని ఎన్డీయే ఎంపిలు తీర్మానంలో పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌సమయంలో భారత సాయుధ దళాల ధైర్యం అచంచలమైన నిబద్ధతకు కూడా వారు ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద శిక్షణా శిబిరాలే లక్ష్యంగాచేసుకుని ఖచ్చితతత్వంతో దాడులు చేసిందన్నారు. భారత సైనికులు దేశరక్షణలో అంకితభావం చూపించారన్నారు. పహల్గాంవ్ ఉగ్రదాడిలోప్రాణాలు కోల్పోయిన 26 మందికి ఎన్డీయే ఎంపిలు తమ సంతాప తీర్మానం కూడా చేసారు. పహల్గాంవ్ ఉగ్రవాద దాడి అందరినీ కలిచివేసిందని, ఆపరేషన్ సింధూర్ తర్వాత ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంచేసినందుకు మోడీకి కృతజ్ఞతలు చెప్పారు. అన్ని పార్టీల్లోని 59 మంది పార్లమెంటుసభ్యులు మొత్తం 32 దేశాల్లోపర్యటించి ఆపరేషన్ సిందూర్‌ను వివరించడం ఒక పెద్ద విజయమనే ఎంపిలుపేర్కొన్నారు.

## వివేకా హత్యపై విచారణ పూర్తి: సుప్రీం కోర్టుకు వెల్లడించిన సిబిఐ
### ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన విచారణ పూర్తయ్యిందని సిబిఐ మంగళవారం సుప్రీం కోర్టుకు వెల్లడించింది. ఒకవేళ సుప్రీం కోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణను కొనసాగిస్తామని సిబిఐ తరపు న్యాయవాది సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్‌ను రద్దు చేసేందుకు సంబం ధించి వివేకా తనయ సునీతతో పాటు సిబిఐ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. దివంగత సిఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్యపై సిబిఐ విచారణ ముగిసింది. గత నెల 21వ తేదీన సుప్రీం కోర్టు సిబిఐని మూడు అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించడం తెలిసిందే. దీని తరువాతే కడప ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై వి చారణ చేబడతామని పేర్కొనడం విదితమే. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం మేరకు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ వివరాలను మంగళవారం సిబిఐ సుప్రీం కోర్టుకు తెలిపింది. వివేకా హత్య కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సిబిఐ భావిస్తుందో...? లేదో...? సుప్రీం ధర్మాసనం కోరింది. దీంతో పాటు ఎపి ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో వై.ఎస్ వివేకా తనయ సునీత, ఆమె భర్త నర్రెడ్డిపై దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపైనా అభిప్రాయం చెప్పాలని సిబిఐని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో వివేకా హత్య కేసు ట్రయల్, తదుపరి విచారణ ఏకకాలంలో కొనసాగించే అవకాశం వుందా? అన్న విషయంపైనా సిబిఐ అభిప్రాయం చెప్పాలని సుప్రీం కోర్టు కోరింది. వివేకా హత్య కేసులో అన్ని కోణాల్లో విచారణ ముగిసిందని సిబిఐ తరపు న్యాయవాది తెలిపారు.జస్టిస్ ఎంఎం సుందరేషన్ నేతృత్వంలోని ధర్మా సనానికి ఈ మేరకు సిబిఐ స్టేటస్ వివరాలను అందజేసింది. మరోవైపు ఇదే కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు మరికొందరు నిందితులకు గతంలో తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా దీనిని సిబిఐతో పాటు వివేకా తనయ సునీత సుప్రీం కోర్టులో సవాల్ చేయగా దానిపైనా మంగళవారంసుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. బెయిల్‌పై వున్న వారు సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత తరపు న్యాయవాది సిద్దార్థ లూథ్రా సుప్రీం కోర్టుకు తెలిపారు. వివేకా హత్య కేసు దర్యాప్తు అధికారి రాంసింగ్‌తో పాటు సునీత దంపతులపై నమోదైన కేసులో ఎపి సర్కారు దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకే రాంసింగ్‌తోపాటు సునీత దంపతులపై అప్పట్లో కేసు నమోదయ్యిందని క్లోజర్ రిపోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని లూథ్రా తెలిపారు. ఈకేసులో అవినాష్ రెడ్డితో పాటు ఇతర నిందితుల బెయిల్ రద్దుపై వెంటనే నిర్ణయంతీసుకోవాలని లూథ్రాకోరగా దీనిపై తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.

## సరిహద్దుల్లో మళ్లీ కాల్పులకు తెగబడిన పాక్
### దీటుగా తిప్పికొట్టిన భారత్ సైన్యం

జమ్ము,ఆగస్టు 5: జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్‌సెక్టార్‌లో పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత చడీచప్పుడులేని పాక్ మళ్లీ సరిహద్దుల్లో చొరబాట్లను ప్రోత్సహిస్తున్నట్లు ఈ చర్యలు స్పష్టంచేస్తున్నాయి. పాక్ ఆర్మీ మంగళవారం కాల్పులకు తెగబడటంతో భారత్ ఆర్మీ ధీటుగా స్పందించింది. ఇరుదేశాల సైనికులమధ్య 15 నిమిషాలపాటు కాల్పులు కొనసాగినట్లు సైన్యం ధృవీకరించింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం మాత్రం జరగలేదు.

## సినీ కార్మికుల జీతాలు పెరగాలి:మంత్రి కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** సినీ కార్మికులకు ఆందోళనపై రాష్ట్ర సనిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. సినీకార్మికులకు జీతాలు పెంచాల్సి న అవసరం ఉందని, రోజు రోజుకూ పెరిగిపోతున్న జీవన వ్యయాలతో హైదరాబాద్‌లో బతకాలంటే కార్మికుల జీతాలు పెంచక తప్పదన్నారు. ఈ అంశాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజ్‌కు అప్పగించామని, వీటిపై ఆయన చర్చిస్తున్నారని తెలిపారు. కాగా, వివాదాన్ని పరిష్కరించేందుకు మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. వారితో చర్చలకు ఆయన సమాయత్తమయ్యారు.

## గుర్మీత్ రాం రహీంకు 40 రోజుల పెరోల్
# రోహ్‌తక్ జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** హర్యానా పంచకుల సమీపంలో గల సిర్సాలో గల డేరా సచ్చా సౌదా ఆశ్రమం అధిపతి వివాదాస్పద బాబా గుర్మీత్ రాం రహీంకు మరోసారి పెరోల్ మంజూరయింది. తన ఆశ్రమంలో మహిళా శిష్యులపై అత్యాచారం, హత్యల వంటి నేరాలకు పాల్పడి 20ఏళ్ల జైలు శిక్షపడ్డ ఈ బాబా ఇప్పుడు హర్యానాలోని రోహ్‌తక్ జైల్లో ఖైదీగా ఉన్నాడు. 2017 ఆగస్టు నెలలో ఇతనికి పంచకుల కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. తన ఆశ్రమంలో మహిళా శిష్యులపై అత్యాచారం, హత్యలతో పాటు జర్నలిస్టులను కూడా హత్యచేసి శవాలను ఆశ్రమంలోనే పాతిపెట్టినట్లు పోలీసులు ఇతనిపై అభియోగాలు మోపారు. ఈ నేరాలు రుజువవడంతో ఇతనికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించగాజైలు శిక్ష పడిన తరువాత హర్యానా ప్రభుత్వం ఇతన్ని రోహ్‌తక్ జైలుకు తరలించింది. కాగా 2017 నుంచి ఇప్పటి వరకు 14 సార్లు పెరోల్ మంజూరవడం గమనార్హం. కాగా తాజాగా మరోసారి 40 రోజుల పెరోల్ మంజూరయ్యింది. రోహ్‌తక్ జైలు నుంచి మంగళవారం ఉదయం రాం రహీం విడుదలయ్యాడు.

## అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఓ సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మారుస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పులతడకగా పేర్కొంది. సివిల్ కేసు పరిష్కారానికి సమయం పడుతుందనే కారణంతో సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు సమర్థించడం పట్ల అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యలు న్యాయస్థానం తనకున్న హక్కులను దుర్వినియోగం చేయడమే అని అభిప్రాయపడింది. సివిల్ సమస్యలను పరిష్కరించడానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమనే చట్టపరమైన నిబంధనలను ఇరు కేసుల మధ్య ఉన్న వ్యత్యాసాలను హైకోర్టుఅర్థం చేసుకుంటుందని తాము ఆశించినట్లు ధర్మాసనం పేర్కొంది. ఇకపై న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో ఇలాంటి అతిక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. సంబంధిత న్యాయమూర్తి ఆ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించింది. అంతేకాకుండా ఆ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పదవీ విరమణ చేసే వరకు ఆయనకు ఎటువంటి క్రిమినల్ కేసులూ కేటాయించకుండా చూసుకోవాలని అలహాబాద్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిని ఆదేశించింది.కాగా, ఇప్పటికే పలు కోర్టులు, పోలీసులు ఆస్తివివాదాలకు సంబంధించిన సివిల్‌కేసులను క్రిమినల్ కేసులుగా మార్చడాన్ని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు తప్పుబట్టిన విషయం తెలిసిందే.



## బెంగాల్ విపక్షనేత కాన్వాయ్‌పై దాడి

**సిలిగురి,ఆగస్టు 5:** పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇవాళ దాడి జరిగింది. బీజేపీ నేత సువేందు ఇవాళ కూచ్ బిహార్‌లో పర్యటిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వాహనంపై అటాక్ చేశారు. బుల్లెట్‌ప్రూఫ్‌కు వెహికల్‌కు చెందిన అద్దాలను ఆగంతకులు ధ్వంసం చేశారు. అయితే బుల్లెట్‌ప్రూఫ్ కారులో ఉండడం వల్ల ప్రాణాలతో బయటపడినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలా జరుగుతుందని తనకు తెలుసు అని బీజేపీ నేత ఆరోపించారు. కూచ్‌బహార్‌లో జరుగుతున్న నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో అటాక్ జరిగినట్లు బావిస్తున్నారు. ఇటీవల బెంగాల్‌లో మహిళలపై హింస అధికమైంది. నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన ర్యాలీ తీశారు. తాజాగా బంకురా జిల్లాలో ఆ ర్యాలీ నిర్వహించారు.

## ఐఎన్‌టియుసి ఘన విజయం

**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** తెలంగాణ ఫుడ్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికలో ఐఎన్‌టియుసి ఘన విజయం సాధించింది. యూనియన్ ఎన్నికల నుండి హెచ్ఎంఎస్ యూనియన్‌ని రిటర్నింగ్ అధికారి డిస్ క్వాలిఫై చేశారు. తెలంగాణ ఫుడ్స్ యూనియన్ ఎంప్లాయిస్ ఎన్నికలో ఐఎన్‌టియుసి ప్రెసిడెంట్ అభ్యర్థిగా జానక్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ఫుడ్స్ యూనియన్ ప్రెసిడెంట్ గా ఐఎన్‌టియుసి అభ్యర్థి తెలంగాణ ఫుడ్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా వెబ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జానక్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దస్తగిరి ఎన్నికయ్యారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ
ఫారము-VII
(ప్రాథమిక డిక్లరేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) రూల్ (25)(1)ను అనుసరించి)
నెం. D/432/2022 తేది: 01.08.2025

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం మరియు గ్రామములోని విస్తీర్ణం ఎ.1.01 గుం.ల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా సూర్యాంతరం రోడ్ నిర్మాణం కలెక్టర్ ఆఫీసు మరియు డిస్ట్రిక్ట్ పోలీసు ఆఫీసు కాంప్లెక్స్, సిరిసిల్ల కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని జిల్లా కలెక్టర్, రాజన్న సిరిసిల్లగారు భావించినందున, భూసేకరణ, పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 క్రమము భూసేకరణ చేపట్టనైనది.
కావున, ఈ దిగువ చూపిన షెడ్యూల్ నందు తెలిపిన ఎ.1.01 గుంటల భూమికి కొంచం ఎక్కువగా గాని, తక్కువగాగాని ఇట్టి భూసేకరణ చట్టంలోని సెక్షను 19(1) ప్రకారము డిక్లరేషన్ జారీ చేయనైనది. ఇట్టి భూమి మరియు భూయజమానుల వివరములు ఈ క్రింద తెలిపిన విధముగా ప్రకటించనైనది.

షెడ్యూల్
గ్రామము పేరు: సిరిసిల్ల మండలము : సిరిసిల్ల

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | (భూమి రకం (ఖుష్కి /తరి) భూమి విధం (పట్టా/ ప్రభుత్వ/ ఇనాం) | భూసేకరణచేయు విస్తీర్ణం | పట్టాదారు /అనుభవదారు పేరు మరియు తండ్రి లేదా తల్లిపేరు | ఇతర వివరములు (బావులు, నిర్మాణములు, చెట్లు వగైరా) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | 98 | పట్టా భూమి/ ఖుష్కి | ఎ.0.19 ½గుం. | ఆడెల బాలయ్య తండ్రి : నర్సయ్య | మామిడి చెట్లు-15 జామ చెట్లు-01 సపోట చెట్లు-01 |
| | | | ఎ.0.10 ½గుం. | దుమాల శ్రీకాంత్ తండ్రి : సత్తయ్య | మామిడి చెట్లు-01 |
| | | | ఎ.0.00 ½గుం. | ఎర్రం విజయ రామరాజు తండ్రి: వెంకట్రాజం | — |
| 2 | 101 | పట్టా భూమి/ ఖుష్కి | ఎ.0.10 ½గుం. | ఎర్రం విజయ రామరాజు తండ్రి: వెంకట్రాజం | పామాయిల్ ప్లాంట్స్ -13 డ్రిప్ |
| మొత్తం విస్తీర్ణం : | | | ఎ.1.01గుం. | | |

DIPR RO.NO: 442/LA/PP/Advt/Pub/2025-26



తెలంగాణ ప్రభుత్వం
కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ పిలుపు ప్రకటన
DIPR.NO: 6052-PP/CL/ADVT/1/2025-26 Dt: 05.08.2025

# చిరంజీవి బర్త్‌డే 22న 'త్రిబాణధారి బార్బరిక్' విడుదల



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్ట్ 22న మా 'త్రిబాణధారి బార్బరిక్ ' చిత్రాన్ని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది.. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో ప్రముఖ నటుడు సత్య రాజ్‌స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్ణ. ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంలో వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రధాన పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో..

సత్య రాజ్ మాట్లాడుతూ,త్రిబాణధారి బార్బరిక్ సినిమాలో పని చేసినందుకు ఆనందంగా ఉంది. మేమంతా కూడా మాదే మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. కానీ ఇందులో కథే మెయిన్ హీరో. డైరెక్టర్ మోహన్, నిర్మాత విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేష్ వీళ్లే అసలైన బాణాలు. ఈశ్వర్ గారు నాతో డ్యాన్స్ చేయించారు. రమేష్ మా అందరినీ అద్భుతంగా చూపించారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు ఇతర సీన్లను కూడా అడిగి చూశాను. కెమెరా యాంగిల్‌తోనే సస్పెన్స్‌ను క్రియేట్ చేశారు. అలా దర్శకుడు, కెమెరామెన్ కలిసి అద్భుతం చేశారు. 70 ఏళ్లు దాటినా కూడా నేను కొత్త కొత్త పాత్రల్ని చేయాలని అనుకుంటున్నాను. రెగ్యులర్ పాత్రల్ని కాకుండా 'బార్బరిక్ణ లాంటి కొత్త పాత్రల్ని మరిన్ని చేయాలని అనుకుంటున్నాను. నా డియర్ ఫ్రెండ్ మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. చిరంజీవి కంప్లీట్ యాక్టర్. ఆయన గొప్ప నటుడు, డ్యాన్సర్, అద్భుతమైన వ్యక్తి. మా మూవీ ఆయన పుట్టిన రోజున రిలీజ్ అవుతుండటం ఆనందంగా ఉంది అని అన్నారు. ఉదయ భాను మాట్లాడుతూ నేనేమీ సినిమాలకు దూరంగా ఉండలేదు. నాకు నచ్చిన పాత్రలు వస్తేనే నటిస్తున్నాను. ఆర్టిస్టులకు ఉండే ఆకలిని తీర్చే పాత్రలో ప్రస్తుతం నటించాను. 'బార్బరిక్ణ చిత్రంలో ఓ ఛాలెంజింగ్ పాత్రను మోహన్ గారు నాకు ఇచ్చారు. ప్రతీ పాత్రను నేను ప్రాణం పెట్టి పోషిస్తాను. నాకు రాజేష్ మంచి స్నేహితుడు. ఆయన ఏ ప్రాజెక్ట్ చేస్తున్నా కూడా నన్ను కన్విన్స్ చేస్తుంటారు. మోహన్ నెరేట్ చేసినప్పుడు ఆ కథ, ప్రతీ సీన్ నా కంటికి కనిపించింది. మన భాషలో ఇలాంటి చిత్రాలెందుకు రావు? అని అంతా అంటుంటారు. అలాంటి వారిని ఆశ్చర్యపరిచేలా మా చిత్రం ఉంటుంది. విజయ్ పాల్ గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఇలాంటి నిర్మాతలకు సక్సెస్ వస్తే ఇంకెంతో మందిని పైకి తీసుకు వస్తారు. వశిష్ట చాలా మంచి వ్యక్తి. క్రాంతి ఎనర్జీ నెక్ట్స్ లెవెల్లో ఉంటుంది. సాంచీ, మేఘన అందరం కలిసి ఎంతో సరదాగా షూటింగ్ చేశాం. రమేష్ మా అందరినీ చక్కగా చూపించారు. సత్య రాజ్‌తో పని చేయడం మా అదృష్టం. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. ఆయన్నుంచి మేమంతా ఎంతో నేర్చుకున్నాం. ఈ చిత్రం అందరికీ కన్నుల పండువగా ఉంటుంది. అందరూ చూసి ఆదరించండి అని అన్నారు.

వశిష్ట ఎన్ సింహా మాట్లాడుతూ,'త్రిబాణధారి బార్బరిక్ణ నాకెంతో ప్రత్యేకం. మోహన్ చెప్పిన కథ విన్నప్పుడే టైటిల్ చాలా కొత్తగా అనిపించింది. కథ, స్క్రీన్ ప్లే చాలా బాగా అనిపించింది. ఇది చిన్న సినిమా అని మోహన్ నాకు ఓ కథ చెప్పారు. కానీ సెట్ మీదకు వచ్చిన తరువాత ఇది చిన్న సినిమా కాదని నాకు అర్థమైంది. ఇంత మంచి చిత్రాన్ని ఇచ్చిన మోహన్‌కి థాంక్స్. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. నన్ను ఈ మూవీలో చాలా కొత్తగా చూపించారు. ఇందులో ప్రతీ పాత్ర అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. విజయ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. సత్య రాజ్ గారితో పని చేయడం ఆనందంగా ఉంది. ఉదయ భాను ఆరా నెక్ట్స్ లెవెల్. క్రాంతి, సాంచీ, మేఘన, కార్తికేయ అందరూ అద్భుతంగా నటించారు. ఈశ్వర్ కొరియోగ్రఫీ చాలాకొత్తగా ఉంటుంది. కెమెరామెన్ రమేష్ పని రాక్షసులు. నేను చిరంజీవి అభిమానిని. ఆయన బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు..ప్రొడ్యూసర్ విజయ్ పాల్ రెడ్డి అడిదెల మాట్లాడుతూ మా 'బార్బరిక్ణ చిత్రం ఆగస్ట్ 22న రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి

యమలీల, ఘటోత్కచుడులా తరహాలో ఆడియన్స్‌ను థ్రిల్ ఫీలయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్: దర్శకుడు ఎస్‌జే శివ




'బకాసుర రెస్టారెంట్ణ అనేది ఇదొకకొత్తజానర్‌తోపాటు కమర్షియల్ ఎక్స్‌పర్‌మెంట్. ఇంతకు ముందు వచ్చిన యమలీల,ఘటోత్కచుడులాఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలయ్యే కథ ఇది. ఇలాంటి కొత్త కథలనే జనాలు ఆదరిస్తారనే నమ్మకం వుంది. మన జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయి అనేది కథ. సినిమా మొత్తం కంప్లీట్ ప్యాకేజీలా ఉంటుంది. హారర్ థ్రిల్లర్,కామెడీ, ఎమోషన్ అన్నీ ఉంటాయిఖీ అంటున్నారు దర్శకుడు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్ణ, ఈచిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమోతుంది. ఈ సందర్బంగా దర్శకుడు ఎస్‌జే శివతో జరిపిన ఇంటర్వ్యూ ఇది.

## ఆడియన్స్ థ్రిల్‌అయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్ణ

**బకాసుర రెస్టారెంట్ ఎలాంటి కథాంశం ?**

బకాసుర ఎంటర్‌టైన్‌మెంట్ అనేది ఒక హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకు తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఇదొక కొత్త జోనర్. మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిబోతు కథ. దానిని నుంచి వచ్చే కామెడీ కాబట్టి హంగర్ కామెడీ అంటున్నాం. ఫైనల్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే మా లక్ష్యం.

**ఈ సినిమాలో హీరోగా కమెడియన్ ప్రవీణ్‌ను తీసుకోవడానికి కారణం ఏమిటి?**

మొదట వేరే హీరోలతో డిస్కస్ చేశాం. కానీ అందరూ సోలో హీరో కథలైతే చేస్తాం అన్నారు. కానీ ఈ కథ అలాంటిది కాదు. ఆ సమయంలోనే ప్రవీణ్ కూడా హీరోగా ఇంట్రడ్యూస్ అయ్యే ప్లానింగ్‌లో వున్నాడని తెలిసి ఆయన్నీ కలిశాం.ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. ఇక ఈ కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో.. తప్పకుండా మనం చేద్దా అన్నాడు.

**ఇది బకాసుర రెస్టారెంట్‌లో జరిగే కథనా?** రెస్టారెంట్ పెట్టడమే కథ. రెస్టారెంట్ పెట్టాలని కలలు కనే ఓ యువకుడి కథ ఇది. ఈ అంశానికి హారర్, థ్రిల్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ అంశాలు జోడించాం. ఇదొక క్లీన్ కామెడీ.. అందరూ ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రమిది. **ఇదొక కొత్త జానర్.. ఎక్స్‌పెరిమెంట్ అనుకోవచ్చా?**

నిజమే ఇదొక కొత్తజానర్‌తో పాటు కమర్షియల్ ఎక్స్‌పర్‌మెంట్ అనుకోవచ్చు. **మీ తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?**

సినిమా తీయడం చాలా టఫ్.. ఇక్కడ సినిమా బిజినెస్‌లో ఎవరైనా కథ ఏమిటి? ఎలా ఉండబోతుంది? అని అడగటం లేదు. ప్యాడింగ్ ఎవరు? ఎంత పెట్టారు? ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు అని అడుగుతున్నారు. సినిమా అనేది ఎంటర్‌టైన్‌మెంట్ కానీ దాని గురించి తప్ప అన్నీ అడుగుతున్నారు.

**భవిష్యత్‌లో ఎలాంటి సినిమాలను తీస్తారు?** నాకు విఠలాచార్య లాంటి సినిమాలు అంటే ఇష్టం.

**మీ తదుపరి చిత్రం కూడా మీ బ్యానర్‌లోనే చేస్తారం?** మా ఎస్‌జే బ్యానర్‌లో కొత్త దర్శకులకు మాత్రమే అవకాశం. సో.. నా తదుపరి చిత్రం ఇందులో ఉండదు. ఈ బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేస్తాం. **దర్శకుడిగా మీ లక్ష్యం ఏమిటి?**


చాలా తక్కువ వర్కింగ్‌డేస్‌లో సినిమాలు చేయడం అంటే ఇష్టం.. అప్పుడూ అందరూ బాగుంటారు. మా బకాసుర రెస్లారెంట్ ఐదు కోట్ల రూపాయాలతో తీసిన 12 కోట్ల రూపాయాల అవుట్‌పుట్ కనిపిస్తుంది.

## 'ప్రేమలో రెండోసార్ణి లిరికల్ సాంగ్ రిలీజ్



బి.వేణుగోపాలస్వామి. చార్టెడ్ అకౌంటెంట్ . చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్ణి లిరికల్ వీడియో విడుదల.సాకేరామయ్య సమర్పణలో సిద్ద క్రియేషన్ బ్యానర్‌లోసత్యమార్క దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మీ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమలో రెండోసార్ణి. ఈ చిత్రానికి సంబంధించి లిరికల్ వీడియో సాంగ్ ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత తీ వేణుగోపాలస్వామి. చార్టెడ్ అకౌంటెంట్. చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్ణి లిరికల్ వీడియో విడుదల చేయడం జరిగినది. ఈ సందర్భంగా తీ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ 'ప్రేమలో రెండోసార్ణి చిత్ర టైటిల్ చాలా బాగుంది. ఈ జనరేషన్ యువతకు ఈ సినిమా ఎంతో నచ్చుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒకసారి ప్రేమకు దూరమైనప్పుడు ఏదో ఒక సందర్భంలో మరోసారి ప్రేమలో పడడం సహజం కాబట్టి తెలుగు ప్రేక్షకులకు నీ అలరిస్తుందని అన్నారు. సాంగ్స్ చాలా మెలోడీగా ట్రెండింగ్‌గా ఉన్నాయని, కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ,మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే ని అభినందించారు. ఈ సాంగ్ లోనే సినిమా ప్రతిభ,టీం యొక్క కృషి ఎంతగానో తెలుస్తుందని, టీం అందరికి అల్ ది బెస్ట్ చెబుతూ వారిని అభినందించారు. ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. హీరో రమణ సాకే గుడ్ లుకింగ్ తో యువతను ఆకర్షించేలా నటించారని ఎన్నో సినిమాల్లో అవకాశం రావాలని టాప్ హీరోల స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో, మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే మాట్లాడుతూ, ఈ సినిమాలో 7 సాంగ్స్ ఉన్నాయని, ప్రతి ఒక్కటి సందర్భానికి తగినట్లు చాలా మెలోడీగా వచ్చాయని, సినిమా మ్యూజిక్ మొత్తం ప్రేక్షకులను మంత్రం ముద్దుల్ని చేస్తుందని సినిమా చూసేటప్పుడు ఆడియన్స్ వారిని వారు మరిచిపోయి సినిమాలో లీనమైపోతారని ఆ విధంగా ఈ సినిమా ఎంతో హిట్ అవుతుందని చెప్పారు. ఈ సినిమా నేటి పెద్దలకు పిల్లలకు, యువతీ యువకులకు ,బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు. డైరెక్టర్ సత్యమార్క మాట్లాడుతూ, మా హీరో కొత్త వారు అయినా చాలా బాగా నటించారు. వనిర్మాత సాకే నీరజ లక్ష్మీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారని చెప్పారు, బి వేణుగోపాల స్వామి లిరికల్ వీడియో లాంచ్ చేసి సపోర్టు చేసినందుకు కృతజ్ఞతలు. తెలుపుకున్నారు. ఇందులో నటీ నటులు: హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, రాణి, సతీష్ సారపల్లి, చిరంజీవి, విక్టర్,సుజిత్, ప్రదీప్, బి ఎస్ మన్యం, అవ్వారు సురేష్ తదితరులు నటించారు.

## 'మాస్‌జాతర్ణ నుంచి ఓలేఓలే సాంగ్‌అదుర్స్



విజయ్ దేవరకొండ మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర్ణ చిత్రం నుంచి రెండవ గీతం 'ఓలే ఓల్లే విడుదల భీమ్స్ సిసిరోలియో శైలిలో ఉత్సాహభరిత గీతంగా 'ఓలే ఓల్లే తమ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకెళ్ళిన రవితేజ, శ్రీలీల జోడి. మాస్‌మహారాజారవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస జాతర్ణ. భాను భోగ వరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 'మాస్ జాతర్ణ కోసం అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్ణ అందరినీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'ఓలే ఓల్లేను విడుదల చేసింది చిత్ర బృందం. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతముంది. ధమాకా జోడి రవితేజశ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. 'ఓలే ఓల్లే పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు. ఇద్దరూ కలిసి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా తెరపై మెరుపులు మెరిపిస్తున్నారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచిన 'ఓలే ఓల్లే మాస్ రాజా అభిమానులకు, మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంది. థియేటర్లలో ప్రేక్షకుల చేత.. ఈలలు, చప్పట్లతో స్టెప్పులు వేయించేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతం సాగింది. ఇక ప్రతిభావంతులైన రోహిణి సోరట్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. భాస్కర్ యాదవ్ దాసరి అందించిన సాహిత్యం ఉల్లాసంగా, ఆకర్షణీయంగా ఉంది. పాట యొక్క మూడ్‌కి సరిగ్గా సరిపోయే మాస్ ఫ్లేవర్‌తో ఆయన సాహిత్యం నిండి ఉంది. సంగీతం, సాహిత్యం, గాత్రం అన్నీ చక్కగా కుదిరి.. 'ఓలే ఓలే'ను అదిరిపోయే మాస్ గీతంగా మలిచాయి. దర్శకుడు భాను బోగవరపు.. రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. పాటల విషయంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మాస్ రాజా వింటేజ్ వైబ్స్, కమర్షియల్ హంగులతో ఈ చిత్రంతో థియేటర్లలో మాస్ పండుగను తీసుకురాబోతున్నారు. వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్యతో కలిసి 'మాస్ జాతర్ణ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'మాస్‌జాతర్ణ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఫుల్ మీల్స్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: రవితేజ, శ్రీలీల,దర్శకత్వం: భాను బోగవరపు. నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో,కూర్పు: నవీన్ నూలి,ఛాయాగ్రహణం: విధు అయ్యన్న మాటలు: నందు సవిరిగాన కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల,ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె. వర్మసమర్పణ: శ్రీకర స్టూడియోస్ నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, పీఆర్‌ఓ: లక్ష్మీవేణుగోపాల్ .

## 'చిత్రాలయమ్ణ బ్యానర్‌పై కొత్త చిత్రం ప్రారంభం



.చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా కొత్త చిత్రం ప్రారంభం..చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా గుణి మంచికంటి దర్శకత్వంలోఅతిరథ మహారథుల సమక్షములో కొత్త సినిమాను ప్రారంభమైంది. టీను ఆనంద్,ఉపేంద్ర,జార్జ్‌మరియన్,అక్షయ్, విష్ణు, కార్తికేయ,ఆస్తా,మాళవితదితరులు ప్రధాన పాత్రలో రూపొందనున్నఈచిత్ర ప్రారంభోత్సవం ఘనంగాజరిగింది. ఈచిత్రానికి కొండల్ జిన్నా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి రమేష్ ప్రసాద్ అక్కినేని, ఆది శేషగిరి రావు ఘట్టమనేని, కేఎస్ రామారావు, డైరెక్టర్ పి. మహేష్ బాబు, కేఎల్ నారాయణ, తమ్మారెడ్డి భరద్వాజ్, పరుచూరి గోపాలకృష్ణ, బి గోపాల్, కోటగిరి వెంకటేశ్వరరావు, మాధవపెద్ది సురేష్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముహూర్తపు సన్నివేశానికి రమేష్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా.. ఆది శేషగిరి రావు క్లాప్ కొట్టారు. కేఎస్ రామారావు కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. మహేష్ బాబు.పి గౌరవ దర్శకత్వం వహించారు. నేపాల్ దేశ రాజవంశానికి చెందిన సమృద్ధి ఈ చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతోంది. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరికొన్ని ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.నటీనటులు : టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, కార్తికేయ, అభినవ్, హర్ష, కిషోర్ కృష్ణ, ఆస్తా, మాళవి, సమృద్ధి, విష్ణు ఓయ్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అనీష్ కురివిల్లా, కాదంబరి కిరణ్ తదితరులు. సాంకేతిక బృందం : బ్యానర్ : చిత్రాలయం స్టూడియోస్, నిర్మాత : వేణు దోనేపూడి, సహ నిర్మాత : కొండల్ జిన్నా,దర్శకత్వం : గుణి మంచికంటి ,సంగీతం : స్టీఫెన్, ఆనంద్,ఆర్ట్ : సాహి సురేష్, ఎడిటింగ్ : విజయ్ ముక్తవరపు, కెమెరామెన్ : అజయ్ అబ్రహం, జార్జ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైశాఖ్ నాయర్‌కో డైరెక్టర్ : కిషోర్,కాస్ట్యూమ్స్ : ప్రియాంక, కొరియోగ్రఫీ : జెడి. మాస్టర్, యాక్షన్స్, నటరాజ్, పి.ఆర్.ఒ : మోహన్ తుమ్మల.

## 'ఆశికా రంగనాథ్' బర్త్ డే స్పెషల్



టాలీవుడ్ లెజెండరి హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న అవైటెడ్ విజువల్ వండర్ చిత్రమే "విశ్వంభర". యువ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన ఈ భారీ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో మెగాస్టార్ సరసన ఇద్దరు హీరోయిన్స్ త్రిషఅలాగే ఆషిక రంగనాథ్‌లు నటిస్తుండగా నేడు ఆషిక బర్త్ డే కానుకగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేయడం జరిగింది. రి ఈ సినిమాలో ఆషిక లుక్ మాత్రం ఎంతో అందంగా చూసేందుకు ముచ్చటగా కనిపిస్తుందని చెప్పాలి. దీనితో అభిమానులు కూడా ఈ పోస్టర్ చూసి ఆషిక అందానికి ముగ్ధులు అవుతున్నారు.


అలాగే అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

## ఆగస్టు 15న స్ట్రీమింగ్
## జె.ఎస్‌కె జానకి వర్సస్ స్టేట్ ఆఫ్‌కేరళ



జీ5లో ఇండిపెండెన్స్ డే సందర్భంగా పవర్ ఫుల్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ్ణ ఆగస్టు 15 నుంచి స్ట్రీమింగ్.. భారత దేశంలోని అతిపెద్ద స్వదేశీ ఓటిటి ప్లాట్‌ఫారమ్ అయిన 5 2025లో మరో సూపర్‌హిట్ ప్రీమియర్‌తో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. సంక్రాంతికి వస్తున్నం, రాబిన్‌హుడ్, భైరవం వంటి వరుస తెలుగు సూపర్‌హిట్‌లను అందించిన తర్వాత జీ5 తెలుగు ఇప్పుడు మరో అద్భుతమైన సినిమాను అందించబోతోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన మాలీవుడ్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వర్సస్‌స్టేట్ ఆఫ్ కేరళ్ణ తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషలలో స్ట్రీమింగ్ కానుంది.సురేష్ గోపి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన జె.ఎస్.కె మూవీకి ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించగా.. కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రి. ఫణీంద్ర కుమార్ నిర్మించారు. ఈ చిత్రంలో గిరీష్ నారాయణన్ స్వరపరిచిన పాటలు, గిబ్రాన్ అద్భుతమైన నేపథ్య సంగీతం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. ఈ చిత్రానికి రెనదివే సినిమాటోగ్రఫీ అందించారు. ఈ ఆగస్టు 15న 'జె.ఎస్.కె జానకివర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ్ణ ప్రత్యేక డిజిటల్ ప్రీమియర్‌ను జీ5లో మాత్రమే చూడండి. ఈ స్వాతంత్ర్య దినోత్సవం, ఈ వీకెండ్‌ను ఉత్కంఠభరితమైన కోర్టు డ్రామాతో ఎంజాయ్ చేయండి. ప్రఖ్యాత న్యాయవాది డేవిడ్ అబెల్ డోనోవన్ (సురేష్ గోపి) సహాయంతో లైంగిక వేధింపుల నుండి బయటపడిన జానకి విద్యాధరన్ (అనుపమ పరమేశ్వరన్) చుట్టూ ఈ కథ తిరుగుతుంది.జీ512 భాషల్లో అత్యద్భుతమైన కంటెంట్‌ని ప్రేక్షకులకు అందించగలుగుతోంది.

## సు ఫ్రమ్ సో ఎంటర్‌టైనింగ్ ట్రైలర్



2019మైత్రి మూవీ మేకర్స్ 'సు ఫ్రమ్ సోణఎంటర్‌టైనింగ్ రైడ్ ట్రైలర్ రిలీజ్‌లేటెస్ట్ కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రం సోణ ఇప్పుడు తెలుగు ప్రేక్షకులుని ఆలరించడానికి రెడీ అయ్యింది. మంచి కంటెంట్ కి మద్దతుగా నిలిచే మైత్రీ మూవీ మేకర్స్ ఈ రూరల్ కామెడీ హారర్ సినిమాని ఆగస్ట్ 8న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. జెపీ తుమినాడ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్ రిలీజ్ అయ్యింది.

గ్రామీణ జానపద కథలు, మూఢనమ్మకాలు, హిలేరియస్ కామెడీ – ఇవన్నీ మిక్స్ అయ్యి వినోదాత్మక ప్రయాణమే సు ఫ్రం సో. కథ ఓ పల్లెటూర్లో జరుగుతున్న విచిత్ర సంఘటనల చుట్టూ తిరుగుతుంది. ఆ గ్రామానికి 'సోమేశ్వర్ణ నుంచి వచ్చిన సులోచన కారణంగా ఊరు మొత్తం గందరగోళంలో పడుతుంది.

ఆ తర్వాత నవ్వుల హంగామా మొదలవుతుంది. ఈ సినిమాలో శనీల్ గౌతమ్ ఎనర్జిటిక్ పాత్రలో అలరించారు. శాంధ్య ఆరకెరె, జెపీ తుమినాడ్, ప్రకాశ్ తుమినాడ్, రాజ్ బి శెట్టి (కోప్రొడ్యూసర్ ) పాత్రలు కూడా ఆకట్టుకున్నాయి.

'సుఫ్రం సో రెగ్యులర్ హారర్ కామెడీల్లా కాకుండా గమ్మత్తైన రైటింగ్, అలరించే పాత్రలు, మంచి హాస్యంతో ఆకట్టుకునే సినిమా. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ ఆ ఊరి అందాన్ని చూపిస్తే, సుమేధ్ కె, సందీప్ తులసిదాస్ అందించిన సంగీతం సినిమాకి మరింత జోష్ తీసుకొస్తుంది.ఈ ఆగస్ట్ 8న తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా నవ్వులు ప్రయాణం కాబోతోంది.తారాగణం: షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్.సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం : జెపి తుమినాడ్,నిర్మాతలు: శశిధర్ శెట్టి, బరోడా, రవి రాయ్ కలస, రాజ్ బి శెట్టితెలుగు రిలీజ్: మైత్రి మూవీ మేకర్స్,డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ :ఎస్.చంద్రశేఖరన్‌సంగీతం : సుమేద్ కె బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: సందీప్ తులసీదాస్‌పిఆర్‌ఓ: వంశీ శేఖర్,మార్కెటింగ్ : ఫస్ట్ షో.

# ఈ కాలంలో ఏం తినాలి? ఏం తినకూడదు?



వర్షాకాలంలో చాలామంది జబ్బు పడుతుంటారు. ఇందుకు వాతావరణంలో జరిగే మార్పులే కాదు. మనం తీసుకునే ఆహారం కూడా ఓ కారణమే అంటూన్నరు నిపుణులు. జీర్ణక్రియ మందకొడిగా ఉండే ఈ కాలంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదంటూన్నరు. మరి, ఈకాలంలో ఫుడ్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం..

**ఫ్రైడ్ ఫుడ్.. వద్దు !.....** వర్షాకాలంలో నూనెలో వేయించిన పదార్థాలు, ఫ్రైడ్ ఫుడ్స్ మంచివి కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ కాలంలో వాతావరణంలో తేమ పెరిగి జీర్ణ వ్యవస్థపనితీరు మందగిస్తుంది. కాబట్టి ఈ సమయంలో నూనె సంబంధిత పదార్థాలు తినడం వల్ల అవి తొందరగా జీర్ణం కావు. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. అంతేకాదు.. ఇలాంటి అనారోగ్యపూరిత ఆహారం బరువు పెరిగేలా చేసి ఇతర అనారోగ్యాలకూ దారితీస్తుంది. అందుకే వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

**ఇవి తొనద్దు !.......** అలాగే వర్షాకాలంలో బయట దొరికే చాట్, పానీపూరీ, కట్‌లెట్, పావ్‌బాజీ, వంటి పదార్థాలు తినడం వల్ల విరేచనాలు, పచ్చకామెర్లు.. వంటి సమస్యలు రావచ్చంటున్నారు నిపుణులు. ఇందుకు వాటి తయారీలో వాడే కలుషితమైన నీరే కారణం. అలాగే వీటితో పాటు బయట దొరికే పండ్ల రసాలకు కూడా దూరంగా ఉండాలి. అంతగా కావాలనుకుంటే ఇంట్లో స్వయంగా తయారుచేసుకొని తీసుకోవాలి.



**కడిగాకే తినాలి...** ఆకుకూరలు మట్టిలో మొలకెత్తుతాయి. వీటిని నేరుగా భూమిలోంచి తీసి కట్టలు కట్టి అమ్ముతుంటారు. ఈ క్రమంలో మట్టిలోని క్రిములు, పురుగులు ఈ ఆకులపై చేరతాయి. ఆకుల రంగులోనే కలిసిపోయిన ఈ పురుగుల్ని కనిపించ కుండా ఆకుల్ని అలగే కట్‌చేసి తీసుకోవడం వల్ల నక్రిములు కడుపులోకి చేరతాయి. కాబట్టి ఒక్కో ఆకు పరిశిలించకే తరుక్కోవాలి. అలాగే శుభ్రంగా కడిగాకే వండుకోవాలి. భూమిలో మొలకెత్తే పుట్టగొడుగులు, దుంపలకూ ఇది వర్తిస్తుంది.

**కావాల్సినప్పడే...** ఆఫీసులకు వెళ్లే మహిళలు పండ్లు, కూరగాయలు ముందురోజు రాత్రే కట్‌చేసుకొని పెట్టుకుంటారు. అయితే వర్షాకాలంలో ఈ పద్ధతి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎదుకంటే కట్ చేసుకొని పెట్టుకున్న పండ్లు, కాయగూరల ముక్కల్ని ఎంత జాగ్రత్తగా భద్రపరచినా.. ఈ కాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండడం వల్ల వాటిపై బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. వీటిని అలాగే తీసుకోవడం వల్ల లేనిపోనీ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటిని ఎప్పటికప్పుడే కట్ చేసుకోవడం మంచిది.

**మాంసాహారం...** ఈ కాలంలో మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదించడమే ఇందుకు కారణం. కాబట్టి వానాకాలంలో వీటికి సాధ్యమైనంత దూరంగా ఉండడమే మేలంటున్నారు నిపుణులు ఇక చేపలు, రొయ్యలు.. వంటి సీఫుడ్‌ని సైతం దూరం పెట్టేయడమే మంచిదంటున్నారు.



# ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యం




**ఆ ఇంట్లోవాళ్లు కోడికూతతో నిద్రలేస్తారు. లేగదూడలతో దోస్తీ చేస్తారు, ఉడుతలతో ఆటలాడుతారు. వీళ్లుండేది ఏదో మారుమూల ప్రాంతంలో కాదు, ఆధునికత అందినంత కాలంలోనే ఉన్నా, వద్దనుకుని ప్రకృతి జీవనాన్ని ఎంచుకుంది శ్రావణ లక్ష్మి కుటుంబం! ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..**

మేం ఉంటున్నది బాపట్ల జిల్లా, మార్టూరు దగ్గరలోని బొబ్బేపల్లిలో, ఇరుగుపొరుగు ఎవరూ లేరు. అందుకంటే మేం ఇల్లు కట్టుకున్నది పొలాల మధ్యలో. కాలుష్యానికీ, రణగొణ ధ్వనులకు రంగా ప్రకృతి ఒడిలో బతకాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనను ఎంచుకోవచ్చు. మా సొంతూరు గుంటూరు దగ్గర్లోని కాకుమాను. ఎంబీఏ పూర్తయ్యాక హైదరాబాద్‌లో ఉద్యోగం చేశా. 2016లో వెళ్లింది. మావారు జీవీ ప్రభుత్వోద్యోగి, ఆయన ఉద్యోగరీత్యా అప్పట్లో ప్రకాశం జిల్లాలో ఉండేవాళ్లం. మా పెద్దబ్బాయికి ఏడు నెలల తర్వాత ఫిట్స్ వచ్చాయి. హాస్పిటల్లో ఉండటం, విపరీతంగా మందులు వాడటం, బాబు చేతికి సూదులు... ఆ అనుభవం నా ఆలోచనల్ని మార్చేసింది. ఉన్నది ఒక్కటే జీవితం... బతకాల్సిన విధానం ఇది కాదనిపించింది. పిల్లలకు ఆరోగ్యకరమైన పాలైనా ఇవ్వలేకపోతున్నామని... పుంగనూరు ఆవు కొన్నాను. ఆ తర్వాత నా ఆలోచనలకు కొత్త రెక్కలు వచ్చాయి. రెండోవాడు పుట్టాక జీవన విధానమే అమరిపోవాలనుకున్నా. మరో 20 ఏళ్లకూ కాలుష్యం చేరని ప్రాంతంలో నివాసం ఏర్పాటుచేసుకోవాలనుకున్నా. మావారు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు కానీ, అమ్మానాన్న, అత్తమామ వ్యతిరేకించారు.

**మొండి పట్టు వీడితేగా!**

ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో స్థలం తీసుకుని, ఇల్లు కట్టుకున్నాం. ముగ్గురు పిల్లలతోపాటు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మొదట్లో కనీస సౌకర్యాలకూ ఇబ్బందే. క్రమంగా ఒక్కోటీ సమకూర్చుకుంటూ వచ్చాం.

పండ్లూ, కూరగాయాలూ ఇక్కడే... ప్రకృతిలో బతకడం అంటే కిటికీ దగ్గరో, బాల్కనీలోనో కూర్చొని పరిసరాల్ని చూటం కాదు. ఆ జీవనశైలినీ భాగం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మొదలై, సూర్యాస్తమయంతో మా రోజు ముగుస్తుంది. ప్రకృతితోనే చుట్టరికం, మూగజీవాలతోనే నేస్తరికం. రసాయనాలుండే బూత్‌పేస్ట్‌ని పొద్దున్నే నోట్లో పెట్టడడం ఎందుకు? బదులుగా ఆవు కచ్చిక, వేప పుల్లని ఉపయోగిస్తాం. సబ్బులూ, షాంపూలూ నిషేధమే. నేనే రోజూ వాకిలి ఊడ్చి, కల్లాపి చల్లి, ముగ్గుపెడతా. పేడ తీస్తా, పశువులకు దాణా పెడతా, పాలు పితుకుతా, వంట చేస్తా దీన్లో శారీరక శ్రమ ఉంటుంది. అయినా భయపడను. మొదట్లో ప్రకృతి నన్ను పరీక్షించింది. దాన్లో నిలిచి గెలిచాను, పిల్లల్ని ఈ ఊళ్లోనే ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నా. వాళ్లూ చేతనైన పనులువాటినే ఇస్తాను.



అందుకు ఆహార వనం సృష్టించు కుంటున్నాం. మామిడి, అరటి, జామ, సపోటా, ఈత సహా 20 రకాల పండ్ల చెట్లు ఉన్నాయి పది రకాల కూరగాయల్నీ పండిస్తాం. మొక్కలంటే మావారికీ ఇష్టం. భిన్న రకాలను తెస్తుంటారు. 100 వరకూ నాటుకోళ్లు, పది ఆవులు ఆరు ఎద్దులు, బాతులు, కుందేళ్లు ఉన్నాయి. వీటికితోడు వందల పక్షులు అతిథులుగా వస్తాయి. బియ్యం, పప్పులు మాత్రం బయటకొంటాం. వాటినీ పండించాలనేది నా లక్ష్యం. ఆహారంలో నూనెకూ ప్రాధాన్యం ఉంది. అందుకే ఎద్దుగానుగ ఏర్పాటుచేసుకుని సొంత తయారీ మొదలుపట్టా. మా పిల్లలకు 20 ఏళువచ్చేంతవరకైనా ఈ వాతావరణంలోనే పెంచుతా. తర్వాత ఏం చేయాలి, ఎక్కడ ఉండాలన్నది వాళ్ల ఇష్టం నేనైతే వాళ్లని రైతుల్ని చేయాలనుకుంటున్నా.!

**ఆర్థిక స్థిరత్వం ముఖ్యం..** ఈ ధైర్యం, పట్టుదల ఎక్కణ్నుంచి వచ్చాయని అడుగుతుంటారు చాలామంది. అమ్మానాన్న, అమ్మమ్మల నుంచే వాళ్లు ఏ రోజూ కష్టపడ్డానికి వెనకాడలేదు. అమ్మమ్మకు కూర్చుని తినే అవకాశం ఉన్నా, అందరితోపాటు కష్టపడేది. ప్రకృతి ఒడిలో జీవించాలన్న ఆలోచన చాలామందికి ఉంటుంది. అలాంటివారికి ఈ జీవనవిధానంలో ఉండే సంతృప్తినీ, సాధకబాధకాల్నీ యూట్యూబ్ ఛానెల్‌ద్వారా తెలియజేస్తున్నా. ఇలా ఉండాలనుకునేవాళ్లు ఒకరిపైన ఆధారపడకుండా పనులన్నీ చేయడానికి సిద్ధపడాలి. మూగజీవాలకు ఏలోటు రాకుండా చూడాలి. ఆర్థిక స్థిరత్వమూ చాలా ముఖ్యం. □

## చెలి చిట్కా

మైదా పిండి గోధుమ పిండికీ పురుగు పట్టకుండా ఉండా లంటే నాలుగు చెమ్చాల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి. □

# తలలో పూల రబ్బరు బ్యాండు !



పూలంటే ఇష్టపడని మగువ లుంటారా చెప్పండి! కానీ, తీరిక లేకో, కార్పొరేట్ వస్త్రధారణకు నప్పకో పూలు పెట్టుకోవడం తగ్గించేశారు చాలామంది యువత. కానీ, సంప్రదాయంగా చీరకట్టో, లంగా ఓణీ ధరించాక పూలు పెట్టకుండా జుట్టుని వదిలేస్తే ఎబ్బెట్టుగా ఉండదూ! అలాంటి సందర్భాల చక్కగా జడ అల్లి ఓ చిన్న పువ్వు అయినా తలలో తురిమి.. మురిసిపోయిన అమ్మ గుర్తొచ్చేస్తుంది. అలాగని మనమే కొనుక్కుందామంటే పొద్దున్నే అంత తీరికెక్కడిది? పైగా ప్రయాణాలు, మీటింగ్‌లూ.. ఇలా మనం తిరిగే హడావుడికి ఇట్టే వాడిపోతాయి. ఇక, మీకా బెంగ అక్కర్లేదు. ఇలాంటి వారికోసమే రబ్బరు బ్యాండ్ల రూపంలో ఆర్టిఫిషియల్ పూల మాలలు వచ్చేశాయి. జడ అల్లుకున్నా, పోనీ వేసుకున్నా, కొప్పు పెట్టుకున్నా.. దీంతో బిగించేయండి రాలిపోతాయనో, వాడిపోతాయనో భయమూ అక్కర్లేదు. బాగుంది కదూ! □



# వారికి మొదలవుతుందా ?



పాపకి పదేళ్లు వచ్చాయంటే చాలు.. రజస్వల కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ వయసు నుంచి ఆమెకు పోషకాలన్నీ అందుతున్నాయో లేదో సరిచూసుకోవాలి. అప్పుడే నెలసరి ఇబ్బందులు, గర్భాశయ సమస్యలు, రక్తహీనత, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

**ఇనుము :** ప్రపంచదేశాలతో పోల్చితే మనదేశంలోనే రక్తహీనతతో బాధపడుతోన్న మహిళలు, పిల్లలు ఎక్కువట. ఆడపిల్లల్లో రుతుక్రమం మొదలయ్యాక ఈ ఇబ్బంది తలెత్తకూడదంటే.. వారి ఆహారంలో తప్పనిసరిగా ఇనుము ఉండేలా చూసుకోవాలి. ఫిష్, లివర్ వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఐరన్ అధికమోతాదులో లభిస్తుంది.

**కాల్షియం :** ఇనుము తరవాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం కాల్షియం. ఇది లోపిస్తే ఎముకలు బలహీనంగా మారతాయి. మూడుపదులు దాటాక, మెనోపాజ్ దశలోనూ.. కీళ్ల సమస్యలు రావొచ్చు. పాలు, పాల సంబంధిత పదార్థాలను తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగుని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరు సెనగ పప్పు, పప్పుధాన్యాల నుంచి ఎక్కువగా లభిస్తుంది.

**మేలు చేసే కొవ్వులు :** చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికారకం అనుకుంటారు. కానీ వీటిల్లో శరీరానికి మేలు చేసే కొవ్వులూ ఉంటాయి. వీటి అవసరం ఎంతో ఉంటుంది. బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిలో పీరియడ్స్ క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే.. స్థూలకాయుల్లో కొవ్వులు ఎక్కువవ్వడం మరో కారణం. కాబట్టి వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ కొవ్వులు సరిగ్గా ఉంటేనే తీసుకునే ఇతర ఎ,డి,ఇ,కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. □

# మెదడుకు మేలుచేసే కొర్రలు

కొర్రబియ్యాన్ని ఫాక్స్ టెయిల్ మిల్లెట్ అంటారు. చిన్నగా నలుసంత ఉంటే వీటిని నక్కతోకతో పోల్చెడు తమాషానే కదూ! ఆడ ఉంచితే ఇది గొప్ప పోషకాహారం. ఇవి తెలుపు, పసుపు రంగుల్లో దొరుకుతాయి. వీటితో జావ, రొట్టెలు, ఇడ్లీలు, గారెలు, ఉప్మా, కిచిడీ, ప్యాక్, సలాడ్, పులావ్, దోక్లా, వెజ్జి బౌల్, లడ్డూ, ఖీర్, హల్వా, ఇలా ఎన్నో వంటకాలు చేసుకోవచ్చు. కొర్రలు ఎంత మేలు చేస్తాయంటే.. వీటిలో ప్రొటీన్లు, క్యాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, ఐరన్, పీచు, విటమిన్ బి3, బి6, బి9, బి12 ఉన్నాయి. తింటే, కండరాలు, ఎముకలు పటిష్టంగా ఉంటాయి. హాయిగా నిద్రపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణప్రక్రియ బాగుంటుంది. ఇది ప్రో బయాటిక్గా పనిచేస్తుంది. ఊబకాయం రాదు. ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. కొర్ర ఇడ్లీలు ఇలా..... కొర్రలు కప్పు, మినప్పప్పు అరకప్పు, కాస్త ఉప్పు, అర చెంచా మెంతులు తీసుకోవాలి. కొర్రలు, మినప్పప్పులను ఆరు గంటల పాటు విడివిడిగా నానబెట్టి మెంతులు, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ పిండిని సుమారు పది గంటలు నానబెట్టి ఇడ్లీలు వేసి రోటి పచ్చడి లేదా సాంబార్‌లో తింటే ఎంతో బలం. □



# డైపర్లు వాడుతున్నారా?

పసి పిల్లలకు డైపర్లు వేయడం ఇప్పుడు అలవాటుగా మారింది కానీ, ఈ పని దీర్ఘకాలంలో అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందంటున్నారు నిపుణులు. పనిఒత్తిడి, అసౌకర్యం తగ్గించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఈ వెసులుబాటు కాస్తా ఇప్పుడు తప్పనిసరి అలవాటుగా మార్చేశారనీ చెబుతున్నారు. పిల్లలకు నడకవచ్చిన నాటి నుంచే తమంతట తాముగా కాలకృత్యాలు తీర్చుకోవడం క్రమంగా నేర్పాలట. లేదంటే వారికి టాయిలెట్ ట్రెయినింగ్ ఇవ్వడం కష్టమవుతుంది. అలాకాకుండా తాత్కాలికంగా మీ సౌకర్యం కోసం గంటల తరబడి డైపర్లను వేసి ఉంచడం వల్ల చెమట, తడి.. వంటివి చేరి బ్యాక్టీరియా రెట్టింపు అవుతుంది. ఆ తరువాత వాటిని ఎక్కువసేపు తీయకుండా ఉంచేయడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశమూ ఉంది. అందుకే, గంటా రెండు గంటలు మినహా వాటిని వేయకపోవడమే మేలని సూచిస్తున్నారు. □



# నైపుణ్యాలు పెంచుకుంటున్నారా?



నైపుణ్యం.. నిరంతర సాధన ఫలితం. అది అకస్మాత్తుగా వచ్చేది కాదు.. అన్నారు అబ్దుల్ కలాం. చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ.. నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. అయితే అలాంటి సాధన చిన్న వయసు నుంచే అలవర్చుకోవాలంటున్నారునిపుణులు. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులవుతాయని, అవే ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతాయని చెబుతున్నారు.

**మార్పు మంచిదే!....** ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు. కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడిపోయిందని చెప్పాలి. ఇక భవిష్యత్తులో ఇది మరెంత అడ్వాన్స్‌డ్‌గా మారనుందో ఊహించగలం. ఈ క్రమంలో టెక్నాలజీలో వస్తోన్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగానే కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ఉత్సుకత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

**కమ్యూనికేషన్ ముఖ్యం ....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటున్నారు నిపుణులు. పైగా రిమోట్ వర్కింగ్ వాతావరణంలో మీరు మీ బృందంతోనే కాదు.. ఇతర కంపెనీ బృందాలతో, విదేశీ టీమ్‌తోనూ పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.




**విశ్లేషించగలగాలి....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటున్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు. ఇతర బృందాలతో సైతం పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**పోటీని తట్టుకునేలా...** ఈ రోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు నిపుణులు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే.. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంచుకున్న రంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు.. విజయం సాధించేలా చేస్తాయి. □

# మనసుకెంతో ఆనందం చిట్టి గులాబీలు



చూడచక్కని రంగుల్లో, అందమైన ఆకృతిలో విచ్చుకునే గులాబీ అంటే మనసు పారేసుకోనివారు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ అవి గుత్తులు గుత్తులుగా నిరబూస్తుంటే మనసుకెంతో ఆనందం. పైగా ముళ్లూ తక్కువగా ఉంటే మరింత సంతోషం. అలాంటివే ఈ బటన్రోజెస్, వీటినే మినియేచర్ గులాబీలని కూడా అంటారు. మరి వీటినెలా పెంచుకోవచ్చో చూద్దామా! చైనా, యూరోపియన్ గులాబీలను సంకరం చేయడం ద్వారా అభివృద్ధి చేసిన రకం... బటన్రోజ్. ఈ మినియేచర్ గులాబీకి 1800వ సంవత్సరంలో ప్రాణం పోశారట. తక్కువ కాలంలోనే దాన్ని అందంతో ఎక్కువ ఆదరణ పొందింది. దీన్ని ఎక్కడ పెంచినా ఆ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేస్తుంది. తక్కువ ప్రదేశంలోనూ ఇవి చక్కగా ఎదుగుతాయి. అందుకే, వీటిని కంటైనర్ గార్డెన్స్, బాల్కనీలు... కాలి బాటల పక్కన ఎక్కడైనా పెంచుకోవచ్చు. దీనికి మెయింటెనెన్స్ తక్కువ. ఈ బటన్ రోజ్లు 12 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. హ్యాంగింగ్ పాట్స్ ఇవి చక్కని ఎంపిక బటన్‌లోజ్ ఆకులు చిన్నగా, నిగనిగలాడుతూ ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు, నారింజ... వంటి రంగుల్లో ఇవి విచ్చుకుంటాయి.



**ఎలా పెంచాలంటే...** గులాబీ బటన్ మొక్కలు ఇంతటి ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణం... వాటి సులువు కావడమే. ఇవి ఆరోగ్యంగా పెరగాలంటే కనీసం 4-6 గంటలు ప్రత్యక్షంగా ప్రసరించేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువగా వచ్చే బాల్కనీల్లోనూ పెంచుకోవచ్చు. సారవంతమైన పొడి నేలల్లో వీటిని నాటుకుంటే మేలు. ఆ నేల కోసం ఆ నేలలో కాసిన్ని పటిక నీళ్లు అప్పుడప్పుడూ చల్లుకుంటే సరి. మట్టిలో కాస్త పెర్లైట్ లేదా ఇసుకని, పొటాషియం ఎక్కువగా ఉంటే నెలరోజులకోసారి పూస్తాయి. పూలు పూయడం అయిపోయాక తప్పక ప్రూనింగ్ చేయాలి. వాడిపోయిన పువ్వులనూ ఎప్పటికప్పుడు తీసేయాలి. అప్పుడే పూలతో నిండుగా, ఆరోగ్యంగా ఎదుగుతాయి. □

# గౌతముడి తిరస్కరణ

ఆధ్యాత్మికం

సిద్ధార్థుడు వివిధ ప్రాంతాలు తిరుగుతూ ధర్మబోధలు చేస్తున్నాడు. ఒకరోజు ఓ పిసినారి వ్యాపారి ఇంటి ముందు నిలబడి ఆహారం అర్థించగా అతడు పరుష పదజాలంతో దూషించాడు. తథాగతుడు చిరునవ్వుతో వెళ్లిపోయాడు. అలా గౌతముడు వెళ్లి నప్పుడల్లా ఆ వ్యాపారి తిట్టి పంపాడు. బుద్ధుడి ముఖంలో ప్రసన్నత చెదరలేదు. కొన్నాళ్లకు వ్యాపారి ఇంట్లో ఆహారం మిగిలిపోయింది. అది వృథా అవుతుందని బౌద్ధ బిక్షువుల కోసం ఎదురుచూస్తున్నాడతడు. ఎప్పటిలాగానే బుద్ధుడు అతని ఇంటి ముందుకు వచ్చాడు. వ్యాపారి మిగిలిన ఆహారాన్ని తీసుకొచ్చి ఇవ్వబోయాడు.



సిద్ధార్థుడు సున్నితంగా తిరస్కరించాడు. ఎందుకు తీసుకోవడంలేదు? అనడిగాడు వ్యాపార. నాకు అవసనరం లేదు. నేను తీసుకోలేదు కనుక అది నీ దగ్గరే ఉంది. అలానే ఇన్నాళ్లూ నీ తిట్లూ నిందలనూ కూడా నేను స్వీకరించలేదు కనుక అవి నీ దగ్గరే ఉన్నాయి. అంటూ బదులిచ్చాడు. ఇంతకాలం తానెంత మూర్ఖంగా ప్రవర్తించాడో, కఠిన పద జాలంతో ఎంతమందిని హింసించాడో అర్థమై చింత్తించాడు వ్యాపారి. ఆ తర్వాతెన్నడూ పిసినారితనం చూపలేదతడు. అడగకుండానే ధనం పంచేవాడు. □

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఘోర పరాభవం



## అత్యల్ప స్కోర్‌కే ఆలౌట్

### 26 రన్స్‌తో టాప్-1లో న్యూజిలాండ్

**న్యూఢిల్లీ:** గత కొన్ని సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్ నాటకీయ పతనానికి సాక్ష్యంగా నిలుస్తోంది. టెస్ట్ క్రికెట్‌లో పాల్గొనే వివిధ జట్లు దారుణంగా అత్యంత తక్కువ స్కోర్‌కే ఆలౌట్ అయి ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటున్నాయి. వెస్టిండీస్ ఇటీవల టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప జట్టు స్కోరును రికార్డు స్థాయిలో సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో పాటు, అపఖ్యాతి పాలైన జట్టు పతనాల జాబితాలో చేరింది. టెస్ట్ క్రికెట్‌లో న్యూజిలాండ్ అత్యల్ప స్కోరు 26 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది మార్చి 1955లో ఇంగ్లాండ్‌తో జరిగింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో కివీస్ జట్టు ఇంగ్లాండ్ బౌలింగ్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 20పరుగుల తేడాతో గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు చేసిన జట్టులో అగ్రస్థానానికి చేరింది. ఇక గత నెల (జులై, 2025) 14వ తేదీన జమైకాలోని సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియా చేతిలో 27 పరుగులకే ఆలౌట్ అయిన వెస్టిండీస్ అవాంఛనీయ చరిత్ర సృష్టించింది. మిచెల్ స్టార్క్ ఆరు వికెట్లు పడగొట్టి కరేబియన్ జట్టు పతనానికి దారితీసేలా చేశాడు. ఇది ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప స్కోరుగా రికార్డయింది. అలాగే 1896లో గ్కెబెర్హాలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 రన్స్‌కే దక్షిణాఫ్రికా ఆలౌట్ అయి అవమానకరమైన పతనాన్ని చవిచూసింది. పర్యాటక జట్టు ప్రోటీస్‌ను 288 పరుగుల తేడాతో ఓడించింది. ఇక 1924లో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో 30 పరుగుల దారుణమైన స్కోరు కారణంగా దక్షిణాఫ్రికా మరోసారి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఇంగ్లాండ్‌తో మళ్లీ తలపడిన దక్షిణాఫ్రికా జట్టు సీమ్ అనుకూల పరిస్థితుల్లో ఇబ్బంది పడి ఇన్నింగ్స్ 18 పరుగుల తేడాతో టెస్టును కోల్పోయింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో నాల్గవ అత్యల్ప జట్టు స్కోరుగా నమోదైంది. 1899లో కేప్ టౌన్‌లోని న్యూలాండ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 35 పరుగులకే పరిమితమైన కారణంగా ఈ జాబితాలో మూడోసారి చోటు దక్కించుకుంది. సొంత మైదానంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ప్రోటీస్ జట్టు ఇంగ్లండ్ బౌలర్ల ఎదుర్కోలేక 210 పరుగుల తేడాతో పూర్తిగా ఓడిపోయింది. టెస్ట్ క్రికెట్ ప్రారంభ సంవత్సరాల్లో ఇంగ్లాండ్ ఆధిపత్యం ఇదే.



## డబ్ల్యూటిసి పాయింట్స్‌లో..

# దూసుకొచ్చిన టీమిండియా

### నాలుగుకు దిగజారిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ సిరీస్ తర్వాత డబ్ల్యూటిసి పాయింట్స్ పట్టికలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా పాయింట్స్‌లో 46.67 విజయ శాతంతో మూడో స్థానానికి దూసుకొచ్చింది. ఇక ఇంగ్లాండ్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, శ్రీలంక రెండో స్థానంలో నిలిచింది. డబ్ల్యూటిసి తాజా సైకిల్‌లో భారత్ ఐదు టెస్టుల ఆడగా 2 విజయాలు, 2 ఓటములు, ఒక డ్రా నమోదు చేసి 28 పాయింట్లతో మూడోస్థానంలో ఉంది. మొత్తంగా 46.67 విజయశాతంతో భారత్ మూడో స్థానంలో ఉంది. స్లో ఓవర్ రేట్ కారణంగా రెండు పాయింట్లు కోల్పోయిన ఇంగ్లాండ్ 43.33 విజయ శాతంతో నాలుగో స్థానకు పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (100 విజయ శాతం), శ్రీలంక (66.67 విజయశాతంతో) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. బంగ్లాదేశ్ (16.67), వెస్టిండీస్ (0) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక డబ్ల్యూటిసి సైకిల్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లలో భారత్ గెలిస్తే టాప్2లోకి దూసుకెళ్ళే అవకాశం ఉంది. వచ్చే ఏడాది టీమిండియా శ్రీలంక, న్యూజిలాండ్‌లతో టెస్ట్ సిరీస్ ఆడనుంది. అందులోనూ గెలిస్తే డబ్ల్యూటిసి ఫైనల్ అవకాశాలు మెరుగుపడతాయి. ఈ సైకిల్ చివరి సిరీస్‌లో భారత్ సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్టులు ఆడనుంది. మొత్తంగా మిగిలిన 14 మ్యాచ్‌లలో భారత్ నాలుగింటిని మాత్రమే విదేశాల్లో ఆడనుంది. దీంతో ఈసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు భారత్ చేరేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి.



## బాస్కెట్ బాల్ ఆసియా కప్‌లో

# జోర్డాన్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఫిబా ఆసియా కప్-2025లో భారత్ తొలిగ్రూప్ మ్యాచ్‌లో జోర్డాన్‌చేతిలో ఓడిపోయింది. టోర్నమెంట్‌లో తమ స్థానాన్ని సంపాదించుకున్న నెల తర్వాత, భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు టోర్నమెంట్ యొక్క గ్రూప్ దశల్లో తిరిగి అడుగుపెట్టింది. రికార్డు స్థాయిలో 16 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చైనా, ఆతిథ్య సౌదీ అరేబియా మరియు జోర్డాన్‌లతో కలిసి భారతదేశం గ్రూప్ సిలో ఉంది. మ్యాచ్‌లో భాగంగా మంగళవారం జెడ్డాలోని కింగ్ అబ్దుల్లా స్పోర్ట్స్ సిటీలో జరిగిన మ్యాచ్‌తో ప్రపంచ 35వ ర్యాంకర్ జోర్డాన్‌తో భారత్ తలపడింది. ఇందులో భాగంగా ప్రారంభ గ్రూప్ సి ఎన్‌కౌంటర్‌లో భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు అదనపు సమయం తర్వాత జోర్డాన్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. 2011 ఆసియా కప్ రజత పతక విజేత డార్ టక్కర్ 30 పాయింట్లుసాధించడంతో స్కాట్‌ఫ్లెమింగ్ జట్టు జోర్డాన్‌చేతిలో 84-91 తేడాతో పరాజయంపాలైంది.

## మహిళల చెస్ ఛాంపియన్‌షిప్..

# వైశాలి ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్ ఆలిస్ లీ చేతిలో ఓడిపోవడంతో భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్ 2025 నుండి నిష్క్రమించింది. వైశాలి 5+1 విభాగంలో ఆధిపత్యం చెలాయించింది. మూడు విజయాలు మరియు ఒక డ్రాతో ఆమె 3.5-0.5 ఆధిక్యంలో ఉంది. అయితే, లీ 3+1 విభాగంలో తిరిగి పుంజుకుంది. ఒక డ్రా తర్వాత, ఆమె వరుసగా నాలుగు ఆటలను గెలుచుకుంది. ఆమె చివరి విభాగంలో కూడా 3-2 స్కోరుతో విజయం సాధించి విజయాన్ని నమోదు చేసింది. కాగా అన్ని మ్యాచ్‌లు మూడు విభాగాలుగా కేటాయించారు. ప్రారంభ రౌండ్ మరియు క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆటగాళ్ళు 5+1 ఆటలను (ప్రతి కదలికకు ఒక సెకను పెరుగుదలతో 5 నిమిషాల సమయ నియంత్రణ) 45 నిమిషాలు ఆడారు. తరువాత 3+1 ఆటలను 30 నిమిషాలు మరియు చివరకు, 1+1 ఆటలను 15 నిమిషాలు ఆడారు. ఇక సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో మిగిలిన పోటీదారులు 75 నిమిషాలు 5+1 ఆటలను ఆ తరువాత 3+1 ఆటలను 50 నిమిషాలు చివరకు, 1+1 ఆటలను 25 నిమిషాలు ఆడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైశాలి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

## గోల్ఫ్ వరల్డ్ టోర్నీలో..

# భన్సాలీ ఛాంపియన్

**న్యూఢిల్లీ:** యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్-2025లో వేదిక భన్సాలీ సంచలన విజయంతో ఛాంపియన్‌గా నిలిచింది. నార్త్ కరోలినాలోని పైన్‌హర్స్ట్ విలేజ్‌లో మంగళవారం జరిగిన ప్రతిష్టాత్మక యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన వేదిక భన్సాలీ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బాలికల 9 ఏళ్ల వయసు గ్రూప్ టైటిల్‌ను గెలుచుకుంది. బెంగళూరుకు చెందిన ఈ యువతి తన చివరి తొమ్మిది హోల్ రౌండ్‌లో బోగీ లేకుండా 4 అండర్ 32 కార్డ్‌ను సాధించింది. 33-33-32 స్థిరమైన రౌండ్లతో, వేదిక 10అండర్ టోటల్‌ను నమోదు చేసింది. జపాన్‌కు చెందిన ఎమి మినామి కంటే ఒక షాట్ ముందు అమెరికాకు చెందిన ఆడ్రీ జాంగ్ కంటే రెండు స్ట్రోక్‌ల ఆధిక్యంలో ఉంది. భారత్‌కు చెందిన ఐదా తిమ్మయ్య బాలికల 11 విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. ఐదా ముగింపు రౌండ్‌లో 6 అండర్ 66తో షాట్ కొట్టింది, దీనితో ఆమె మూడు రౌండ్ల మొత్తం 7అండర్ (75-68-66)కి చేరుకుంది. ఈ విభాగంలో అమెరికా నుండి బెల్లా సిమోస్ 21-అండర్‌తో ముగించగా, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ వెంకటరాఘవన్ మనవరాలు అనన్య వెంకటరాఘవన్ 10-అండర్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గత ఏడాది పోడియం ఫినిషర్ అయిన చండీగఢ్‌కు చెందిన నిహాల్ చీమా, బాలుర 8వ విభాగంలో 38-39-35 రౌండ్లు నమోదు చేసి నాల్గవ స్థానంలో నిలిచాడు. ఇక నోయిడాకు చెందిన కబీర్ గోయల్ బాలుర 10 విభాగంలో 72-70-68 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు.

# భారత్ ఆర్థికవృద్ధి 6.4 నుంచి 6.7%

## డెల్లాయిట్ ఇండియా విశ్లేషణ

**ముంబై, ఆగస్టు 5:** డెల్లాయిట్ ఇండియా కంపెనీ భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.4 నుంచి 6.7శాతం మధ్యలో ఉంటుందని అంచనావేసింది. దేశీయంగా ఉన్న వనరులు కొంత మేర పటిష్టపడటంతో పాటు గ్లోబల్ అవకాశాలను మరింత విస్తరించుకోవడం వల్ల భారత్ ఆర్థికవృద్ధి మరింత పెరుగుతుందని డెల్లాయిట్ విశ్లేషించింది. భౌగోళిక అనిశ్చితులను అధిగమించే శక్తిసామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని, అలాగే వాణిజ్య విస్తరణపై భారత్ మరింత దృష్టిసారించాల్సి ఉంటుందని వెల్లడించింది. వ్యూహాత్మక వాణిజ్య సంప్రదింపులు కొంతమేలు చేస్తాయి. ప్రత్యేకించి గత నెలలో యునైటెడ్ కింగ్‌డమ్‌తో కలిసి చేసిన చర్చలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగడం అలాగే వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అమెరికాతో జరుపుతున్న సంప్రదింపులు కొలిక్కి వస్తున్నాయని, ఈ తరుణంలో భారత్‌లో వాణిజ్య పరంగా మరింత వృద్ధి నమోదవుతుందని వెల్లడించింది. ఆదాయవనరులపరంగాను, జాబ్స్,మార్కెట్‌కు చేరువ కావడం వంటి వాటితో దేశీయంగా డిమాండ్‌కూడా పెరుగుతుందని తెలిపింది. అందువల్లనే భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఏడాది 6.4నుంచి 6.7శాతం వరకూ వెళ్లే అవకాశం ఉంటుందని డెల్లాయిట్ అంచనా. గత ఏడాది 6.5 శాతంగా ఉన్న వృద్ధి ఈ సారి మరింత మెరగవుతుందని తెలిపింది. దేశీయంగా ద్రవ్యోల్బణం దిగిరావడం కూడా కొంతమేలు జరుగుతోంది. దేశీయంగా కేంద్రం అమలుచేస్తున్న విధివిధానాలు, అంతర్జాతీయ వాణిజ్య బంధాలు కూడా భారత్ ఆర్థికవృద్ధికి మరింత దోహదం చేస్తాయని చెపుతున్నారు. వినియోగారుల బేస్ పెరగడం, ప్రపంచ స్థాయిలో పోటీపడే వర్క్‌ఫోర్స్ భారత్‌కు మేలైన వనరులని డెల్లాయిట్ ఆర్థికవేత్త రుంకీ మజుందార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తన వాణిజ్యబేస్‌ను విస్తరించేందుకు భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇటీవల వాణిజ్య ఒప్పందాలు ఇందుకు దోహదం చేస్తాయి.




కృత్రిమ మేధ, డిజిటల్ పరివర్తనం, సృజనాత్మకతతో కూడి స్టార్టప్‌లు ఆవిర్భావం వంటివి భారత్ ఆర్థికవృద్ధికి దోహదం చేసానతయని డెల్లాయిట్ ఆర్థికవేత్త విశ్లేషించారు. అరుదైన ఖనిజ వనరులు, ప్రత్యేక ఎరువుల పరంగా కొంతమేర సమస్యలు ఎదురయినా భారత్ అధిగమించాల్సి ఉంటుందని తేల్చింది.అందివచ్చిన అవకాశాలతోపాటు దేశీయంగా పటిష్టంగా ఉన్న మూలవనరుల సాయంతో భారత్ ఆర్థికవృద్ధి మరింతగా పెరుగుతుందని, ఎలాంటి అనిశ్చితి పరిస్థితులనైనా అధిగమించ గలిగేస్థాయి భారత్‌కు ఉందని డెల్లాయిట్ విశ్లేషించింది.

# ఆపిల్‌కు భారత్ మంచి మార్కెట్



**వాషింగ్టన్, ఆగస్టు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చిర్రెత్తించే విషయాన్ని వెల్లడించారు యాపిల్ సీఈఓ టిమ్ కుక్. భారత్‌లో ఫోన్ల తయారీ చేపట్టడంపై ట్రంప్ తన అసహనం వ్యక్తం చేయగా, ఆయన వ్యాఖ్యలను పెడచెవిన పెట్టారు. అమెరికాలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమ్ముడైన ఐఫోన్లలో మెజారిటీ ఫోన్లు భారత్‌లో తయారైనవేనని చెప్పారు. ముమ్ముందూ ఆపిల్ తయారీ భారత్‌లో కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆపిల్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. మే నెలలో దోహా పర్యటన సందర్భంగా తన మనసులో మాటను బయట పెట్టారు. భారత్‌లో తయారీ చేపట్టడం తనకే మాత్రం ఇష్టంలేదంటూ టిమ్ కుక్ సమక్షంలోనే చెప్పారు. భారత్‌పై 25 శాతం సుంకాలను విధించారు. అయితే, అందులో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను మినహాయించారు. దీంతో ప్రస్తుతానికి ఐఫోన్లపై టారిఫ్ ఎఫెక్ట్ లేనట్లే. అయితే ముమ్ముందూ పరిస్థితి ఇలానే ఉంటుందని చెప్పలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆపిల్ రెండో త్రైమాసిక ఫలితాల సందర్భంగా టిమ్ కుక్ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో కొనసాగిన వైఖరే ముమ్ముందూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమెరికాలో విక్రయమయ్యే ఫోన్లు దాదాపుగా భారత్‌లో తయారైనవే. అమెరికాలో వినియోగించే ఇతర ఆపిల్ ఉత్పత్తులైన మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, యాపిల్ వాచ్‌లను వియత్నాంలో తయారుచేస్తున్నాం. ఇతర దేశాలకు చైనా నుంచి ఎగుమతి చేస్తున్నాం అని టిమ్ కుక్ వివరించారు. తయారీపరంగానే కాదు.. ఆదాయం పరంగానూ ఆపిల్‌కు భారత్ కలిసొచ్చింది. ఐఫోన్ల విక్రయం ద్వారా భారత్‌లో రికార్డు రెవెన్యూ వృద్ధి నమోదైందని టిమ్‌కుక్ వెల్లడించారు. భారత్, పశ్చిమాసియా, దక్షిణాసియా, బ్రెజిల్‌లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సగటున 10 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు.

# మార్కెట్లకు టారిఫ్ భయాలు..

**ముంబై, ఆగస్టు 5:** దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలను చవిచూశాయి. ట్రంప్ టారిఫ్ భయాలకు తోడు ఆర్‌బీఐ సమీక్షకు ముందు మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి (ఆగస్టు 5) ట్రేడింగ్‌లో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 24,700 మార్క్ కోల్పోయింది. ఉదయం 80,946.43 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా ఒడుదొడుకుల్లోనే సాగింది. ఒక దశలో 80,554 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివరకు 308.47 పాయింట్లు తగ్గి 80,710.25 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,59024,733 మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసే సమయానికి 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడింది. టారిఫ్ ఎఫెక్ట్, ముడిచమురు ధరల నేపథ్యంలో రూపాయి విలువ మరింతగా క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో 15 పైసలు పతనమై 87.81 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఇన్ఫోసిస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు భారీగా నష్టపోయాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తే భారత్ పై మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను



దెబ్బతీసింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. సోమవారం రూ.2,566.51 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్ఐఐలు విక్ర యించారు. ట్రంప్ టారిఫ్‌ల భయాలతో చమురు, గ్యాస్ రంగ షేర్లు కుదేలయ్యాయి. దాదాపు 1 శాతం మేర కుంగాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్ల కోతపై రిజర్వ్ బ్యాంక్ ఆచితూచి వ్యవహరించనుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి.

# ఎంజి ఎస్‌యువిలపై రూ.2.30లక్షల డిస్కౌంట్!

**ముంబై, ఆగస్టు 5:** కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ భారత్‌లో అడుగుపెట్టి ఆరేళ్ల పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ తన హెక్టార్, హెక్టార్ ప్లస్ ఎస్‌యూవీ మోడళ్లపై డిస్కౌంట్ ప్రకటించింది. ఇది పరిమిత కాల ఆఫర్‌గా కంపెనీ పేర్కొంది. వినియోగదారులు ఎంపిక చేసుకున్న మోడల్, వేరియంట్‌లను బట్టి ఆయా ఎస్‌యూవీలపై గరిష్ఠంగా రూ.2.30 లక్షల వరకు రాయితీలు ఉంటాయని తెలిపింది. 2019లో భారత మార్కెట్లోకి అడుపెట్టిన ఎంజీ హెక్టార్ దేశంలో మొట్టమొదటి ఇంటర్నెట్ కనెక్టెడ్ ఎస్‌యూవీగా పేరు పొందింది. అయితే, తాజా ఆఫర్‌లో భాగంగా హెక్టార్‌లోని అన్ని వేరియంట్ల పైనా గణనీయమైన తగ్గింపులను ప్రకటించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై అత్యధికంగా రూ.2.14 లక్షల వరకు ఆఫర్ అందిస్తున్నారు. దీంతో, ఆఫర్ సమయంలో రూ.19 లక్షలకే (ఎక్స్‌షోరూమ్ ధర) లభిస్తుంది. స్నోస్టార్మ్, బ్లాక్‌స్టార్మ్ వేరియంట్ల ధరలపైనా భారీగా డిస్కౌంట్‌లు ప్రకటించింది. అదే సమయంలో బేస్ వేరియంట్ స్టైల్ ట్రిమ్ ధర రూ.25వేలు పెంచడం గమనార్హం. హెక్టార్ ప్లస్6 సీటర్ అన్ని వేరియంట్ల ధరలనూ తగ్గించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై గరిష్ఠంగా రూ.2.30 లక్షల మేర తగ్గింపు ప్రకటించారు.



## వాణిజ్యం

# ఆల్‌టైమ్ గరిష్టానికి యుపిఐ లావాదేవీలు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ నెల 2న ఒకే రోజులో ఏకంగా 70 కోట్ల లావాదేవీల మైలురాయిని తొలిసారిగా అధిగమించి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఈ పరిణామం భారతదేశాన్ని రియల్ టైమ్ చెల్లింపుల రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. గత కొన్ని నెలలుగా యూపీఐ వినియోగం శరవేగంగా పెరుగుతోంది. జూన్ నెలలో రోజుకు సగటున 62.8 కోట్ల లావాదేవీలు నమోదు కాగా, కేవలం కొన్ని వారాల్లోనే ఈ సంఖ్య 70 కోట్లు దాటడం విశేషం. కేవలం జులై నెలలోనే 1947 కోట్ల లావాదేవీలు జరగ్గా, వాటిమొత్తం విలువ రూ.25.1 లక్షల కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 35 శాతం, విలువలో 22 శాతం వృద్ధి కనిపించింది. భవిష్యత్తులో రోజుకు 100 కోట్ల లావాదేవీలను చేరుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని యూపీఐ నిర్వాహక సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పేర్కొంది. సులభమైన వినియోగ విధానం, వ్యాపారుల నుంచి లభిస్తున్న ఆదరణే ఈ వృద్ధికి కారణమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 49.1 కోట్ల మంది వినియోగదారులు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని వాడుతున్నారు. యూపీఐ ఒకవైపు రికార్డులతో దూసుకెళుతున్నప్పటికీ, మరోవైపు దాని ఉచిత సేవల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్, ఆగస్టు 1 నుంచి పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించడం ప్రారంభించింది. ఫోన్‌పే, గూగుల్ పే వంటి సంస్థలు జరిపే వ్యాపార లావాదేవీలపై ఈ ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఛార్జీల భారం ప్రస్తుతానికి వినియోగ దారులపై నేరుగా పడనప్పటికీ, ఈ పరిణామం పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల ఆర్థిక లెక్కలను మార్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ బాటలోనే ఇతర బ్యాంకులు కూడా నడిచే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మొదలైన ఛార్జీల వసూళ్ల




# ఇడి ఎదుట హాజరైన అనిల్ అంబానీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. రూ.17వేల కోట్ల రుణ మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఇటీవల దర్యాప్తు సంస్థ ఆయనకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నేడు ఆయన దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అధి కారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది. ఇటీవల రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. ఇందులో కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక ఇదే కేసులో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీ అయ్యాయి. అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, సతీశ్‌సేథ్ సహా గ్రూప్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఇడి సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17వేల కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి ఈ చర్యలు చేపట్టింది. ఇందులో రిలయన్స్ హోమ్‌ఫైనాన్స్ రూ.5,901 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ రూ.8,226 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించి రూ.4,105 కోట్ల రుణాలున్నాయి. ఇప్పటికే అనిల్ అంబానీ దేశం విడిచి వెళ్లకుండా లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఓసి)ను కూడా ఇచ్చింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.